ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

epaper.vaartha.com WWW.VAARTHA.COM

తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త

వరంగల్ : fb.com/vaartha

Published from Warangal, Karimnagar, Hyderabad, Vijayawada, Visakhapatnam, Rajahmundry, Guntur, Nizamabad, Ongole, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

2-11-2024 శనివారం సంపుటి: 30 సంచిక: 274 పేజీలు: 8+16 వెల: 6.50

హెజ్బొల్లాపై ఇజ్రాయెల్ దాడి: 70 శాతం డ్రోన్లు ధ్వంసం

మహారాష్ట్రలో శతాధిక వృద్ధ ఓటర్లు 47 వేలు పైనే

5లో



## ఎస్సీ, ఎస్టీ, బిసి హాస్టళ్లలో డైట్ ఛార్జీలు హెచ్చింపు

### 10 రోజుల్లోగా అమలు చేయాలని అధికారులను ఆదేశించిన సిఎం రేవంత్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, నవంబరు1:** ప్రభుత్వ వసతి గృహ విద్యార్థులకు డైట్,కాస్మోటిక్ చార్జీలు పెంచిన నేపథ్యంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి బుర్రా వెంకటేశం,వివిధ సంక్షేమ విభాగాల కార్యదర్శులు కలిసి ధన్యవాదాలు తెలిపారు. దీపావళి కానుకగా రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ వసతి గృహాలు,ఎస్సీ,ఎస్టీ,బీసీ,మైనారిటీ వసతి గృహాలు,తెలంగాణ గురుకుల విద్యాసంస్థల సొసైటీ పరిధిలోని వసతి గృహాల్లో డైట్ చార్జీలను రాష్ట్ర ప్రభుత్వం తాజాగా పెంచింది. డైట్ చార్జీల పెంపు విషయంలో కమిటీ ప్రతిపాదనను యథా విధిగా అమలు చేయడంపై అధికారులు హర్షం వ్యక్తంచేశారు. విద్యార్థులకు పోషకాహారం అందేలా డైట్‌లో మార్పులు,చేర్పులు చేయాలని అధికారులకు సిఎం సూచించారు. పది రోజుల్లో కొత్త డైట్‌ను అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను సిఎం ఆదేశించారు. పెంచిన డైట్, కాస్మోటిక్ చార్జీలతో 7,65,705 మంది విద్యార్థులకు ప్రయోజనం చేకూరనున్నది.

**సమగ్ర సర్వేలో అన్ని వివరాలు చెప్పాలి : మంత్రి పొన్నం**

రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల 6 నుంచి ప్రారంభించనున్న సమగ్ర కుటుంబ సర్వేలో అందరూ పాల్గొనాలని.. వారి పూర్తి వివరాలను సర్వేకి వచ్చిన వారికి చెప్పాలని బిసి సంక్షేమం, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. >>2



## ఎడ్యుకేషన్ హబ్‌గా గాంధీ ఆశ్రమం

### బాపూఘాట్‌ను అద్భుతంగా తీర్చిదిద్దే ప్రణాళిక
### ప్రపంచంలోనే ఎత్తైన గాంధీ విగ్రహం ఏర్పాటు
### డిజైన్లపై సిఎం చర్చలు, విస్తృత సంప్రదింపులు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, నవంబరు1:** మూసీ తీరంలోని బాపూఘాట్‌ను అద్భుతంగా తీర్చిదిద్దాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. బాపూఘాట్‌లో ప్రపంచంలోనే ఎత్తయిన గాంధీ విగ్రహాన్ని ఏర్పాటు చేస్తామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇటీవలే ప్రకటించారు. బపూఘాట్ వద్ద బ్రిడ్జి కమ్ బ్యారేజీతో పాటు గాంధీ ఐడియాలజీ సెంటర్‌ను ఏర్పాటు చేయాలని సంకల్పించారు. ముఖ్యమంత్రి ఆదేశాలతో బాపూఘాట్‌ను అంతర్జాతీయ స్థాయిలో అభివృద్ధి చేసే పనులను ప్రభుత్వం వేగవంతం చేసింది. బాపూఘాట్‌ను సోదర సౌభ్రాతృత్వానికి సంకేతంగా, ప్రపంచ శాంతికి చిహ్నంగా అటు ఆధ్యాత్మికంగా, ఇటు విద్యాబోధన కేంద్రంగా రూపొందించాలని ముఖ్యమంత్రి నిర్ణయించారు. ప్రపంచంలోని అందరి దృష్టిని ఆకర్షించేలా బాపూఘాట్‌ను ఆధునాతనంగా అందరికీ ఉపయోగపడేలా తీర్చిదిద్దాలని తన ఆలోచనలను ఇటీవలే అధికారులకు వివరించారు. అటు ఉస్మాన్‌సాగర్, ఇటు హిమాయత్ సాగర్ నుంచి వచ్చే మూసీ,ఈసా నదుల సంగమం ప్రాంతంలో బాపూఘాట్ ఉంది. అందుకే ఈ ప్రాంతాన్ని గాంధీ సరోవర్‌గా అత్యద్భుతంగా తీర్చిదిద్దాలని నిర్ణయించింది.

గాంధీ బోధనలు,ఆయన ఆచరణ, ఆశయాలను ప్రతిబింబించేలా ఐడియాలజీ సెంటర్‌తో పాటు కమ్యూనికేషన్ స్కిల్ ఎథిక్స్ అండ్ వాల్యూస్ కోర్సులు నిర్వహించే ఎడ్యుకేషన్ హబ్‌గా గాంధీ ఆశ్రమంకూడా ఏర్పాటుచేయాలని యోచిస్తున్నారు. మూసీ నదీ తీరంలో సుందరమైన విశాల ప్రాంతం కావటంతో... బాపూఘాట్‌లో ఎలాంటి మహాత్మాగాంధీ విగ్రహాన్ని ఏర్పాటు చేయాలి... దీన్ని ఏ ఆకృతిలో తయారు చేయాలి.. ఎంత ఎత్తుతో తయారు చేయించాలి. డిజైన్లు ఎలా ఉండాలి. అనేది ఆయా రంగాల నిపుణుల సలహాలు,సూచనలను స్వీకరించనున్నారు. దేశవిదేశాల్లో ఎక్కడెక్కడ గాంధీ విగ్రహాలు >>2

## పటిష్టంగా ఉపాధి హామీ

### రైతులకు ఆదాయం పెంచేలా అమలు
### రాబోయే 5 నెలల్లో రూ. 1372 కోట్లతో ప్రణాళికలు
### వచ్చే వనమహోత్సవంలో 9 కోట్ల మొక్కలు: మంత్రి సీతక్క



**హైదరాబాద్, నవంబరు 1 ప్రభాతవార్త:** మహాత్మ గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామి పథకాన్ని రాష్ట్రంలో పకడ్బందీగా అమలు చేయాలని మంత్రి సీతక్క అధికారులను ఆదేశించారు. ప్రణాళిక బద్ధంగా పనులు చేయించాలని అధికారులకు సూచించారు. రైతుల ఆదాయం పెంచేలా ఉపాధి, హామి నిధులతో వ్యవసాయ అనుబంధ పనులకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. శాశ్వతంగా నిలిచేలా ఉపాధి హామి పనులు చేపట్టి, ఎప్పటికప్పుడు తనిఖీలు నిర్వహించాలన్నారు. రాష్ట్రంలో ఉపాధి హామి పనులపై మంత్రి సీతక్క శుక్రవారం సచివాలయంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ కార్యదర్శి లోకేష్‌కుమార్, కమిషనర్ అనితారామచంద్రన్, స్పెషల్ కమిషనర్ షఫీఉల్లా, మహిళా శిశు సంక్షేమ శాఖ డైరక్టర్ కాంతి వెస్లీ, ఇఎన్‌సి కనకరత్నంతో పాటు ఉన్నతాధికారులు హాజరయ్యారు. వచ్చే ఐదు నెలల కాలానికి సంబంధించి రూ.1372కోట్ల నరేగా నిధులతో చేపట్టే పనుల ప్రణాళికలకు ఆమోదం తెలిపారు. మహిళలకు ఉపాధి భరోసా, పంట పొలాలకు బాటలు, పండ్ల తోటల పెంపకం, వర్షపు నీటిని ఒడిసి పట్టడం, గ్రామాల్లో మౌలిక వసతుల కల్పన కింద చేపట్టే పనులను ఫైనలైజ్ చేశారు. రూ.106కోట్ల నిధులతో ఇందిరా మహిళా శక్తి కార్యక్రమం కింద ప్రతి నియోజకవర్గానికి సుమారు కోటి నిధులను వెచ్చించాలని నిర్ణయించారు. మొత్తం రూ.5400 మంది స్వయం సహాయక సంఘాల మహిళలకు ఆదాయాన్ని పెంచే దిశలో పశువుల కొట్టాలు, కోళ్ల షెడ్ల నిర్మాణం, వర్మి కంపోస్టు-వానపాముల ఎరువుల తయారీకి తొట్ల నిర్మాణం, ఎస్‌హెచ్‌జిలో ఉన్న రైతుల బీడు భూములను అభివృద్ధి చేసి సాగులోకి తీసుకుని వచ్చే ప్రణాళికలకు మంత్రి ఆమోదం తెలిపారు.

ఇక ప్రతి నియోజకవర్గానికి రూ.రెండు కోట్లు వెచ్చించి వ్యవసాయ పొలాలకు బాటలు వేయాలని నిర్ణయించారు. దీంతో పాటు 2700 ఎకరాలలో రూ.16.20 కోట్లు నిధులతో చిన్ని సన్నకారు రైతులకు ఉపాధి హామీ ద్వారా పండ్ల తోటలు, ఈత మొక్కలుపెంపకంచేపట్టి ఆదాయాభివృద్ధికి పెంచేలా ప్రణాళికలను సిద్ధం చేశారు. తొమ్మిది కోట్ల మొక్కలను పెంచి, వచ్చే సంవత్సరం వన మహోత్సవంలో నాటడానికి సిద్దంగా ఉంచాలనే లక్ష్యంగా పెట్టుకున్నారు. దీంతో పాటు >>2

## సింగరేణిలో భారీగా ఉద్యోగులకు ఉద్వాసన!

### ఉత్పత్తి, ఉత్పాదకతపై తీవ్ర ప్రభావం

**పినపాక, ప్రభాతవార్త:** రాష్ట్రంలో అతి పెద్ద పరిశ్రమగా కొనసాగుతున్న సింగరేణి సంస్థలో అతి పెద్ద సంక్షోభం తలెత్తింది. దేశ వ్యాప్తంగా ఉద్యోగ, ఉపాధి అవకాశాల కోసం ఎందరో నిరుద్యోగులు ఉద్యోగవేటలో తమ అదృష్టాన్ని పరీక్షించుకుంటున్న నేటి నిరుద్యోగ భారతంలో ఉన్న ఉద్యోగం చేయటం చేత కానీ కొందరు కనీస హాజరు శాతం లేక ఉద్యోగాలు కోల్పోయే పరిస్థితి ప్రభుత్వ రంగ సంస్థ అయిన సింగరేణిలో నెలకొనడం సంస్థ భవిష్యత్తుపై ఎన్నో ప్రశ్నలు సంధిస్తుంది. ఏడాది కాలంలో 365 పని దినాలకు కనీసం 140 రోజుల హాజరు కలిగి ఉండాలన్న కార్మిక చట్టాలను ఉల్లంఘిస్తూ సింగరేణి వ్యాప్తంగా 1891 మంది ఉద్యోగులు విధులకు గైర్హాజరు కావటంతో వారిని శాశ్వతంగా విధుల నుంచి తప్పించేందుకు సింగరేణి యాజమాన్యం రంగం సిద్ధం చేసింది. ఇందులో భాగంగా గత నెల 28న అన్ని ఏరియాల జనరల్ మేనేజర్లకు వారివారి ఏరియాల్లో గైర్హాజరు కార్మికుల వివరాలతో కూడిన సర్క్యులర్ జారీ చేసింది.

## ఒకేసారి 1300 మందికి పైగా 'జెఎల్'ల నియామకం

### మెరిట్ అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన పూర్తి
### ఒకటి, రెండు రోజుల్లో ఫలితాలు వెల్లడి

**హైదరాబాద్, నవంబరు 1, ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్రంలోని ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో లెక్చరర్ల కొరత తీరనుంది. తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్(టిజిపిఎస్సీ) రాష్ట్రంలోని ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో ఖాళీగా ఉన్న 1392 జేఎల్స్ పోస్టుల భర్తీ కోసం 2022, డిసెంబర్ 9న నోటిఫికేషన్ నంబర్ 22/2022ను జారీ చేసింది. జేఎల్ పోస్టుల భర్తీకి 2023లో పరీక్షను నిర్వహించిన కమిషన్ మెరిట్ లిస్టును ప్రకటించింది. అనంతరం గత కొద్దిరోజుల మెరిట్ లిస్టులోని అభ్యర్థులకి సర్టిఫికెట్ వెరిఫికేషన్‌ను నిర్వహిస్తూ వస్తోంది. గత నెల అక్టోబర్‌లో కూడా కొన్ని పోస్టులకి సంబంధించి మెరిట్ లిస్టు అభ్యర్థులకి సర్టిఫికెట్ వెరిఫికేషన్‌ను పూర్తి చేసిన కమిషన్ అక్టోబర్ 28న కెమిస్ట్రీ, హిస్టరీ, ఫిజిక్స్ సబ్జెక్టులతోపాటు సంస్కృతంలో మెరిట్ అభ్యర్థుల సర్టిఫికెట్ పరిశీలన అనంతరం సెలెక్టెడ్ అభ్యర్థులను ప్రకటించింది. దీంతో దాదాపు కమిషన్ జారీ చేసిన 1392 పోస్టులకి సంబంధించిన మెరిట్ అభ్యర్థుల సర్టిఫికెట్ వెరిఫికేషన్‌ను పూర్తిచేసి సెలెక్టెడ్ అభ్యర్థుల లిస్టును ప్రకటించినట్టు అయిందని అభ్యర్థులు చెబుతున్నారు. అన్ని సబ్జెక్టులకి సంబంధించిన సెలెక్టెడ్ అభ్యర్థుల లిస్టును ప్రకటించిన నేపథ్యంలో మొత్తం 1392 జేఎల్ పోస్టులకి ఎంపికైన అభ్యర్థుల తుది జాబితాను ఒకటి, రెండు రోజుల్లో టిజిపిఎస్సీ ప్రకటించే అవకాశం ఉన్నట్టు తెలుస్తోంది.

జెఎల్స్ పోస్టులకి సెలెక్ట్ అయిన అభ్యర్థులకి ఈ నెల 8న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నియామక పత్రాలను అందించే అవకాశం ఉన్నట్టు తెలుస్తోంది. నవంబర్ 8.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జన్మదినం కావడంతో.. అదే రోజున జెఎల్స్‌కి ఎంపికైన అభ్యర్థులకి నియామక పత్రాలను అందించాలనే యోచనలో రాష్ట్ర ప్రభుత్వం ఉన్నట్టు తెలుస్తోంది. రాష్ట్రంలోని ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో గత ఏడాదిలో సుమారు 3100 మంది కాంట్రాక్ట్ లెక్చరర్లను రెగ్యులరైజ్ చేసిన విషయం తెలిసిందే. దీంతో రాష్ట్రంలోని ప్రభుత్వ జూనియర్ కాలేజీలు కొంత మేరకు బలపడగా.. ఇప్పుడు మరో 1392 మంది జూనియర్ లెక్చరర్లుగా నియామకం అయితే ఇక ప్రభుత్వ జూనియర్ కాలేజీలు బలోపేతంఅవుతాయనిలెక్చరర్ల సంఘాలు చెబుతున్నాయి. కొత్తగా 1392 జేఎల్ >>2

## అబ్కారీ విచారణకు హాజరైన రాజ్ పాకాల, విజయ్

### జన్వాడ ఫాంహౌస్ పార్టీ కేసు

**హైదరాబాద్, నవంబరు 1, ప్రభాతవార్త:** రాష్ట్రంలో సంచలనం రేపిన జన్వాడ ఫాం హౌజ్ పార్టీ రగడకు సంబంధించి ఫాంహౌజ్ యజమాని కెటిఆర్ బావమరిది రాజ్ పాకాల, అతని స్నేహితుడు విజయ్ మద్దూరిలను అబ్కారీ శాఖ పోలీసులు శుక్రవారం నాడు విచారించారు. ఈ కేసులో రాజ్ పాకాలను ఇప్పటికే మోకిల పోలీసులు విచారించడం తెలిసిందే. అయితే ఈ విచారణకు విజయ్ మద్దూరి రాకపోవడంతో అతని కోసం గాలింపు చేబట్టడం, ఇదే సమయంలో ఇతను పోలీసులు అరెస్టు చేయకుండా వుండేందుకు హైకోర్టు నుంచి రెండు రోజుల రక్షణ పొందడం విదితమే. గత శనివారం రాత్రి జరిగిన ఈ పార్టీ రాజకీయంగా ప్రకంపనలు రేపింది. మొదట రేవ్ పార్టీగా ప్రచారం జరిగినా చివరకు దీపావళి పార్టీగా అధికారులు వెల్లడించారు.

ఈ పార్టీలో అక్రమంగా విదేశీ మద్యం వాడడంతో పాటు పన్ను చెల్లించకుండా వున్న ఇతర రాష్ట్రాల మద్యం పట్టుబడగా దీనిపై అబ్కారీ శాఖ అధికారులు కేసు నమోదు చేశారు. దీంతో పాటు ఈ పార్టీకి గెస్ట్‌గా వచ్చిన విజయ్ మద్దూరి కొకైన్ తీసుకున్నట్లు నిర్ధారణ అవడంతో అతనిపై ఎన్‌డిపిఎస్ చట్టంకింద మరోకేసు నమోదు చేశారు. ఇదేసమయంలో ఫాంహౌజ్ యజమాని రాజ్ పాకాలతో పాటు అతని స్నేహితుడు విజయ్ మద్దూరి, ఫాం హౌజ్ మేనేజర్ కార్తిక్‌పై అటు పోలీసులు, ఇటు అబ్కారీ అధికారులు వేరు వేరుగా కేసులు నమోదు చేసి విచారణ చేబట్టారు. >>2

## రాష్ట్రమంతా పాదయాత్ర

### రేవంత్ ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడతా..
### రాజకీయ వేధింపులకు భయపడం
### కెసిఆరే మాకు మార్గదర్శనం: కెటిఆర్



**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, నవంబరు1:** పార్టీ కార్యకర్తల ఆకాంక్షల మేరకు ఖచ్చితంగా రాష్ట్ర వ్యాప్తంగా పాదయాత్ర చేస్తా అని బిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు అన్నారు. సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా ఆస్క్ కెటిఆర్ క్యాంపెయిన్‌లో యూజర్లు అడిగిన పలు ప్రశ్నలకు సమాధానం ఇచ్చారు. పలువురు పాదయాత్రపై ప్రత్యేకంగా ఈ అంశంలో కెటిఆర్ అభిప్రాయాన్ని కోరగా, ఆయన పైవిధంగా స్పందించారు. దాదాపు గంటన్నరపాటు సాగిన ఈ సంభాషణలో కెటిఆర్ అనేక అంశాలపై తన అభిప్రాయాలను ప్రజలతో పంచుకున్నారు. తెలంగాణ రాష్ట్రానికి కాంగ్రెస్ పాలన ఒక శాపంగా మారిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చే ఉద్దేశాలు ఏమాత్రం లేవన్నారు. అబద్ధపు హామీలమీద ఎన్నికైన కాంగ్రెస్ పార్టీనుంచి ఇంతకంటే గొప్ప పరిపాలన ఆశించలేమన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నమ్మి ఓట్లు వేసి మద్దతు ధర లేక రైతుబంధు లేక నష్టపోతున్న రైతన్నల తరఫున పోరాడుతామన్నారు. నాలుగు సంవత్సరాల తర్వాత కాంగ్రెస్ పార్టీ అధికారం పోవడం ఖాయమని,అయితే కొత్త ప్రభుత్వానికి ఈ ప్రభుత్వం చేసిన నష్టం నుంచి తేరుకొని ముందుకు తీసుకపోవడం అతి పెద్ద సవాలుగా మారుతుందని కెటిఆర్ అన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్ర ఆర్థిక ప్రగతి పూర్తిగా పతనం అయిందన్నారు. రాష్ట్ర ఆదాయ వనరులు నుంచి మొదలుకొని వ్యవసాయ రంగం,అన్నిరంగాలు తిరోగమనంలో ఉన్నాయన్నారు. నిరుద్యోగం పెరి >>2

## 7కోట్ల విలువైన డ్రగ్స్ స్వాధీనం

**హైదరాబాద్ (శంషాబాద్), నవంబరు 1 ప్రభాత వార్త:** శంషాబాద్ ఎయిర్‌పోర్టులో శుక్రవారం ఏడు కోట్ల రూపాయల విలువైన డ్రగ్స్‌ను డిఆర్‌ఎ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఏడు కిలోల బరువుగల మత్తు పదార్థాన్ని స్వాధీనంచేసుకుని దీనిని స్మగ్లింగ్ చేస్తున్న ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. డిఆర్‌కెఎ అధికారులు స్వాధీనం చేసుకున్న డ్రగ్స్‌ను హైడ్రోపోనిక్ గంజాయిగా గుర్తించారు.

అంతర్జాతీయ మార్కెట్లో దీని విలువ ఏడు కోట్ల రూపాయలు ఉంటుందని తెలిపారు. బ్యాంకాక్ నుంచి వచ్చిన ఇద్దరు వ్యక్తుల లగేజ్‌ను తనిఖీ చేస్తుండగా వారివద్ద 13 కేలాక్స్ ప్యాకెట్లలో భద్రపరిచిన డ్రగ్స్ గుర్తించారు. నిందితులపై 1985 ఎన్‌డిపిఎస్‌చట్టం కింద కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఇటీవల కాలంలో శంషాబాద్‌లో ఇంత పెద్ద ఎత్తున గంజాయి లభించడం తీవ్ర కలకలం సృష్టించింది.

## చర్చలు విఫలం: వ్యవసాయ అధికారులు సమ్మెకు సిద్ధం

**హైదరాబాద్, నవంబరు 1, ప్రభాతవార:** రాష్ట్ర వ్యాప్తంగా తాము చేస్తున్న ఉద్యమాన్ని ఉధృతం చేయాలని వ్యవసాయ విస్తరణ అధికారులు నిర్ణయించారు. అవసరమైతే సమ్మెకు సైతం సిద్ధమవుతున్నారు. తాజాగా రెండు రోజుల క్రితం వ్యవసాయ కార్యదర్శితో మరోసారి విస్తరణ అధికారుల సంఘం సమావేశమైంది. అయితే ఈ చర్చలుకూడా విఫలమయ్యాయి. ఈ చర్చల్లో డిజిటల్ క్రాప్ సర్వే సందర్భంగా తమకు అసిస్టెంట్లు కావాలని విస్తరణ అధికారులు కోరారు. అయితే మీరే అసిస్టెంట్లు, మీకెందుకు మళ్లీ వేరే అసిస్టెంట్లు అని వ్యవసాయ కార్యదర్శి వ్యాఖ్యానించడంతో విస్తరణ అధికారులు అసహనం వ్యక్తం చేశారు. ఇందులో ఉన్నతాధికారుల నుండి ఎలాంటి స్పష్టమైన హామీ రాకపోవడంతో వ్యవసాయ విస్తరణ అధికారులు చర్చలను మధ్యలోనే బహిష్కరించి బయటకు వచ్చేశారు. దీంతో విస్తరణ అధికారులతో వ్యవసాయ శాఖ కార్యదర్శి చేసిన చర్చలు విఫలం అయ్యాయి. డిజిటల్ క్రాప్ సర్వే చేయడం లేదనే కారణంగా ఉన్నతాధికారులు వేధింపులకు గురి చేస్తున్నారని విస్తరణ అధికారులు విమర్శిస్తున్నారు.

కాగా అంతకు ముందు వారం రోజుల క్రితం వ్యవసాయ శాఖ కార్యదర్శితో జరిగిన చర్చలు సఫలం అయినా వాటిని అమలు చేయకపోవడంతో పాటు, వ్యవసాయ మంత్రితో జరగాల్సిన భేటీ కూడా నిలిచిపోయింది. దీంతో వ్యవసాయ విస్తరణ అధికారులు నిరసన కార్యక్రమాన్ని కొనసా >>2



విలేకర్ల సమావేశంలో వివరాలు వెల్లడిస్తున్న జిల్లా ఎస్పీ కె.నారాయణరెడ్డి

## కంచె మేసిన చేను!

### • ఖాతాదారుల తప్పుడు డాక్యుమెంట్లతో బ్యాంకులో రుణం తీసుకుని స్వాహా • మణప్పురం గోల్డ్‌లోన్ బ్యాంక్ మేనేజర్ అరెస్టు • వివరాలు వెల్లడించిన ఎస్పీ నారాయణ రెడ్డి

**వికారాబాద్, నవంబరు 1, ప్రభాతవార్త:** గత కొన్ని రోజుల క్రితం వికారాబాద్ జిల్లా కేంద్రంలోని మణప్పురం గోల్డ్ లోన్ బ్యాంకు మేనేజర్ ఖాతా ధారుల సొమ్ముతో ఉడాయించారనే ఘటన సంచలనం సృష్టించింది. దీంతో బ్యాంకు ఖాతాదారులు తమ సొమ్ము ఉందా..ఎత్తుకెళ్లాడా అనే సందిగ్ధంతో ఇన్నాళ్లు ఆందోళనకు గురయ్యారు. బ్యాంకు మేనేజర్‌ను పోలీసులు అరెస్టు చేయడంతో ఖాతాదారులు ఊపిరి పీల్చుకున్నారు. బ్యాంకు యాజమాన్యం ఊహించినట్లుగానే అసలు నింధితుడు బ్యాంకు మేనేజర్ అని పోలీసుల విచారణలో తేలడంతో..కంచే చేను మేసిందంటూ విస్తుపోయారు. ఈ సంఘటనకు సంబంధించి జిల్లా ఎస్పీ కె.నారాయణరెడ్డి శుక్రవారం జిల్లా ఎస్పీ కార్యలయంలో విలేకర్ల సమావేశం నిర్వహించి వివరాలు వెల్లడించారు. వికారాబాద్ జిల్లా కేంద్రంలోని మణప్పురం ఫైనాన్స్ లిమిటెడ్ బ్రాంచ్ నందు ఆడిటర్ బ్యాంకు సభ్యులతో కలసి అక్టోబరు 16న అడిట్ చేయగా, ఒక ఖాతాదారుకు సంబంధించిన బంగారం ప్యాకెట్ తక్కువ వచ్చింది. దీంతో మణపురం రీజనల్ మేనేజర్ రవీంద్రకు ఫోన్ చేసి విషయం చెప్పడంతో అతను 17వ తేదీన వికారాబాద్ బ్రాంచ్‌కి వెళ్లి అక్కడి పరిస్థితులను క్షుణ్ణంగా పరిశీలించారు. వికారాబాద్ బ్రాంచ్‌లో మేనేజర్ విశాల్ లేకపోవడంతో అతనికి ఫోన్ చేయగా విశాల్ ఫోన్ ఎత్తలేదు. అనుమానం వచ్చి స్ట్రాంగ్ రూమ్ తెరచి ఆడిటర్, ఇతర సభ్యులతోకలసి అడిట్ నిర్వహించారు. ఖాతాదారు >>7

# సమగ్ర సర్వేలో ప్రైమరీ స్కూల్ ఎస్‌జిటిలు

### ఉదయం స్కూల్లో.. మధ్యాహ్నం కులగణనలో
### యాధావిధిగా కొనసాగనున్న యుపిఎస్, హైస్కూళ్లు
### కుల గణనలో 48,229 మంది పిఎస్ సిబ్బంది
### ఉత్తర్వులు ఇచ్చిన ప్రభుత్వం

**హైదరాబాద్, నవంబరు 1, ప్రభాతవార్త:** రాష్ట్రంలో ఈ నెల 6 నుంచి ప్రారంభం కానున్న సమగ్ర కుటుంబ సర్వేలో ప్రాథమిక పాఠశాల్లో పనిచేస్తున్న సెకండరీ గ్రేట్ టీచర్లు పాల్గొనున్నారు. రాష్ట్రంలోని ప్రాథమిక పాఠశాలల్లో పనిచేస్తున్న ఎస్‌జీటీలతోపాటు హెడ్మాష్టర్లు, ఇతర ఇబ్బంది కూడా సమగ్ర కుల గణనలో పాల్గొననున్నారు. ఉదయం పాఠశాలలో బోధన కొనసాగించి.. మధ్యాహ్న భోజనం విద్యార్థులకి అందించిన అనంతరం విద్యార్థులను ఇళ్లకు పంపించి అనంతరం సిబ్బంది కుల గణనలో పాల్గొననున్నారు. ఇందుకు సంబంధించిన ఉత్తర్వులను రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసింది.

విద్యా శాఖ ముఖ్య కార్యదర్శి బుర్రా వెంకటేశం ఇందుకు సంబంధించిన ఉత్తర్వులను శుక్రవారం జారీ చేశారు. రాష్ట్రంలో సమగ్ర కుల గణనను 80వేల మందితో చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిన విషయం తెలిసిందే. అందులో భాగంగా పాఠశాల విద్యలోని ప్రాథమిక పాఠశాలలకి చెందిన 48,229 మందిని ఈ కుల గణన సర్వే పనుల్లో వినియోగించనున్నారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంటల వరకు పాఠశాలలో విధులు పూర్తి చేసుకొని అనంతరం కుల గణనలో ప్రాథమిక పాఠశాల సిబ్బంది ఉండనున్నారు. రాష్ట్రంలోని ప్రాథమిక పాఠశాలలు సమగ్ర కుల గణన జరగనున్న రాబోయే మూడు వారాల పాటు ఒంటిపూటనే కొనసాగనున్నాయి. ప్రాథమిక పాఠశాలల్లోన 36,559 మంది ఎస్‌జీటిలు, 3414 మంది పీఎస్‌హెచ్ఎంలు, 6256 మంది ఎంఆర్సీలు, 2000 మంది ఇతర సిబ్బంది కలిపి మొత్తం 48,229 మంది కులగణనలో పనిచేయనున్నారు. రాష్ట్రంలోని ప్రాథమికోన్నత పాఠశాలలతోపాటు ఉన్నత పాఠశాలలు యధావిధిగా కొనసాగుతాయని విద్యా శాఖ ముఖ్య కార్యదర్శి బుర్రా వెంకటేశం తమ ఉత్తర్వుల్లో స్పష్టం చేశారు. సెలవు దినాల్లో ప్రైమరీ పాఠశాలలకి సిబ్బంది పూర్తి రోజు కులగణనలోనే ఉండాల్సి ఉంటుందని ..ఇందుకు సంబంధించిన రెమ్యూనరేషన్‌ను ప్లానింగ్ డిపార్ట్‌మెంట్ ఇవ్వనుంది.



## స్పెయిన్ వరదలకు జనజీవనం అస్తవ్యస్తం

**బార్సిలోనా, నవంబరు 1:** స్పెయిన్‌లో భారీ వరదల కారణంగా జనజీవనం అతలాకుతలం అయింది. ఆకస్మిక వరదలు భీభత్సం సృష్టిస్తున్నాయి. ఇప్పటివరకూ సుమారు 100 మందికిపైగా చనిపోయినట్లు సమాచారం. వరదల్లో అనేకమంది గల్లంతయ్యారు. ఇప్పటికీ వారి ఆచూకీ తెలియ రాలేదు. మరోవైపు వరదల్లో వందలాదికార్లు కొట్టుకుపోతున్నాయి. తూర్పు స్పెయిన్‌లో ఆకిస్మకవరదలు మరింత కల్లోలం సృష్టిస్తున్నాయి. వరదల కారణంగా ఇప్పటికే వందలాదికార్లు కొట్టుకునిపోయినట్లు యజమానులు వాపోతున్నారు. స్పెయిన్ అత్యవసర స్పందన విభాగానికి చెందిన 1000 మందికిపైగా సైనికులు వరదప్రభావిత ప్రాంతాల్లో సహాయచర్యలుచేపట్టారు. అటు దక్షిణ స్పెయిన్‌లో కూడా భారీ వర్షాలు కురుస్తున్నాయి. దీనితో అక్కడి వీధులు బురదనీటితో నిండిపోయాయి. వరదలకారణంగా తప్పిపోయినవారి ఆచూకీకోసం డ్రోన్లసాయంతో గాలింపు చర్యలు చేపట్టినట్లు అధికారులు తెలిపారు. అదేసమయంలో అధికారుల సూచనలను పాటించాలని ప్రజలకు పదేపదే విజ్ఞప్తులుచేస్తున్నారు. ఇక వరదల్లో చిక్కుకున్నవారిని హెలికాప్టర్ల సాయంతో సురక్షితప్రాంతాలకు తరలిస్తున్నారు. ఈ వరదకారణంగా తీవ్ర ఆస్తినష్టం, ప్రాణనష్టం జరిగింది.

## 290 కిలోల గంజాయి పట్టివేత

### ట్యాంకర్‌లో తరలిస్తుండగా వాంకిడి
### చెక్‌పోస్టు వద్ద పట్టుకున్న పోలీసులు

**హైదరాబాద్, నవంబరు 1, ప్రభాతవార్త:** గంజాయి స్మగ్లర్లు తెలివి మీరారు. పోలీసులకు పట్టుబడకుండా వుండేందుకు డీజిల్ ట్యాంకర్లు, నీటి ట్యాంకర్లలో ప్రత్యేకంగా అరలు ఏర్పాటు చేసుకుని వాటిలో గంజాయిని వుంచి దూర ప్రాంతాలకు తరలించసాగారు. ఈ తరహాలో స్మగ్లింగ్ అవుతున్న పలు ముఠాలు ఇప్పటికే పట్టుబడగా తా జాగా కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లా వాంకిడి అంతర్రాష్ట్ర చెక్‌పోస్టు వద్ద మరో ట్యాంకర్ ఇదే తరహాలో గంజాయి తరలిస్తూ దొరికి పోయింది. ఎపిలోని రాజమహేం ద్రవరం నుంచి తెలంగాణ మీదుగా మధ్యప్రదేశ్‌కు ఒక ట్యాంకర్‌లో 290 కిలోల గంజాయిని ట్యాంకర్‌లో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన అరలలో వుంచి తరలిస్తుండగా గురువారం సాయంత్రం వాంకిడి చెక్‌పోస్టు వద్ద పోలీసులకు అనుమానం వచ్చి సోదాలు చేయగా అందులో గంజాయి లభించింది. ఈ సందర్భంగా ట్యాంకర్ డ్రైవర్ బ ల్వీర్ సింగ్‌ను అరెస్టు చేశారు. అతని వద్ద వున్న రెండు సెల్‌ఫోన్లను జప్తు చేశారు. ఈ లారీ ఎవరిదనే విషయమై పోలీసులు ఆరా తీస్తున్నారు. దీంతో పాటు గంజాయి ఎపి నుంచి వస్తుందా...? లేదా ఒడిషా నుంచి వస్తుందా? దీనివెనక వున్న బడా స్మగ్లర్లు ఎవరనే దానిపై విచారణ చేబట్టారు. పట్టుబడ్డ గంజాయి విలువ 72.50 లక్షల రూపాయలని జిల్లా ఎస్పి శ్రీనివాసరావు తెలిపారు. గంజాయి స్మగ్లర్‌ను పట్టుకున్న చెక్‌పోస్టు పోలీసులను ఆయన అభినందించారు.

## దండుమల్కాపురంలో ఘోర ప్రమాదం

### ఆగిన కారును వెనుకనుంచి ఢీకొట్టిన బస్సు
### కారులోని భార్యాభర్తలు దుర్మరణం



బొబ్బలి నర్సింహారెడి, సరోజ (ఫైల్)

**చౌటుప్పల్, నవంబరు 1, ప్రభాతవార్త:** యాదాద్రి భువన గిరి జిల్లా చౌటుప్పల్ మండలం దండుమల్కాపురం గ్రామ పరిధిలోని హైదరాబాద్- విజయవాడ జాతీయ రహదారి-65పై బుధవారం అర్ధరాత్రి ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఆగిఉన్న కారును వెనుక నుంచి ఓ ప్రైవేటు ట్రావెల్స్‌కు చెందిన బస్సు ఢీ కొట్టడంతో కారులో ప్రయా ణిస్తున్న నల్లగొండ జిల్లా కేతెపల్లి మండలం ఇప్పల గూడెనికి చెందిన బొబ్బలి నర్సింహారెడ్డి(60), అతని భార్య సరోజ(55)లు దుర్మరణం చెందారు. మృతులు హైదాబాద్‌లో సమీప బంధువుల ఇంట్లో జరిగిన పుట్టిన రోజు వేడుకులకు హాజరై తిరిగి ఇంటికి వెళ్తున్న సమయంలో దండుమల్కాపురం గ్రామ స్టేజి వద్ద ఉన్న దాబాల వద్ద కారును రోడ్డు పక్కన ఆపారు. అదే సమయంలో హైద్రాబాద్ నుంచి వైజాక్‌కు వెళ్తున్న ట్రావెల్స్ బస్సు కారును వెనుక నుంచి బలంగా ఢీ కొట్టింది. ఈ ప్రమాదాంలో కారు నుజ్జు నుజ్జు అయి అందులో ఉన్న భార్య, భర్తలు ఇద్దరు తీవ్ర గాయాలకు గురై అక్కడికకడే మృతి చెందారు. కారు డ్రైవర్ మహేష్ తీవ్ర గాయాలకు గురి కాగా చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం చౌటుప్పల్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుడు నర్సింహారెడ్డి భ్యాంకు ఉద్యోగం చేసి పదవీ విరమణ పొందారు. ప్రస్తుతం నకిరేకల్ కోర్టులో న్యాయవాధిగా పనిచేస్తున్నాడు. మృతుని బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని ధర్యాప్తు జరుపుతున్నట్లు పోలీస్ ఇన్స్‌పెక్టర్ మన్మదకుమార్ తెలిపారు. కాగా రోడ్డు ప్రమాదంలో న్యాయవాధి నర్సింహారెడ్డి దంపతులు దుర్మరణం చెందారన్న విషయాన్ని తెలుసుకున్న నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం చౌటుప్పల్‌లోని ప్రభుత్వ ఆస్పత్రిలోని మర్చురీని సందర్శించారు. మృతదేహాలకు పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు. పోస్టుమార్టం నిర్వహించేంత వరకు అక్కడే ఉండి అంబులెన్స్‌లో మృతదేహాలను స్వగ్రామానికి తరలించే వరకు అక్కడే ఉండి వెళ్లిపోయారు.

## మల్టీజోన్‌లో ఇద్దరు ఎస్ఐలు, హెడ్‌కానిస్టేబుల్, కానిస్టేబుల్‌పై వేటు

### గంజాయి స్మగ్లర్లతో దోస్తీ

**హైదరాబాద్, నవంబరు 1, ప్రభాతవార్త:** గంజాయి స్మగ్లర్లతో స్నేహం చేయడంతో పాటు నేరగాళ్ల గంజాయి రవాణా చేస్తుండగా పట్టుకుని వారిని సరుకుతో సహా వ దిలి వేసినందుకు సంగారెడ్డి జిల్లాలో పనిచేస్తున్న ఇద్దరు ఎస్ఐలు, ఒక హెడ్ కానిస్టేబుల్ మరో కానిస్టేబుల్‌ను సస్పెండ్ చేస్తూ మల్టీ జోన్ 2 ఐజి సత్యనారాయణ శు క్రవారం ఆదేశాలు జారీ చేశారు. గంజాయి స్మగ్లర్లు మల్లుగొండ, మల్లేష్ నాయక్, లకన్‌లు ఇటీవల గంజాయి స్మగ్లింగ్ చేస్తూ సంగారెడ్డి జిల్లా పోలీసులకు దొరికిపోయా రు. వీరిని విచారించగా గతంలో వీరిని ఇదే జిల్లాలోని మనూర్ పోలీసు స్టేషన్‌లో ఎస్ఐగా పనిచేసిన అంటారియా (ప్రస్తుతం పటాన్‌చెరు పోలీసు స్టేషన్‌లో వున్నారు ), సంగారెడ్డి రూరల్ పోలీసు స్టేషన్‌లో పనిచేసి ఇసుక అక్రమ రవాణాలో విఫలమై విఆర్‌లో వున్న ఎస్ఐ వినయ్ కుమార్, మనూరు పోలీసు స్టేషన్‌లో పనిచేసిన హె డ్ కానిస్టేబుల్ మారుతీ నాయక్, సాయుధ బలగం కానిస్టేబుల్ మధు ఒకసారి గస్తీలో వుండగా పైన పేర్కొన్న ముగ్గురు స్మగ్లర్లు గంజాయితో పట్టుబడగా వదిలి వేశా రని తేలింది. ఇదే సమయంలో గంజాయి బ్యాచ్‌తో ఈ నలుగురు పోలీసులు దోస్తానా చేసినట్లు తేలిందిజ ఓవైపు రాష్ట్రంలో గంజాయి సహా మాదకద్రవ్యాలను నిర్మూ లించేందుకు పోలీసు శాఖ కఠినంగా వ్యవహరిస్తుండగా ఇద్దరు ఎస్ఐల సహా నలుగురు ఏకంగా గంజాయి బ్యాచ్‌తో దోస్తీ చేస్తూ దందాలు చేయసాగడంతో వీరిపై వేటు పడింది. ఈ తరహా చర్యలను ఉపేక్షించేది లేదని మల్టీ జోన్ 2 ఐజి సత్యనారాయణ స్పష్టం చేశారు. ఈ కేసులో విచారణ జరుగుతోందని ఆయన తెలిపారు.

## ధాన్యం కొనుగోలులో ప్రభుత్వం తెచ్చిన మార్పులు స్పూర్తిదాయకం

### ఇతర రాష్ట్రాలకు తెలంగాణ రోల్ మోడల్
### భారత ఆహార కార్యదర్శి సంజీప్‌చోప్రా
### మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డితో సమావేశం

**హైదరాబాద్, నవంబరు 1, ప్రభాతవార్త:** ధాన్యం కొనుగోలులో ప్రభుత్వం తీసుకుని వచ్చిన వ్యవ స్థాగత మార్పులు స్పూర్తిదాయంగా నిలిచిందని, ఈ వ్యవస్థను మరింత సరళీకృతం చేయనున్నట్లు మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్ర వారం భారత ఆహార కార్యదర్శి సంజీప్ చోప్రా మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డితో భేటి అయ్యారు. ఈ సందర్భంగా మంత్రి పలు అంశాలపై చర్చిం చారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ పౌరసరఫరా శాఖను మరింత మెరుగు పరిచేందుకు కేంద్రానికి అండగా ఉంటున్నామని అన్నారు. ఇతర రాష్ట్రాలకు తెలంగాణ రోల్ మోడల్‌గా నిలుస్తోందన్నారు. రాష్ట్రంలో జనపోషణ కేంద్రాల పనితీరు భేష్ అన్నారు. రేషన్ డీలర్ల పనితీరు సంతృప్తి నిచ్చిందన్నారు వారి పనితీరుపై తెల్లరేషన్ కార్డు దారులు సంతృప్తిగా ఉన్నారన్నారు. బియ్యం, గోధుమ సరఫరాలో నాణ్యత పనిణామాలు పాటిస్తున్నా రన్నారు. రాష్ట్రంలో చౌక ధరల డీలర్ల ఆదాయం రూ.30వేల ఉందన్నారు. విక్రయాలను పెంచుకుంటే లక్షల వరకు ఆదాయం వస్తుందన్నారు. భారత ఆహార కార్యదర్శి సంజీప్ చోప్రా తొలి సారిగా పౌర సరఫరాల కార్యాలయాన్ని సందర్శించారు. ఈసందర్భంగా ధాన్యం కొనుగోలు వ్యవస్థాగత మార్పులపై పవర్‌పాయింట్ ప్రాజెంటేషన్‌చేశారు. ఏజి కాలనీలో ఉన్న చౌకధరల దుకాణాన్ని తనిఖీ చేశారు. డీలర్ నుంచి వివరాలు తెలుసుకుని, తెల్లరేషన్ కార్డుదారులో ముఖాముఖీగా మాట్లాడారు. తెలంగాణ ప్రభుత్వం ధాన్యం కొనుగోలు అంశంలో తీసుకుని వచ్చిన సంస్థాగత మార్పులను అభినందించారు. ఇతర రాష్ట్రాలకు రోల్‌మోడల్‌గా ఉందన్నారు. రేషన్ దుకాణాల డీలర్ల పనితీరు భేషుగ్గా ఉందన్నారు. బియ్యం, గోధుముల సరఫరాలో నాణ్యత ప్రమాణాలు పాటిస్తున్నారన్నారు.

## సచివాలయం భద్రతను స్వీకరించిన ఎస్‌పిఎఫ్ సిబ్బంది

**హైదరాబాద్, నవంబరు 1, ప్రభాతవార్త:** రాష్ట్ర సచివాలయం భద్రతను స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్ (ఎస్‌పిఎఫ్) శుక్రవారం చేబట్టింది. ఇప్పటి వరకు సచివాలయంలో భద్రతను పర్యవేక్షించిన తెలంగాణ స్పెషల్ పోలీసు విభాగం స్థానంలో మూడురోజుల క్రితం ఎస్‌పిఎఫ్‌కు బాధ్యతలను అప్పగిస్తూ డిజిపి జితేందర్ ఆదేశాలు జారీ చేయడం తెలిసిందే. ఇందులో భాగంగా శుక్రవారం ఉదయం పది గంటల సమయంలో ఎస్‌పిఎఫ్ కమాండెంట్ దేవీదాస్ నేతృత్వంలో 214 మంది సిబ్బంది సచివాలయానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా కమాండెంట్ దేవీదాస్ సచివాల యంలో పూజలుచేసి భద్రతను అధికారికంగా చేబట్టారు. సచి వాలయం ప్రధాన ద్వారాల వద్ద సాయుధ సిబ్బంది పహారాకు నియమించగా లోపలి భాగంలో గస్తీకోసం యూనిఫాంలో వున్న సిబ్బందిని నియమించారు. వీరంతా 24 గంటలు సచివాలయంలో ప హారా కాస్తారు. వాస్తవానికి సచివాలయం భద్రతను ఎస్‌పిఎఫ్ చేబట్టడడం ఇది మొదటిసారి కాదు. గతంలో సచివాలయం భద్రతను ఈ విభాగం సిబ్బందే చూసేవారు. కొత్త సచివాలయం ప్రారంభం అయ్యాక గత యేడాది ఏప్రిల్ నెలలో ఎస్‌పిఎఫ్ స్థానంలో తెలంగాణ స్పెషల్ పోలీసు విభాగం సిబ్బందిని నియమించారు. అయితే కొన్ని రోజులుగా స్పెషల్ పోలీసు సిబ్బంది ఆందోళన చేస్తుండడంతో దీని ప్రభావం సచివాలయం భద్రతపై పడకుండా ఉండేందుకు తిరిగి ఎస్ పిఎఫ్‌కు అప్పగించారు. ఎస్‌పిఎఫ్ సిబ్బంది భద్రతతోపాటు అగ్ని ప్రమాదాల నివారణలో ప్రత్యేక శిక్షణ పొందడం సానుకూల అంశంగా మారింది. బెటాలియన్ల సిబ్బంది ఆందోళనకు ముందే గత ఆగస్టు నెలలో సచివాలయం భద్రతకు ఎస్‌పిఎఫ్ సిబ్బందిని నియమించాలని సర్కారు నిర్ణయించింది. అయితే దీనిపై అధికారిక ఉత్తర్వులు మాత్రం మూడు రోజుల క్రితం జారీ అయ్యాయి. సచివాలయ భద్రతను ఎస్‌పిఎఫ్ చేబట్టడంతో ఇంతకాలం ఇక్కడున్న బెటాలియన్ల సిబ్బంది వారి బెటాలియన్‌లో చేరారు.

## టపాసుల మోతతో ఢిల్లీలో క్షీణించిన గాలి నాణ్యత!

**న్యూఢిల్లీ, నవంబరు 1:** దేశ రాజధాని ఢిల్లీని కాలుష్యపు పొగ కమ్మేసింది. బాణసంచాపై నిషేధం ఉన్నప్పటికీ దాన్ని కొంతమంది పట్టించుకోలేదు. దీపావళి పర్వదినాన్ని పురస్కరించుకుని ప్రజలు టపాసులు పేల్చారు. దీంతో తీవ్రమైన శబ్ద కాలుష్యంతో పాటు గాలి నాణ్యత విపరీతంగా పడిపోయింది. శుక్రవారం తెల్లవారుజామున దట్టమైన పొగ అలముకుంది. ఎదురుగా ఉన్న వాహనాలు కనిపించలేనంత పరిస్థితి నెలకొంది. ఢిల్లీలోని ఆనంద్‌విహార్‌లో ఉదయం 6 గంటల ప్రాంతంలో గాలి నాణ్యత సూచీ 395 పాయింట్లకు చేరుకుంది. దీంతో పరిస్థితిని తీవ్రంగా పేర్కొన్నారు. బురారీ, ఆర్కే పురం, అశోక్ విహార్, మందిర్‌మార్గ్, ఎయిర్‌పోర్టు, జహంగీర్‌పుర్‌లోనూ సూచీ 350 పైనే ఉండటం గమనార్హం. అటు నోయిడా, గాజియాబాద్, గురుగ్రామ్‌లోనూ ఇలాంటి పరిస్థితినే నెలకొంది. అర్ధరాత్రి తర్వాత నుంచి గాలి నాణ్యత సూచి పడిపోతూ వచ్చింది. ఇక దీపావళి రోజున ఢిల్లీ వ్యాప్తంగా పలు ప్రాంతాల్లో అగ్ని ప్రమా దాలు చోటు చేసుకున్నాయి. గత పదేళ్లలో పోలిస్తే గురువారం రాత్రి అత్యధిక స్థాయిలో 320 ఎమర్జెన్సీ కాల్స్ వచ్చినట్లు ఢిల్లీ ఫైర్ డిపార్ట్‌మెంట్ వెల్లడిం చింది. ఈ అగ్నిప్రమాద ఘటనలో ముగ్గురు మృతి చెందగా కనీసం 12 మంది గాయపడినట్లు పేర్కొంది. ప్రతి సంవత్సరం లాగే ఈసారి కూడా ఢిల్లీలో బాణసంచా తయారీ, విక్రయాలు, వినియోగంపై ప్రభుత్వం నిషేధం విధించింది. వచ్చే ఏడాది జనవరి 1 వరకు ఈ ఆంక్షలు అమల్లో ఉంటాయని స్పష్టం చేసిం ది. ఆన్‌లైన్‌లోనూ విక్రయాలు, డెలివరీలకు ఈ నిషేధంవర్తిస్తుందని పేర్కొంది. అయినప్పటికీ కొందరు ఈ ఆంక్షలను పట్టించుకోకపోవడం గమనార్హం. ఇప్పటికే గత కొన్ని రోజులుగా ఢిల్లీలో కాలుష్యం పెరిగిపోగా,



తాజాగా దీపావళి బాణసంచాతో పరిస్థితి మరింత తీవ్రంగా మారింది.

## విద్యార్థులను సాంస్కృతిక రంగాల్లోనూ ప్రోత్సహించాలి

### పాఠశాల విద్య డైరెక్టర్ ఇవి నరసింహారెడ్డి
### ఘనంగా రాష్ట్రస్థాయి కళా ఉత్సవాలు

**హైదరాబాద్, నవంబరు 1, ప్రభాతవార్త:** రాష్ట్రంలో పాఠశాల స్థాయిలో కళా ఉత్స వాలు ఘనంగా జరిగాయి. కళా ఉత్స వాలను పాఠశాల విద్య డైరక్టర్ ఈవీ నరసింహారెడ్డి ప్రారంభించారు. కళా ఉత్స వాల్లో పాల్గొనొ బహుమతులు పొందిన వారికి బహుమతులు ప్రధానం చేశారు. కళా ఉత్స వాల్లో పాల్గొన్న డైరక్టర్ నరసింహారెడ్డి మాట్లాడుతూ విద్యార్థుల్లో సృజనాత్మకత అంశాలను వెలికి తీయాలంటే ఇలాంటి పోటీలు ఎంతగానో ఉపయోపడతాయన్నారు. పాఠశాల స్థాయిలోనే చదువుతో పాటు సాహిత్య, కళా కారులకు కూడా తగిన ప్రాధాన్యత ఇవ్వడం తప్పనిసరి అన్నారు. తల్లిదండ్రులు కూడా ఈ విషయాన్ని ఆలోచించాలని సూచించారు. రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి వచ్చిన 174 మంది విద్యార్థులకు కళా ఉత్స వాల్లో పాల్గొన్నారు. వారికి పోటీలను నిర్వహించారు. పోటీల్లో మొదటి బహుమతి వచ్చిన వారు జాతీయ స్థాయి కళాఉత్స వాల్లో పాల్గొంటారని తెలిపారు.

## 12 గంటల్లో పాతాళయాత్ర!



### డైవింగ్ మెషీన్ సిద్ధం చేసిన డిఆర్‌డిఒ

**న్యూఢిల్లీ, నవంబరు 1:** భారత్ అంతరిక్షాన్నే కాదు సముద్రాలను కూడా అన్వేషించాలనే లక్ష్యంతో చకచకా అడుగులు వేస్తోంది. దీనిలో భాంగా సముద్రయాన్ ప్రాజెక్టును వేగంగా ముందుకు తీసుకెళుతోంది. దాదాపు 12 గంటల వ్యవధిలో సముద్రంలో 6,000 మీటర్ల లోతుకు వెళ్లి బయటకు వచ్చేందుకు వీలుగా ఓ ప్రత్యేకమైన డైవింగ్ మెషీన్‌ను కూడా సిద్ధం చేసింది. దీనికి మత్స్య 6000 అని పేరు పెట్టింది. అందులో ఉండే సభ్యుల కోసం ప్రత్యేక ఆహారాన్ని కూడా డిఆర్‌డివో సిద్ధం చేసింది. అత్యవసర పరిస్థితులను తట్టుకునేలా ఈ మత్స్య 6000 సబ్‌మెర్సిబుల్ వెహికల్‌ను సిద్ధం చేశారు. సంక్షిప్త సమ యంలో 96 గంటల పాటు సిబ్బంది దీనిలో ఉండేలా ఏర్పాట్లు చేశారు. ఇందుకోసం 67 ఆక్సిజన్ సిలిండర్లు పని చేస్తుంటాయి. మొత్తంగా ఇది సముద్రంలోని అత్యంత లోతైన ప్రదేశంలో 108 గంటలు ఉండగలదు. సముద్రగర్భంలోకి వెళ్లడానికి 3 గంటలు, రావడానికి 3 గంటలతో పాటు పరిశోధన కోసం 6 గంటలు ఉండేలా ఏర్పాట్లు చేశారు. సముద్రంలో 6 వేల మీటర్ల కిందకు వెళితే మత్స్యపై ఒత్తిడి 596 రెట్లు ఉంటుంది. ఇది 1,848 ఏనుగుల బరువుకు సమానం. తొలుత దీనిని శక్తిమంతమైన కార్బన్ ఫైబర్‌తో తయారుచేయాలని భావించారు. కానీ కొన్ని సమస్యల కారణంగా ఆ ఆలోచనని విరమించు కొన్నారు. దాదాపు 80 ఎంఎం మందంతో ఉన్న టైటాన్ అలాయ్ దీనికి వాడారు. దాదాపు 2.1 మీటర్లు ఉన్న ఈ సబ్‌మెర్సిబుల్ దాదాపు 600 రెట్ల నీటి ఒత్తిడిని తట్టుకోగలదు. మత్స్య 600ను సముద్రజలాల్లోకి పంపేందుకు ప్రత్యేకంగా సాగర్‌నిధి అనే రీసెర్చి నౌకను సిద్ధం చేశారు. ఈ ప్రాజెక్టు విజయవంతమైతే సముద్రలోతులను అన్వేషించగల సామర్థ్యం ఉన్న అమెరికా, రష్యా, జపాన్, ఫ్రాన్స్, చైనాల క్లబ్‌లోకి భారత్ కూడా అడుగుపెడుతుంది.



## జార్కండ్ ఎన్నికల మేనిఫెస్టోపై కసరత్తు

### డిప్యూటీ సిఎం భట్టి, కెసి వేణుగోపాల్ కీలక చర్చలు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, నవంబరు 1:** మహారాష్ట్ర, జార్కండ్ రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలు జరనున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ జార్కండ్ ఎన్నికల స్టార్ క్యాంపెయినర్లలో ఒకరైన కాంగ్రెస్ సీనియర్ నేత, తెలంగాణ డిప్యూటీ సిఎం మల్లు భట్టి విక్రమార్క ఆ రాష్ట్ర పర్యటనలో బిజీబిజీగా ఉన్నారు. పలు ప్రచార కార్యక్రమాలు, పార్టీ కీలక సమావేశాల్లో పాల్గొంటున్నారు. జార్కండ్ అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ కూటమి వ్యూహం, విడుదల చేయాల్సిన మేనిఫెస్టోపై శుక్రవారం సాయంత్రం రాంచీలో ఎఐసిసి జనరల్ సెక్రటరీ కేసి వేణుగోపాల్, ఎన్నికల ఇంచార్జ్ భట్టి విక్రమార్క, జార్కండ్ పిసిసి అధ్యక్షుడు కేశవ్ మహాతో కమలేష్‌తో పాటు కాంగ్రెస్ సీనియర్ నేతలు గులాం అహమద్ మీర్ సాబ్, గౌరవ్, బికె హరిప్రసాద్, ఎలక్షన్ ఇన్‌చార్జ్ రామేశ్వరరావు తదితరులు మేనిఫెస్టోలో పొందుపర్చాల్సిన అంశాలపై కీలక చర్చలు జరిపారు. మహారాష్ట్రలో నవంబర్ 20వ తేదిన సింగిల్ ఫేజ్‌లో ఎన్నికలు జరగనుండగా జార్కండ్ మాత్రం రెండు దశల్లో ఎన్నికలు జరగనున్నాయి. నవంబర్ 13,20 తేదీల్లో ఆ రాష్ట్రానికి ఎన్నికలు జరగనున్నాయి. కాగా, ఇటీవల జరిన హర్యానా, జమ్ము కాశ్మీర్ అసెంబ్లీ ఎన్నికలకు జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ ఘోరంగా విఫలమైన విషయం తెలిసిందే. ఆ జార్కండ్ అసెంబ్లీ ఎన్నికల్లో కర్ణాటక, తెలంగాణ ఎన్నికల గెలిచినట్లుగానే గెలిచేందుకు వ్యూహాలు రచిస్తోంది.

## డిజిపి కార్యాలయంలో ఘనంగా ఏక్తాదివస్

### సర్దార్‌పటేల్ చిత్రపటానికి నివాళులు అర్పించిన మహేష్ భగవత్

**హైదరాబాద్, నవంబరు 1, ప్రభాతవార్త:** ఉక్కు మనిషి సర్దార్ వల్లభ భాయి పటేల్ జన్మదినం సందర్భంగా గురువారం నాడు డిజిపి కార్యాలయంలో ఏక్తా దివస్ ఘ నంగా జరిగింది. ఈ సందర్భంగా సర్దార్ పటేల్ చిత్ర పటానికి శాంతి భద్రతల అదనపు డిజి మహేష్ భగవత్ పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో మహేష్ భగవత్ మాట్లాడుతూ భారత దేశాన్ని ఐఖ్యంగా వుండచంలో సర్దార్ పటేల్ ఎనలేని కృషి చేశారని కొనియాడారు. అప్పట్లో సంస్థానా లను భారత దేశంలో విలీనం చేసేలా, దేశాన్ని పటిష్టంగా తీర్చిదిద్దేలా ఆయన చేసిన కృషి ఆమోఘమని మహేష్ భగవత్ అన్నారు. హైదరాబాద్ సంస్థానాన్ని విలీనం చేసే క్రమంలో సర్దార్ పటేల్ నిర్వహించిన ఆపరేషన్ పోలో చరిత్రలో నిలిచి పోతుందని ఆయన తెలిపారు. ఈ నేపథ్యంలోనే సర్దార్ పటేల్ జన్మదినాన్ని కేంద్రం ఏక్తా దివస్‌గా జరుపుకుంటోందని ఆయన తెలిపారు. ఈ కార్యాలయంలో డిజిపి కార్యాలయ అధికారులు పలువురు పాల్గొన్నారు.

## పాదయాత్ర ఎందుకోసమో కెటిఆర్ చెప్పాలి

### ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య

**హైదరాబాద్, నవంబరు 1, ప్రభాతవార్త:** మాజీ మంత్రి కెటిఆర్ ఎందుకోసం పాదయాత్ర చేస్తాడో చెప్పాలని ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య డిమాండ్ చేశారు. తెలంగాణ ప్రజలను మరోసారి మోసం చేయడానికి కెటిఆర్ డ్రామాలు మొదలు పెట్టారన్నారు. పాదయాత్ర చేస్తానంటూ కొత్త డ్రామాలు ఆడుతున్నారన్నారు. ముందుకు ఫాంహౌజ్‌లో ఉన్న కెసిఆర్‌ను బయటకు తీసుకుని రావాలన్నారు. రైతులు, నిరుద్యోగులు, మహిళలకు మా సిఎం రేవంత్‌రెడ్డి పెద్ద పీట వేశారని, చాటింపు చేయడానికి పాదయాత్ర చేస్తావా అంటూ ప్రశ్నించారు. హరీష్‌రావును ప్రతిపక్ష నాయుడిని చేస్తారన్న భయంతోనే కెటిఆర్ దగ్గర మార్కులు కొట్టేయడం కోసం పాదయాత్ర చేస్తారా అన్నారు. తెలంగాణలో ప్రజాపాలన నడుస్తుందని, రైతులకు రుణమాఫీ చేసినం అన్నారు. ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వబోతున్నాం, నిరుద్యోగులకు వేలాది ఉద్యోగాలు ఇచ్చాం. పేదల ప్రజల ఇళ్లకు 200 యూనిట్ల ఉచిత కరెంటు ఇస్తున్నామన్నారు. రూ.500 రూపాయలకు గ్యాస్ సిలిండర్ ఇస్తున్నాం, మీ మోసాలు తెలిసే తెలంగాణ ప్రజలు మిమ్మల్ని ఇంట్లో కూర్చోబెట్టారని, పాదయాత్ర చేసే నైతిక అర్హత లేదన్నారు.

## స్వామివారి ఆశీస్సులతో అందరికీ మంచి జరగాలి

### గుజరాత్ న్యాయమూర్తి జస్టిస్ మానవేంద్రరాయ్

**తిరుమల, నవంబర్ 1 ప్రభాతవార్తప్రతినిధి:** కలియుగప్రత్యక్షదైవమ్ శ్రీవేంకటేశ్వరస్వామి ఆశీస్సులతో ప్రజలందరికీ మంచి జరగాలని, ప్రజలు సంతోషంగా ఉండాలని స్వామి వారిని వేడుకున్నట్లుగుజరాత్ హైకోర్టు న్యాయ మూర్తి జస్టీస్ మాన వేంద్రరాయ్ తెలి పారు. శుక్రవారం ఉదయం కుటుంబ సభ్యులతో కలసి ఆయన ఆల యంలోనికి చేరుకున్నారు. ఉదయం విఐపి బ్రేక్ దర్శనంలో వేంకటేశ్వరస్వామిని దర్శించుకున్నారు. టిటిడి ఆలయ అధికారులు దర్శనం చేయించి స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు.

## ఉద్యోగుల అవినీతి, అక్రమాలపై ఫిర్యాదు చేసే వారికి రక్షణగా ప్రభుత్వం

### ఫిర్యాదుల రక్షణ కోసం నోడల్ అధికారి నియామకం

**విజయవాడ, నవంబరు 1, ప్రభాతవార్త ప్రతినిధి:** ఉద్యోగుల అవినీతి, అక్రమాలపై ఫిర్యాదు చేసే వారికి రక్షణ కల్పించడానికి వీలుగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చర్యలు చేపట్టింది. అందు కోసం ఇంటిలిజెన్స్ చీఫ్ మహేష్ చంద్రను నోడల్ అధికారిగా నియమిస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్‌కుమార్ ప్రసాద్ ఉత్తర్వులు జారీ చేసారు. ఫిర్యాదు చేసే సదరు వ్యక్తులు నోడల్ అధికారిని సంప్రదించాల్సిందిగా ఈ ఉత్తర్వులో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి స్పష్టం చేసారు. ప్రభుత్వ విభాగాలు, కార్పోరేషన్లు, ప్రభుత్వరంగ సంస్థలు, స్థానిక సంస్థలు, ప్రభుత్వ సొసైటీల్లోని ఉద్యోగుల అవినీతి, అక్రమాలపై విజిలెన్స్ కమిషన్‌కు ఫిర్యాదు చేసే వారికి రక్షణగా ఈ ఆదేశాలు విడుదలయ్యాయి, దీని వలన ఫిర్యాదుదారులకు బెదిరింపులు, ఇతర ఇబ్బంది కలిగించే ప్రతీకార చర్యలు జరిగే అవకాశం లేకుండా ఈ ఉత్తర్వులు సహకరిస్తాయి. ఫిర్యాదుదారుల నుంచి అభియోగాలు ఎదుర్కొంటున్న వారిపైన నోడల్ అధికారి నిఘా పెట్టి ఉంచుతారు.

సంతోషం సంఘటనల మూలంగా లభించేదికాదు మనుష్యులోని మథనం ద్వారా జనిస్తుంది.

-ఆలైస్ మేవెల్

# మహా'సంగ్రామ'మే!

'ఒకే దేశం-ఒకే ఎన్నిక'ను సుసాధ్యం చేయాలనే తలంపుతో అడుగులు వేస్తున్న కేంద్రంలోని ఎన్డీయే ప్రభుత్వానికి ఇప్పుడు రెండు ప్రధాన రాష్ట్రాలలో జరుగుతున్న శాసనసభ ఎన్నికలు ఎంతో ప్రతిష్టాత్మకం. మహారాష్ట్ర సర్కార్ ఎన్డీయే పాలనలోనే ఉండగా, జార్ఖండ్ ప్రభుత్వం వైఖరి మాత్రం కేంద్ర ప్రభుత్వానికి మింగుడు పడడం లేదు. అక్కడున్నది జార్ఖండ్ ముక్తి మోర్చా ప్రభుత్వం. ఐదేళ్లనాడు ఏర్పడిన ఈ ప్రభుత్వాలను మార్చేందుకు బిజెపి విశ్వప్రయత్నం చేసింది. ఒక్క మహారాష్ట్రలోనే సాధ్యపడింది. దాంతో ఈసారి ఎలాగైనా ఆ రెండురాష్ట్రాలలో తామే ప్రభుత్వాలను ఏర్పరచాలని ఎన్డీయే పెద్దలఆలోచన. కాగా 'జమిలి' సంకల్పం ఈనాటిది కాకపోయినా ఇప్పుడు ఆ విధానంపై వడివడిగా అడుగులు పడుతున్నాయి. దేశ ఆర్థిక రాజధాని 'ముంబాయి' కీలకంగా ఉన్న మహారాష్ట్ర శాసనసభ ఎన్నికలంటే దేశంలో ఉన్న ఏ రాజకీయ పార్టీకైనా విశేషమే. ఎలాంటి ఎన్నికలు వచ్చినా అంత తేలికగా తీసి పారేయలేరు. రేపోమాపో ఏలినవారు దేశవ్యాప్తంగా జమిలి ఎన్నికలు తెస్తే మళ్లీ ఎన్నికలు తప్పవు. ఇప్పటి ఎన్నికలు వీగిపోతాయనే భావన మనసులో ఉన్నా ఆయా రాజకీయ పార్టీలకు తమ రాజకీయ చతురతను పదును పెట్టడం తప్పదు. పైగా ఈఎన్నికల ఫలితాలపైనే జమిలి భవిష్యత్ ఆధారపడి ఉందనే మరో వాదన కూడా ఉంది. ఇదొక విచిత్రమైన పరిస్థితి. ఎన్నికల తరుణంలో ప్రవేశపెట్టే జనాకర్షక పథకాలు జనంలోకి ఏ మేరకు వెళ్లాయో చెప్పలేం కానీ మహారాష్ట్ర సర్కారు 'లడ్కీ బహెన్ యోజన' చాలా ప్రత్యేకమైనది. రాష్ట్రాలో ఇలాంటి నగదు బదిలీ పథకాలు ఉండనే ఉన్నాయి ఈ పథకం కింద నిర్దేశిత ఆదాయమున్న ప్రతి గృహిణికి నెలనెలా రూ.1500 నగదు బదిలీ పథకం. అయితే ఇది పాలక 'మహా యుతి' (ఎన్డీయే) ప్రభుత్వానికి మేలు చేసేదేనని అంచనాలున్నాయి. ప్రతిపక్ష 'మహావికాస్ అఘాడి'ని ఏ మేరకు తొక్కిపెడుతుందో మాత్రం ఎవరూ అంచనా వేయలేదు. కాగా ఎన్నికల ముందు ప్రకటించిన సంక్షేమ పథకాలు అందుకోవడానికి ఉత్సాహపడే లబ్దిదారులుండవచ్చు కానీ వాటికి లొంగిపోయే ఓటర్లులేరని ఏనాడో తేలిపోయింది. మహారాష్ట్రలో గత ఐదేళ్ల పాలన లోపభూయిష్టమనే విశ్లేషకుల అంచనా. ముగ్గురు ముఖ్యమంత్రుల మార్పు, రెండు బలీయమైన పార్టీల చీలికతో ఆ రాష్ట్ర రాజకీయాలను కేంద్రపాలకులు తమవైపు తిప్పుకోగలిగారు. మహారాష్ట్రలో ప్రధాన రాజకీయ పార్టీలు బిజెపి, కాంగ్రెస్ పార్టీల కనుసన్నల్లో నడిచే పార్టీలే ఎన్నికల సమరంలో క్రియాశీలకంగా పనిచేస్తుంటాయి. పాలక పక్షంలో ఏక్‌నాథ్ షిండే శివసేన, అజిత్ పవార్ ఎన్‌సిపి, బిజెపిలు ఉండగా మరోవైపు అసలు సిసలైన ఎన్‌సిపిగా చెప్పుకునే శరద్‌పవార్ వర్గం ఎన్‌సిపి శరద్‌పవార్‌గా రంగంలో ఉన్నాయి. ఇక గతఎన్నికల్లో గెలిచి పీఠమెక్కినా ఆ తర్వాత పార్టీలో చీలిక వలన భంగపడిన ఉద్ధవ్‌థాకరే శివసేన ఇప్పుడు మళ్లీ గెలిచి నిలదొక్కుకోవాలనే ప్రయత్నంలో ఉంది. సామాజిక సమీకరణాలు ఏ పార్టీకి పెద్దగా అనుకూలంగా లేనందున అన్ని పార్టీలకూ ఈఎన్నికలు ఎదురీతగానే చెప్పాలి. ఓబిసిలు అత్యధికంగా 52శాతంమంది ఉండగా మరాఠాలు 16శాతం మందే. చీలికవర్గాలపాలన చవిచూసిన మహాజనం ఆలోచించే తీరు ఈసారి ఎలా ఉంటుందో ఈ ఎన్నికలు తేల్చేస్తాయి. పార్టీ ఫిరాయింపులు, టిక్కెట్ల కోసం బేరసారాలు, రెబెల్స్ వంటి అంశాలేమీ జనం పట్టించుకోవడంలేదు. తాజాగా అన్ని పార్టీల్లోనూ అంతర్గత కుమ్ములాటలు దాటి కలిసికట్టుగా ముందుకుసాగే పరిస్థితి ద్యోతకమౌతోంది. కానీ ఓటర్ల మదినెవరు గెలుచుకుంటారన్నది అంతుపట్టడం లేదు. మజ్లీస్ రాజ్‌థాకరే నవనిర్మాణ్ సేన వంచిత్ బహుజన్ అఘాడి వంటి పార్టీలు రంగంలో ఉన్నందున గెలుపు ప్రభావిత అంశాలపై అందరిలోనూ ఉత్కంఠ రేపుతోంది. మొన్నటి లోక్‌సభ ఎన్నికల ఫలితాలనుబట్టి విశ్లేషించాలంటే మహారాష్ట్రలో అధికారపార్టీని ప్రజలు ఆదరించనట్లే. మహారాష్ట్రలో ప్రత్యేకించి మహిళల కోసం నిర్దేశిత నగదు బదిలీ పథకం అత్యంత ఆదరణ పొందినా గతంలో ఆంధ్రప్రదేశ్‌లో ఇలాంటి సంక్షేమ పథకాలను ప్రజలు తాత్కాలిక ఉపశమనమేనని భావించి పురోగామి వైఖరిలో ఆలోచించి ఓట్లు వేశారు. ఎలాగైనా ఆ రెండు రాష్ట్రాల్లో తమ సొంత బిజెపి పాలనే ఉండాలని ఆలోచిస్తున్న బిజెపి, ఇంతక్రితం ఇటువంటి పథకాలనే సృష్టించినఆప్, కాంగ్రెస్ పార్టీల ఆలోచనను ఎద్దేవా చేసేది. ఇప్పుడు తామూ అదే పంథాలో కొనసాగుతున్నట్లు భావించలేకపోతోంది. పైగా 'జమిలి'తో వచ్చే ఎన్నికలు, పార్టీల వైఖరిలో అయోమయం వంటి అంశాలు ప్రజల్ని ఎటువైపు తీసుకెళ్తాయన్న విషయంపై ఆలోచిస్తున్నట్లు లేదు. ఈ వ్యవహారమంతా గాలిలో దీపంలాంటిదే. ఇటీవల ఎన్నికలు జరిగిన హర్యానా, రాజస్థాన్, హిమాచల్‌ప్రదేశ్, ఛత్తీస్‌గఢ్ వంటి రాష్ట్రాల్లో కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన గ్యారంటీ కార్డుకు జనం స్పందించలేదన్న ఒకే ఒక అంశాన్ని బిజెపి తమ ప్రధాన ప్రచారాస్త్రంగా ఎక్కుపెట్టింది. 47కోట్లమంది మహిళా ఓటర్లున్న మహారాష్ట్రలో షిండే పథకం లడ్కీ బహెన్ 2కోట్ల మంది మహిళలకు చేరేవీలుంది. వారంతా ఓటేస్తే ఎన్డీయే రొట్టెవిరిగి నేతిలో పడ్డట్టే! ఇక జార్ఖండ్‌లో జార్ఖండ్ ముక్తిమోర్చ (జెఎంఎం) బిజెపి, కాంగ్రెస్ పార్టీల ప్రచారవైఖరి విభిన్నంగా ఉంది. జెఎంఎం అధినేత ప్రస్తుత ముఖ్యమంత్రి హేమంత్ సోరేన్‌పై ఉన్న అవినీతి ఆరోపణలే తమ ప్రచారాస్త్రాలుగా భావిస్తున్నాయి. జెఎంఎంను మట్టికరిపించాయంటే ఇదొక్కటే సరిపోదు. అమావాస్య ఘడియలు దాటగానే ఆయా పార్టీలు తమ ప్రచారాస్త్రాలను సరి చేసుకొని దిగేందుకు సన్నద్ధమౌతున్నారు.

మనం ఇతరుల కోసం ఏం చేస్తామో అది మన శక్తికి నిదర్శనం. మనం ఇతరుల కోసం ఏ బాధల్ని అనుభవిస్తామో అది మన ప్రేమకు నిదర్శనం.



-బి.బి.ఎస్.డబ్ల్యు.కాట్

డజను మంది వివేకవంతులు ఒక గంటలో అడిగే ప్రశ్నల కన్నా ఒక్క నిముషంలో మూర్ఖుడు ఎక్కువగా ప్రశ్నలు వేయగలడు.



-లెనిన్

# ప్రజావాక్కు



### తనిఖీలు చేయాలి

**ఇటీవల** బయట ఏం కొని తినాలన్నా బయపడే పరిస్థితులు ఉన్నాయి. మొన్న స్వీట్ షాపుల్లో నాణ్యత లేని పదార్థాలతో చేసిన స్వీట్స్‌ను గుర్తించారు. నిన్న మోమోస్ తిని ఒకరి ప్రాణాలుపోయాయి. ఎంతోమంది తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. అసలు పండుగ వాతావరణంలో అందరు స్వీట్స్ ఇష్టంగా ఎక్కువగాకొంటారు. మరి అటువంటి తరుణంలో ఫుడ్ సేఫ్టీ అధికారులు నిత్యం తనిఖీలు చేపట్టాలి. అసలు మొన్న జరిగిన తనిఖీల్లో ఏ స్వీట్ షాపులకు ఎఫ్ఎస్ఎస్ఐ సర్టిఫికెట్ లేదు అని తెలిసింది. కావునా ప్రభుత్వం ఇకపై అన్నిస్వీట్ షాపులకు హోటల్స్‌కు ఎఫ్ఎస్ఎస్ఐసర్టిఫికేట్ తీసుకునేలా ఆర్డర్‌జారీ చేయాలి. క్రమం తప్పకుండా అధికారుల పర్యవేక్షణ జరగాలి.

-శ్రిష్టి శేషగిరి, సికింద్రాబాద్

### విశాఖ ఉక్కుతో 'విఆర్ఎస్'?

**ఒకవైపు** కేంద్ర ప్రభుత్వంవిశాఖస్టీల్ ప్లాంటును ప్రైవేటీకరణ కాకుండా సహకరిస్తామని చెబుతుంది. కొంత మేర నిధులను విడుదలచేసి ఆనిధుల వినియోగదానికి షరతులు విధించింది. ఇటు ఉద్యోగుల విషయంలో మాత్రం నిర్ణయాలు అందుకు భిన్నంగా ఉంటున్నాయి. సెయిల్‌లో స్టీల్ ప్లాంట్ విలీన ప్రతిపాదన ఉండగానే, తాజాగా యాజమాన్యం ఉద్యోగులకుస్వచ్ఛంద పదవీవిరమణప్రతిపాదనను ప్రకటించింది. విశాఖ ఉక్కు కర్మాగారంలో సర్వే పేరుతో ఉద్యోగులకు ఈ 'విఆర్ఎస్' ప్రకటనతో ఉద్యోగుల్లో ఆందోళననెలకొంది. దీంతో ఈపరిణామాలపైన రాష్ట్రంలో అధికారంలో ఉన్న కూటమి నేతలు ఎలా స్పందిస్తారనేది ప్రశ్నార్థకంగా మారినది?

-దాసం వెంకటరెడ్డి, బెంగళూరు

### ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి

గతనెలరోజులుగా రంగారెడ్డిజిల్లా, అబ్దుల్లాపూర్ మెట్‌మండల, అనాజ్‌పూర్ ఏరియాలోని కొండలు, గుట్టలు అనగా పూర్తిగా అటవీ ప్రాంతంలో ఉన్న పెద్ద పెద్ద బండరాళ్లను పేల్చి చదునుచేయడంలో కొందరు కబ్జాదార్లు తలమునకలై ఉన్నా, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, అటవీ, పర్యావరణ శాఖలు ఆవంకకి కన్నెత్తి చూడటంలేదు. ఆపే ప్రయత్నం చేయడం లేదు. ఇక్కడి అటవీ పందులు, కుందేళ్ళు, నెమళ్లు, ఎక్కడికి వలసపోతాయి? ఇక్కడ హైడ్రా లాంటి లా అండ్ ఆర్డర్ వర్తించకపోవడం శోచనీయం.

-ఇమ్మడి నాగేశ్, సంస్థాన్ నారాయణపూర్, యాదాద్రిజిల్లా

### ఉపాధ్యాయ పదోన్నతులు, బదలీలు చేపట్టాలి

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం నవంబర్ నెలలో పూర్తయ్యే విధంగా మున్సిపల్ పాఠశాలల ఉపాధ్యాయులకు పదోన్నతుల షెడ్యూల్ విడుదల చేసింది. అదే విధంగా మండల పరిషత్ జిల్లా పరిషత్ పాఠశాలల్లో పనిచేసే ఉపాధ్యాయులకు కూడా పదోన్నతులు చేపట్టాలి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఉద్యోగులందరికీ పదోన్నతులు, బదలీలు చేయడం జరిగింది. ప్రభుత్వం ఉపాధ్యాయులకు సర్దుబాటు ప్రక్రియ పేరుతో నామమాత్రంగా సర్దుబాటు చేయడం గమనార్హం. ఉపాధ్యాయ కొరత అధిగమించడానికి ప్రభుత్వం మెగా డీఎస్సీ నిర్వహించడానికి సన్నాహాలు చేస్తున్నది. కాబట్టి ఉపాధ్యాయ నియామకాలకు ముందు వెంటనే షెడ్యూల్ ప్రకటించి జనవరి లోపు పదోన్నతులు బదలీలు నిర్వహించాలి.

-వాసిలి సురేష్, నెల్లూరుజిల్లా

### పత్తికి మద్దతు ధర కల్పించాలి

**రాష్ట్రంలో** పత్తికి మద్దతు ధర కల్పించాలని కోరుతూ రైతులు అధిక పెట్టుబడులు పెట్టి పండించిన పంటకు గిట్టుబాటు ధర లేదని పెట్టిన ఖర్చులు కూడా రావడం లేదని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు కూడా ప్రభుత్వం దృష్టికి తీసుకుపోయి రైతులకు న్యాయం జరిగేలా చూడాలి. రైతులు దళారుల నుంచి మోసపోకుండా చూడాల్సిన బాధ్యత కూడా అధికారులపైనే ఉంది. పత్తి కొనుగోలుపై రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించి రైతులు నష్టపోకుండా అక్కడక్కడ తడిసిన, చివరి పంట వరకు ప్రభుత్వమే కొనుగోలు చేయాలి.

-మిద్దె సురేష్, నాగర్ కర్నూల్ జిల్లా

### బాంబు బెదరింపులు

**ఆకతాయితనంగా** నయినా నిజంగానైనా విమానాలలోనూ దేవాలయాలలోనూ బాంబులు పెట్టామని భయపెట్టడం ఉగ్రవాద చర్య కిందే పరిగణించాలి. గుళ్లలో నియంత్రణ ఉండదు. కాబట్టి భయపెట్టినా ఓ అర్థం ఉంది. విమానాలలో బాంబులు పెట్టడం విస్మయాన్ని కలుగచేస్తోంది. ఎందుకంటే అక్కడ పకడ్బందీగా సోదాలు నిర్వహిస్తారు. పోనీ ప్రయాణీకుల్లో విద్రోహులున్నారు? వారి ప్రాణానికి వారే హాని తలపెట్టుకుంటారా? అలాంటి వారు కూడా ఉండవచ్చునని గత అనుభవాలు తెలుపుతున్నాయి. ఉగ్రవాదాన్ని ఏమాత్రం ఉపేక్షించకూడదు. కఠినాతి కఠినమైన అణచివేత చర్యలు తీసుకుంటేనే తప్ప పరిస్థితులు దారిలోకి రావు.

-ఎన్. రామలక్ష్మి, సికిందరాబాద్

## ఎడిట్ పేజీకి..

ఆర్థిక, సాంఘిక, రాజకీయ పరిణామాలకు సంబంధించిన విశ్లేషణాత్మక వ్యాసాలు పంపగోరేవారు ఈ కింది ఈ మెయిల్ చిరునామాకు పంపగలరు. e-mail: editpage@vaartha.com

# రాస్తారోకోలతో సామాన్యులు విలవిల!

**ఎంతసేపు రాస్తారోకోలు చేస్తే అంత గొప్పగా చెప్పుకునే పరిస్థితులు దాపురించాయి. సమ్మెల పట్ల ముఖ్యంగా రాస్తారోకోల పట్ల ప్రజల్లో వ్యతిరేకభావం పెరిగిపోతున్నది. ఇప్పటికే న్యాయస్థానాలు కూడా ఈ ఆకస్మిక రాస్తారోకోలు, ధర్నాల పట్ల అసహనం వ్యక్తం చేశాయి. ఈ తమ సమస్యల కోసం పోరాటం చేయడంలో ఏమాత్రం తప్పులేదు. కానీ అందుకు ఒక పద్ధతి, విధానం ఉండాలి. అంతేకానీ తమ ఇష్టానుసారం వ్యవహరిస్తామనడం సమంజసం కాదు. తమ సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వ దృష్టికి తీసుకువచ్చేందుకు ప్రజలకు ఇబ్బంది తలపెట్టడాన్ని ఏరకంగా చూసినా సమంజసం కాదు. రాజకీయాలకు అతీతంగా అందరూ విజ్ఞతతో ఆలోచించాలి.**

దామెర్ల సాయిబాబ

ఎంకిపెళ్లి సుబ్బిచావుకు వచ్చినట్లుంది. ఎందరో నాయకులు ఆత్మబలి దానాలతో నిర్విరామకృషితో సాధించి పెట్టిన సమ్మె, రాస్తారోకో, ధర్నాల్లాంటి కార్యక్రమాలు కొన్నిసార్లు సామాన్యుల జనజీవనాన్ని అతలాకుతలం చేస్తున్నాయి. ఏ నియమ నిబంధనలు పాటించకుండా ఎవరికి వారు, ఎక్కడపడితే అక్కడ, ఎప్పుడు పడితే అప్పుడు ఈ కార్యక్రమాలు చేపడుతుండటంతో సామాన్యులు అల్లాడిపోతున్నారు. అపరిష్కృతంగా ఉన్న తమసమస్యల పరిష్కారంకోసం ఒక నిర్దిష్ట కార్యక్రమం ప్రకారం ముందు తెలిపి సమ్మెలు, ధర్నాలు రాస్తారోకోలు నిర్వహించడంలో కొంత అర్థంఉంది. అందుకు అన్నివర్గాలు సహకరించాల్సిన అవసరం కూడా ఉంది. అయితే చర్చల ద్వారా తమ సమస్యలు పరిష్కారం కానప్పుడు మరో దారిలేనప్పుడు సమ్మె మార్గాన్ని ఎంచుకోవడంలో తప్పుపట్టలేం. కానీ చెప్పాపెట్టకుండా ఆకస్మికంగా ఇలాంటి కార్యక్రమాలు చేపడితే సామాన్య ప్రజలు ఎంతటి ఇబ్బందులకు గురవుతున్నారో పట్టించుకోకపోవడం అత్యంత బాధాకరం. ఇవిరానురాను పెరిగిపోతుండటం దీనికి తోడు ప్రభుత్వం కూడా సమర్థవంతంగా వ్యవహరించకపోవడం ప్రజల బాధలు వర్ణనాతీతంగా ఉన్నాయి. ఎవరికి ఏసమస్య వచ్చినా రోడ్లమీదికి వచ్చేస్తున్నారు. రాకపోకలు స్తంభింప చేస్తున్నారు. గంటల తరబడి ఎండల్లోను వర్షాల్లోను రోడ్ల మీదనే గడపడం ప్రయాణీకులు తట్టుకోలేకపోతున్నారు. మురికినీరు కాలువ బాగుచేయాలేదనో, కరెంటు రావడం లేదనో, లేక ఏదో చిన్నచిన్న సమస్యల పరిష్కారం కోరుతో రోడ్లెక్కుతున్నారు. తెలంగాణలోనే కాదు అటు ఆంధ్రప్రదేశ్ లోనూ ఆమాటకొస్తే దేశవ్యాప్తంగా నగరాల్లోనే కాదు, పల్లెల్లో కూడా రోడ్లకడ్డంగా వస్తున్నారు. పోలీస్ స్టేషన్‌లో దౌర్జన్యం జరిగిందని, ఆ పోలీస్ అధికారిపై చర్యలు తీసుకోవాలని మొన్నా మధ్య ఆంధ్రప్రదేశ్‌లో దాదాపు 3 గంటలకుపైగా వాహనాల రాకపోకలకు అంతరాయం కలిగించారు. ఇందువల్ల ప్రయాణీకులు ఎంత ఇబ్బంది పడుతున్నారో వారు గ్రహించడంలేదు. ముఖ్యంగా ఆసుపత్రికి పోయే రోగులు సకాలంలో చేరుకోలేక ప్రాణాలు కోల్పోయిన సంఘటనలు కోకొల్లలు. అంతెందుకు ఆకస్మిక రాస్తారోకోతో సాక్షాత్తూ దేశప్రధాని నరేంద్రమోడీకే చేదు అనుభవం ఎదురయింది. ఆ మధ్య ఒకసారి ఆయన పంజాబ్‌లో పర్యటనకు బయలుదేరారు. ఆ రాష్ట్రంలో వివిధ కార్యక్రమాల్లో పాల్గొనేందుకు ప్రధాని నరేంద్రమోడీ భటిండా విమానాశ్రయంలో దిగి అక్కడి నుంచి హెలికాప్టర్‌లో ఫిరోజ్‌పూర్‌లోని హుస్సేనీవాలాకు వెళ్లి ర్యాలీలో పాల్గొని అక్కడ ఏర్పాటుచేసిన బహిరంగ సభలో ప్రసంగించాల్సి ఉంది. అయితే హెలికాప్టర్ ప్రయాణానికి వాతావరణం అనుకూలించకపోవడంతో విమానాశ్రయంలోనే వేచి చూడాల్సి వచ్చింది. ఎంతకూ వాతావరణం మెరుగుపడకపోవడంతో రోడ్డు మార్గంలోనే ఆప్రాంతానికి వెళ్లాలని భావించారు. ప్రధాని భద్రతాధికారులు ఈసమాచారాన్ని పంజాబ్ పోలీసులకు అందించారు. నుంచి రోడ్డుమార్గం భద్రతా మార్గం అనుమతులు రావడంతో ప్రధాని బయలు దేరారు. గమ్యస్థానానికి మరో అర గంటలో చేరుకుంటారనగా ప్రధాని వాహనశ్రేణి ఒక వంతెనపైకి చేరుకున్న సమయంలో అకస్మాత్తుగా ఒక వంద మంది రైతులు వచ్చి రాస్తారోకో చేసారు. ఎంతకీ పరిస్థితి మెరుగుపడక వారిని అడ్డు తొలగించేందుకు పోలీసులు చేసిన ప్రయత్నం సఫలం కాకపోవడంతో ప్రధాని దాదాపు గంటకుపైగా రోడ్డు మీదనే వేచి చూసి ముందుకు వెళ్లలేక, వెను తిరిగి ఢిల్లీకి వచ్చేసారు. ప్రధానికే కాదు సామాన్యుడు సైతం ఎందరో ఇలాంటి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఎంతో ముందుగా విదేశీ ప్రయాణానికి టిక్కెట్లు బుక్

## ఒక్క మాట

చేసుకొని, తీరా ఎయిర్ పోర్టుకు వెళ్తున్న సమయంలో ఈ రాస్తారోకోల్లో చిక్కుకొని వెనుదిరిగిన వారెందరో ఉన్నారు. ఇది నగరాలకే కాదు, పట్టణాలకు చివరకు పల్లెలకు కూడా విస్తరించింది. ప్రతి సమస్యకు ముఖ్యంగా రాస్తారోకోలు చేస్తే తప్ప ప్రభుత్వ దృష్టిని ఆకర్షించలేమనే నమ్మకం రానురాను పెరిగిపోతుండటం వల్లనే ఈ పరిస్థితులు దాపురిస్తున్నాయి. పాలకులు సకాలంలో సరైన చర్యలు తీసుకుని స్థానికంగానే సమస్య పరిష్కారం వైపు అడుగులు వేస్తే ఇటువంటివి జరిగే అవకాశాలుండవు. సమ్మెలు, నిరసన కార్యక్రమాలు ఆవిర్భావానికి ఎంతో సుదీర్ఘ చరిత్ర ఉంది. రాజులు సంస్థానాలు, పెత్తందార్ల కాలంలో కొన్ని వర్గాలు దోపిడీకి గురయి కట్టుబానిసలుగా బడుగు జీవులుగా జీవనం సాగిస్తున్న రోజుల్లో 1853లో ఆంగ్లేయులు ఇండియాలో రైలు మార్గంవేయడంతో పరిశ్రమలు, వ్యాపార సంస్థలు ఆవిర్భవించాయి. వాటితోపాటు కార్మిక వర్గం సమస్యలు మొదలయ్యాయని చెప్పవచ్చు. అప్పట్లో కార్మికుల ప్రయోజనాలను ద్దేశించిన చట్టాలేమీ లేవు. 1859లో భారతీయ కార్మికుల కోసం "వర్క్‌మెన్ బ్రీచ్‌ఆఫ్ యాక్ట్" చట్టంవచ్చింది. ఆ తర్వాత ఫ్యాక్టరీల కార్మికుల కోసం 1859 లో ఫ్యాక్టరీ చట్టం అమలులోకి వచ్చింది. భారత దేశానికి సంబంధించినంతవరకూ ఇది తొలికార్మిక చట్టం. ఆ తర్వాత ధరలు పెరిగినా అందుకు అనుగుణంగా జీతాలు పెంచకపోవడంతో 1919లో దేశంలో మొదటిసారి వేతనాలకోసం సమ్మె సైరన్ మోగింది. 1920 ట్రేడ్‌యూనియన్ డిస్ప్యూట్ యాక్ట్ అమలులోకి వచ్చింది. 1926లో కొత్త కార్మిక చట్టానికి రూపకల్పన చేసారు. మొత్తంమీద స్వాతంత్ర్యం అనంతరం ఇదే చట్టం పారిశ్రామిక వివాదాల చట్టంగా రూపాంతరం చెంది ఆ తర్వాత కూడా కార్మికుల సంక్షేమ హక్కులు కాపాడేందుకు అనేక చట్టాలుచేసారు. ఇలాఎందరో మహానుభావులు అవిరామ కృషి త్యాగాలతో ఈ సమ్మె ఇతర నిరసన కార్యక్రమాలు చేపట్టే హక్కులభించింది. ఆనాటి సమ్మెలకు కానీ నిరసన కార్యక్రమాలకు కానీ ధర్నాలకు ప్రజల మద్దతు లేదు. ఎలాంటి కార్యక్రమం చేపట్టినా సాధ్యమైనంత వరకూ ప్రజలకు ఇబ్బంది కలుగకుండా చూసుకునేవారు. కానీ పరిస్థితి రానురాను మారిపోతున్నది. కొందరు ఈ హక్కులను దుర్వినియోగం చేస్తున్నారేమోననిపిస్తున్నది. పదిమంది కూడి వారి సొంత సమస్యల పరిష్కారం కోసం ధర్నాలు రాస్తారోకోలు నిర్వహిస్తున్నారు. ప్రధానంగా హైదరాబాద్ లాంటి నగరాల్లో ధర్నాలు రాస్తారోకోలు విరామం లేకుండా కొనసాగుతున్నాయి. ఎక్కడపడితే అక్కడ పట్టుమని పదిమంది లేని బృందం నేరుగా వచ్చి అడ్డంగా రోడ్లపై కూర్చుంటున్నారు. ఇదిగ్రామాలకు కూడా పాకింది. గంటల తరబడి రాస్తారోకో పేరుతో వాహనాల రాకపోకలను స్తంభింపచేస్తున్నారు. అందువల్ల ప్రయాణీకులు పడుతున్న ఇబ్బందులు కష్టాలను గురించి పట్టించుకోవడంలేదు. చివరికి ఇంటి నుండి బయలుదేరిన వారు గమ్యానికి చేరుకోడానికి ఎంత సమయం పడుతుందో ఏ రాస్తారోకోలో ఇరుక్కుపోతారో, ఆ తర్వాత ట్రాఫిక్ ఎంతసేపటికి క్లియర్ అవుతుందో చెప్పలేని దుర్భర పరిస్థితులను ప్రజలు ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా అత్యవసరంగా ఆసుపత్రికి వెళ్లేవారు, దూరప్రాంతాలకు వెళ్లేందుకు ఎంతోముందుగా టికెట్లు బుక్ చేసుకుని సకాలంలో రైల్వేస్టేషన్‌కు లేక విమానాశ్రయానికో చేరుకోవాలని తపనపడేవారు పడుతున్న టెన్షన్‌అంతాఇంతా కాదు. ఇక కార్యాలయాలకు వెళ్లే ఉద్యోగులు విద్యాలయాలకు వెళ్లే విద్యార్థులు ప్రధానంగా పరీక్షల కాలంలో విద్యార్థులు పడుతున్న టెన్షన్ అంతా ఇంతా కాదు. ఒక్క నిమిషం ఆలస్యమైనా పరీక్ష హాలులోకి అనుమతించమని ప్రభుత్వ నిబంధనలతో ఎక్కడ రాస్తారోకోలో ఇరుక్కుపోతామేమోనని వారుపడుతున్న మానసిక ఒత్తిడి వర్ణనాతీతం. ఇప్పటికే రెండు తెలుగు రాష్ట్రాల్లో రాస్తారోకోలు, ధర్నాలు లేని రోజంటూ ఉండటంలేదు. గంటల తరబడి ట్రాఫిక్ ఆటంకం కలిగిస్తున్నారు. ఇలా ఎంతసేపు రాస్తారోకోలు చేస్తే అంత గొప్పగా చెప్పుకునే పరిస్థితులు దాపురించాయి. సమ్మెల పట్ల ముఖ్యంగా రాస్తారోకోల పట్ల ప్రజల్లో వ్యతిరేకభావం పెరిగిపోతున్నది. ఇప్పటికే న్యాయస్థానాలు కూడా ఈ ఆకస్మిక రాస్తారోకోలు, ధర్నాల పట్ల అసహనం వ్యక్తంచేశాయి. ఈ తమ సమస్యల కోసం పోరాటం చేయడంలో ఏమాత్రం తప్పులేదు. కానీ అందుకు ఒక పద్ధతి, విధానం ఉండాలి. అంతేకానీ తమ ఇష్టానుసారం వ్యవహరిస్తామనడం సమంజసం కాదు. తమ సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వ దృష్టికి తీసుకువచ్చేందుకు ప్రజలకు ఇబ్బంది తలపెట్టడాన్ని ఏరకంగా చూసినా సమంజసం కాదు. రాజకీయాలకు అతీతంగా అందరూ విజ్ఞతతో ఆలోచించాలి.

# కరవును అధిగమించడం ఎలా?

దుంగ జయరాం

కరవులు దేశాభివృద్ధికి అడ్డంకిగా నిలుస్తున్నాయి. అడవుల నిర్మూలన, కరవు, వాతావరణం ప్రతికూలతలు, మానవుని చర్యల వలన సారవంతమైన భూమి బంజరు భూమి అంటే ఏ పంటలూ పండడానికి వీలులేకుండా ఏడారులుగా తయారవుతున్నాయి. ఏదైనా ప్రాంతంలో ఎక్కువకాలం వర్షాలు కురవక పండవలసిన పంటలు పండకపోతే దానిని కరవు అంటారు. ఏ ప్రాంతంలోనైనా సగటు వార్షిక వర్షపాతం 25 శాతం కంటే తక్కువగా ఉంటే ఆ ప్రాంతంలో కరువు స్థితిలో ఉన్నట్లుగా భారత వాతావరణ శాఖ చెపుతుంది. సగటున భారతదేశం 118 సెం.మీ వార్షిక వర్షపాతాన్ని పొందుతుంది. సగటు స్థాయి కంటే 25 నుండి 50 శాతం మధ్య వర్షపాతం ఉంటే మితమైన కరవు. సగటు కంటే 50 శాతం ఎక్కువ వర్షపాతం తగ్గినప్పుడు తీవ్రమైన కరవు ఏర్పడుతుంది. చాలాకాలం పాటు తగినంత వర్షపాతం లేనప్పుడు వాతావరణ కరవు, నేలలో తేమ, వర్షపాతం లేనప్పుడు వ్యవసాయ కరవు, సరస్సులు, జలాశయాలు, వివిధ రిజర్వాయర్‌లులేదా నిల్వలలో ఉండవలసిన నీటి మట్టం కంటే దిగువకు పడిపోయినప్పుడు, నీటి కొరత వల్ల జలకరవు, తగినంత నీటి సరఫరా లేని కారణంగా సహజ పర్యావరణ వ్యవస్థ ఉత్పాదకత తక్కువగా ఉన్నట్లయితే పర్యావరణ కరవులు ఏర్పడతాయి. స్వాతంత్ర్యం తరువాత మనదేశం 1965-67, 1972-73, 1979-80, 1985-88 సంవత్సరాలలో పెద్ద కరవులను ఎదుర్కొంది. ఎడారీకరణ కరవు రెండూ ఒకదానితో ఒకటి ముడిపడి ఉంటాయి. మనదేశంలో అల్పపీడనాలు లేకపోవడం, బలహీన రుతుపవనాలు, సగటు కంటే తక్కువ వర్షపాతం, ముందస్తు రుతుపవనాల ఉపసంహరణ లేదా ఆలస్యంగా రుతుపవనాల ప్రారంభం, రుతుపవనాలలో సుదీర్ఘ విరామాలు లాంటి వాతావరణ కారణాలు కరవుకు కారణమవుతున్నాయి. వాతావరణంలో వచ్చిన ఆకస్మిక మార్పులు, పశువులకు ఇతర జంతువులకు మేత కొరకు ఎక్కువ పచ్చికను వినియోగించడం, అటవీ నిర్మూలన, సహజ వృక్ష సంపదను దుర్వినియోగపరచడం, ఒకే పంటను దీర్ఘకాలికంగా పండించడం వంటివి ఎడారీకరణ, కరవులకు కారకాలుగా ఉంటున్నాయి. ఐక్యరాజ్యసమితి సమాచారం మేరకు ప్రపంచవ్యాప్తంగా 2000 సంవత్సరం నుండి కరవులు 29 శాతం పెరిగాయి. 230 కోట్ల మందికి తాగడానికి మంచినీరు లేదు. ఇవే పరిస్థితులు కొనసాగితే 2040 సంవత్సరం నాటికి 25శాతం పిల్లలు నీటి కొరతను ఎదుర్కొంటారు. 2050 సంవత్సరం నాటికి ప్రపంచ జనాభాలో 75 శాతం కరవుకు లోనవుతారు. ఇక మనదేశ విషయానికొస్తే వ్యవసాయం ఎక్కువగా రుతుపవనాల వర్షపాతంపై ఆధారపడి ఉంటుంది. వ్యవసాయ యోగ్యమైన భూమిలో దాదాపు మూడింట రెండు వంతులు వర్షాధారంపైనే ఆధారపడి ఉంది. మొత్తం భౌగోళిక ప్రాంతం 32.872 కోట్ల హెక్టార్లలో 29.7 శాతం అంటే సుమారు 9.785 కోట్లు హెక్టార్ల విస్తీర్ణ భూక్షీణతకు గురైంది. మొత్తం విస్తీర్ణంలో 16 శాతం, జనాభాలో 12 శాతం మంది కరవు బారిన పడుతున్నారు. మొత్తం సగటు కరవుపీడిత ప్రాంతం 10 లక్షల చదరపు కి.మీ లేదా దేశంలోని మొత్తం భూభాగంలో మూడింట ఒక వంతుగా ఉండొచ్చని నిపుణులు చెబుతున్నారు. నీతి ఆయోగ్ ప్రకారం ప్రతీ సంవత్సరం 1.2 కోట్ల హెక్టార్ల విస్తీర్ణం కరువు ఎడారి కారణంగా నష్టపోతున్నాయి. ఇక్కడ రెండు కోట్ల టన్నుల ధాన్యం పండించవచ్చు. ఇస్రోస్పేస్ అప్లికేషన్ సెంటర్ నివేదిక ప్రకారం భారత్‌లో 90 శాతం రాష్ట్రాల్లో ఎడారీకరణ విస్తరించింది. దీంతో వ్యవసాయరంగం కుదేలైపోతోంది. భారత్‌లో మొత్తం 29 రాష్ట్రాలకుగాను 26 రాష్ట్రాల్లో గత పదేళ్లలో ఎడారి ప్రాంతం బాగా పెరిగింది. ఈ కరవుల వలన వృక్ష సంపద నాశనం అవుతుంది. నేల కోతకు గురవుతుంది. నీరు కలుషితం అవుతుంది. ఈ కరవుకు సమాజంలోని బలహీనవర్గాలు ఎక్కువగా ప్రభావితం అవుతారు. పేదరికం పెరుగుతుంది. దేశ ఆర్థికాభివృద్ధి జరగదు. వీటి నివారణకు నదులను అనుసంధానం చేయాలి. మరిన్ని రిజర్వాయర్లు, ఆనకట్టల నిర్మాణానికి రూపకల్పన జరగాలి. కరవు నిరోధక పంటలను ప్రోత్సహించాలి. అడవులను కాపాడుకోవాలి. వృక్షాలను పెంచడం, పచ్చదనం పెంపు చేయాలి. వర్షం నీరు నదులు, సముద్రాలలో కలసిపోకుండా చెక్‌డ్యామ్‌లను నిర్మించాలి. నేల స్థిరీకరణ కోసం షెల్టర్ బెల్టలను, ఉడ్లాట్లను ఉపయోగించాలి. వుడ్‌లాట్ అనేది చెట్ల చిన్న ప్రాంతం. వుడ్‌లాట్‌లు నేల కోతను నిరోధించడంలో స్థానిక వాతావరణాన్ని మెరుగుపరచడంలోను, గాలిని శుద్ధి చేయడంలో కూడా సహాయపడతాయి. భూసార పరిరక్షణ, జీవ వైవిధ్యం పెంపుతో పాటుగా వ్యవసాయ భూములలో గృహాలు, పెద్ద పెద్ద భవనాలు నిర్మాణాలు చేయకూడదు. పరిమితికి మించి వ్యవసాయ బోర్లు తవ్వకూడదు. అలాగే గృహాలలో మంచినీటి బోర్లను అవసరానికి మాత్రమే వేయాలి.

# మారిషస్‌లో తెలుగు ప్రజల 'ప్రవాసం'



రామ కిష్టయ్య సంగనభట్ల

మారిషస్ ద్వీపంలో భారతీయ కార్మికుల రాకను గుర్తు చేసుకోవడానికి మారిషస్ నవంబర్ నెల 2వ రోజును భారతీయ రాక దినోత్సవంగా జరుపుకుంటుంది. 1834లో ప్రైవేట్ ఇంపోర్టేషన్ స్కీం కింద భారతీయులు మారిషస్‌కు జీవనోపాధి కోసం వలస కార్మికులుగా వెళ్లడం ప్రారంభించారు. అదే సంవత్సరం ఆగస్టు నెలలో బొంబాయి నుండి సారాలో 39మంది ఉచిత కూలీలతో కూడిన బ్యాచ్ కాలనీకి చేరుకుంది. ఈ కార్మికులు నవంబర్ 2, 1834 ఆదివారం నాడు కాలనీకి చేరుకున్నారు. వారి ల్యాండింగ్‌కు నవంబర్ 3 సోమవారం నాడు అనుమతి లభించింది. మరుసటి రోజు వారు మారిషస్ గడ్డపైఅడుగు పెట్టారు. అక్కడ వారు 'ఆంటోయినెట్' షుగర్ ఎస్టేట్లో పనికి వెళ్లారు. వీరికి నెలవారీ జీతం ఐదు రూపాయలు కాగా ఆరు నెలల జీతం అడ్వాన్స్ పొందారు. 1834 సంవత్సరంలో దాదాపు 35 ఓడల్లో భారతీయులు మారిషసుకు వలసవచ్చారు. వారిని తీసుకుని వచ్చిన ఓడల పేర్లు సిటీ ఆఫ్ లండన్, కింగ్ స్టన్, ఫ్లవర్ ఆఫ్ ఉగీర్, సుల్తాన్, సిరంగపట్నం, బాబా బ్రాహ్మిన్, కోరంగి పికేట్ మొదలైనవి. నేడు మారిషస్ జనాభాలో 68 శాతం కంటే ఎక్కువ మంది భారతీయ మూలానికి చెందిన వారు, సాధారణంగా ఇండో మారిషియన్లు అని పిలుస్తారు. భారతీయ ఆగమన దినోత్సవాన్ని పురస్కరించుకొని మారిషస్ పోస్ట్ 1978లో 1.50 మారిషస్ రూపాయల విలువ కలిగిన స్టాంపును విడుదల చేసింది. ఆఫ్రికా ఖండ తీర ఆగ్నేయ తీర ప్రాంతాల్లో 2000లో మీటర్ల దూరంలో హిందూ మహా సముద్రంలో ఉన్న ద్వీప దేశం మారిషస్. పోర్టు లూయిస్ రాజధానిగా దాదాపు 12లక్షలపై చిలుకు జనాభా కలిగి, ఆంగ్లం, తెలుగు అధికార భాషలుగా, మారిషియస్ క్రియోల్, ఫ్రెంచి, చైనీస్ ఉర్దూలతోపాటు, భోజ్‌పూరి, మరాఠీ, తమిళం, ఉర్దూ తదితర భారతీయ ప్రాంతీయ భాషలు కలిగి ఉంది. ఆఫ్రికా దేశాల మానవ అభివృద్ధి జాబితాలో ద్వితీయ స్థానంలో ఉన్న మారిషస్ హిందూయిజం అతి పెద్ద మతంగా ఉన్న ఏకైక ఆఫ్రికా దేశంగా ప్రత్యేకతను కలిగి ఉంది. రైతులు చెరకు పొలాలలో పని చేయడానికి పెద్ద సంఖ్యలో భారతదేశం నుండి కార్మికులను



తీసుకువచ్చారు. 1834-1921 మధ్యలో ద్వీపంలో సుమారు ఐదు లక్షల మంది కార్మికులు పనిచేశారు. 1834లో పుట్టిన ఊళ్లను విడిచి, చెరుకు తోటల్లో పనిచేసేందుకు కూలీలుగా మారిషస్ వెళ్లిన తెలుగువారు మాత్రం తమ తరువాతి తరం వారు కూడా తెలుగు భాషను ప్రేమించి, మాట్లాడేలా పునాది వేశారు. మాతృభాషకు బ్రహ్మోత్సవం జరిపారు. తెలుగుకు పట్టాభిషేకం చేస్తున్నారు. వారు తమతో తీసుకెళ్లాన వ్యవసాయ పరికరాలైన పలుగు, పారతో పాటు 'పెద్ద బాలశిక్ష, రామాయణ, మహాభారతం' వంటి ఇతిహాస గ్రంథాలు, అక్కడి వారిని తెలుగు వారసులుగా తీర్చిదిద్దే ప్రయత్నానికి దోహదపడుతున్నాయి. అవే ఇప్పటి ఆరవ తరం తెలుగువారూ భాషాయజ్ఞంలో మమేకం కావడానికి కొండంత ఆసరాగా నిలుస్తున్నాయి. మారిషస్ దేశానికి వెళ్లిన తెలుగువారు తొలుత తమ భాషా, సాంప్రదాయాలను నిలుపుకోవడానికి ఇబ్బందులను ఎదుర్కొన్నా, అక్కడికి వెళ్లిన వారిలో మేబర్ ప్రాంతానికి చెందిన పండిట్ గుణ్ణయ్య 1930లో తెలుగు భాషావికాసానికి నడుంకట్టారు. ఇలా 1947లో ముందు మారిషస్ ఆంధ్ర మహాసభ, తర్వాత నామాంతరం చెంది మారిషస్ 'తెలుగు మహాసభ'గా ఆవిర్భవించింది. ప్రస్తుతం మారిషస్‌దేశంలో తెలుగు కుటుంబాల్లో ఆరవ తరంవారు సైతం తమ పెద్దలువేసిన బాటలో నడుస్తుండటం ఇక్కడి తెలుగువారికి స్ఫూర్తిదాయక అంశం. మారిషస్ దీవిలోని మొత్తం జనాభా దాదాపు 13 లక్షలైతే, తెలుగువారు ఒక లక్ష మందికిపైగా ఉన్నారు. వీరికోసం సుమారు 300 తెలుగు పాఠశాలలు నడుస్తుండగా 190 మంది అధ్యాపకులు పనిచేస్తున్నారు. ప్రాథమిక తరగతులలో దాదాపు పదివేలమంది విద్యార్థులు తెలుగు మాధ్యమంలో విద్యను అభ్యసిస్తున్నారు. మాధ్యమిక ఉన్నత విద్యలో తెలుగు ద్వితీయభాషగా ఉంది. ఉన్నత విద్యకోసం మహాత్మాగాంధీ విశ్వవిద్యాలయం పనిచేస్తుంటే, తెలుగు మహాసభ, తెలుగు సాంస్కృతిక మండలి, తెలుగు యువ సంఘం, అనేక ఉపసంఘాలు సమన్వయంతో పనిచేస్తున్నాయి. వీటికి మారిషస్ రిపబ్లిక్ ప్రభుత్వం ప్రత్యేక నిధులు కేటాయించి, పూర్తిస్థాయిలో ఆర్థికంగా చేయూత నిస్తున్నది. ఫ్రెంచికి దగ్గరగా ఉండే 'క్రియోల్' వారి మాతృభాష అయినా, స్వభాషాభిమానంతో తెలుగును ద్వితీయ భాషగా ఎంచుకొని తెలుగును బతికిస్తున్నారు. తెలుగుమహాసభ దేశ రాజధాని పోర్టులూయిస్‌లోని రాయల్ రోడ్డులో ప్రధాన కార్యాలయం కలిగి, ఏడుప్రాంతీయ కమిటీలు, 90శాఖలు క్రియాశీలకంగా పనిచేస్తున్నాయంటే ఆ సంస్థ తెలుగు భాషాభివృద్ధికి చేస్తున్న కృషి చెప్పకనే చెబుతున్నది. తెలుగు వారికి ప్రీతి పాత్రమైన ఉగాదితోపాటు వినాయక చవితి, దీపావళి, సంక్రాంతి, జాతీయ సెలవుదినాలుగా పాటించడం గమనార్హం.

# అధ్యక్షుడుగా గెలిస్తే భారత్‌తో పటిష్ట సంబంధాలు



బంగ్లాదేశ్‌లో హిందువులపై దాడిని తీవ్రంగా ఖండించిన ట్రంప్

**వాషింగ్టన్, నవంబరు 1:** బంగ్లాదేశ్‌లో ఇటీవల హిందువులపై జరిగిన దాడిని రిపబ్లికన్ పార్టీ అధ్యక్ష అభ్యర్థి దొనాల్డ్ ట్రంప్ తీవ్రంగా ఖండించారు. తాను అధ్యక్ష ఎన్నికల్లో గెలిస్తే భారత్‌తో అమెరికా సంబంధాలను మరింత బలోపేతం చేస్తానని పేర్కొన్నారు. దీపావళి పండుగ నేపథ్యంలో సోషల్‌మీడియా వేదికగా ఆయన పోస్టు చేశారు. ఈ సందర్భంగా హిందువులకు ఆయన దీపావళి శుభాకాంక్షలు తెలిపారు. అమెరికా అధ్యక్షుడు బైడెన్, డెమోక్రటిక్ పార్టీ అధ్యక్ష అభ్యర్థి కమలా హారిస్‌లు అమెరికాతోపాటు, ప్రపంచంలోని హిందువులను పట్టించుకోలేదని విమర్శించారు. 'బంగ్లాదేశ్‌లో హిందువులు, క్రైస్తవులతోపాటు ఇతర మైనారిటీలపై జరిగిన అనాగరిక దాడిని తీవ్రంగా ఖండిస్తున్నాను. అల్లరి మూకలు హిందువుల ఇళ్లు, దుకాణాలను దోపిడీ చేశాయి. దీంతో ఆ దేశంలో తీవ్రమైన భయానక గందరగోళ పరిస్థితులు తలెత్తాయి. నా హయాంలో ఎప్పుడూ ఇలా జరగలేదు. అమెరికాతోపాటు ప్రపంచవ్యాప్తంగా ఉన్న హిందులను కమలా, బైడెన్‌లు విస్మరించారు. ఇజ్రాయెల్ నుంచి మొదలుకొని, ఉక్రెయిన్, అమెరికా దక్షిణసరిహద్దు వరకు విపత్తులు ఎన్నో ఉన్నాయి. మే అధికారంలోకి వస్తే మళ్లీ అమెరికాను బలంగా తయారుచేసి శాంతిని నెలకొల్పుతాం. రాడికల్ లెఫ్ట్ నుంచి ఎదురవుతున్న మత వ్యతిరేక ఎజెండాగా నుంచి హిందూ అమెరికన్లకు రక్షణ కల్పిస్తాం. హిందువుల స్వేచ్ఛ కోసం పోరాడతాం. నా పరిపాలనతో ఇండియాతోపాటు నా స్నేహితుడు మోడీతో బలమైన భాగస్వామ్యాన్ని ఏర్పచుకుంటాం. కమలాహారిస్ గెలిస్తే అధిక పన్నులు, కఠికమైన నిబంధనలతో మీ చిన్న వ్యాపారాలను దెబ్బతీస్తుంది. నేను గెలిస్తే పన్నులు, నిబంధనల్లో కోత విధిస్తా. అమెరికాను చరిత్రలోనే అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా నిర్మిస్తా. ఇంతకుముందు ఎన్నడూ లేనివిధంగా అమెరికాను అత్యంత శక్తివంతంగా, ఉత్తమంగా తీర్చిదిద్దుతా. అమెరికాను మరోసారి ఉన్నతస్థాయిలో నిలబెడతా. దీపావళి పండుగ చెడుపై విజయం సాధించేలా చేస్తుందని నమ్ముతున్నాను' అని ట్రంప్ పేర్కొన్నారు. బంగ్లాదేశ్‌లో మాజీ ప్రధాని షేక్ హసీనా గద్దె దిగిన తర్వాత హిందువులను లక్ష్యంగా చేసుకుని అల్లరిమూకలు దాడులకు దిగిన విషయం తెలిసిందే. వారి నివాసాలు, వ్యాపార సంస్థలపై దాడులు చేసి తగులబెట్టారు.

గతంలో అధ్యక్షుడి ఉన్న సమయంలో భారత్‌తో ట్రంప్ సానుకూలంగా వ్యవహరించిన విషయం తెలిసిందే. ట్రంప్, మోడీ హౌడీ మోడీ పేరుతో 2019లో టెక్సాస్‌లో, 2020లో అహ్మదాబాద్‌లో 'నమస్తే ట్రంప్' పేరిట భారీ సమావేశం ఏర్పాటు చేసిన సంగతి విదితమే. ఈ రెండు సభలకు ఇరు దేశాల నుంచి భారీ మద్దతు లభించింది. దీంతో భారతీయుల్లో ట్రంప్ పట్ల అభిమానం పెరిగింది. ఈ నేపథ్యంలోనే అమెరికాలో భారీ సంఖ్యలో ఉన్న ఇండో అమెరికన్లను ఆకట్టుకోవడానికి అందివచ్చిన ఏ అవకాశాన్ని వదులుకోవడం లేదు. ఇక అమెరికా అధ్యక్ష ఎన్నికలకు ఇంకా సరిగ్గా ఐదు రోజులే ఉండటంతో ట్రంప్, కమలా విజయమే లక్ష్యంగా హోరాహోరీగా ప్రచారం చేస్తున్నారు. అమెరికాలో ఉన్న అరబ్ అమెరికన్లతోపాటు ఇతర దేశాల నుంచి వచ్చి స్థిరపడిన వారిని తమవైపు తిప్పేందుకు ఇరువురు నేతలు చెమటోడుస్తున్నారు.



# సరిహద్దుల్లో సైనికులతో ప్రధాని దీపావళి వేడుకలు

**న్యూఢిల్లీ, నవంబరు 1:** దేశ సైనిక బలగాలతో కలిసి ప్రధాని ఈసారి కూడా దీపావళి వేడుకలు జరుపుకున్నారు. గుజరాత్‌లోని కచ్‌తీరంలో ఉన్న రక్షణ సిబ్బందితో కలిసి దీపావళి వేడుకలు జరుపుకున్నారు. ఆర్మీ యూనిఫాం ధరించి సైనికులకు మిఠాయిలు పంపిణీచేసారు. 2014లో ప్రధానిగా బాధ్యతలు స్వీకరించినప్పటినుంచి ప్రధానిమోడీ వివిధ ప్రాంతాల్లో సైనికులతోకలిసి వేడుకలు చేసుకోవడంసాంప్రదాయంగా కొనసాగించారు. 2014లో సియాచిన్ సరిహద్దుల్లో ఉన్న సైనికులతో కలిసి చేసుకోగా ఆ తర్వాత సంవత్సరం పంజాబ్ సరిహద్దుల్లోను, హిమాచల్‌ప్రదేశ్‌లోని సుమోడో సరిహద్దు వద్ద సైనికులతో కలిసి దీపావళి సంబరాల్లో పాల్గొన్నారు. అలాగే జమ్ముకాశ్మీర్‌లోని గురేజ్ సెక్టార్, ఉత్తరాఖండ్‌లోని హర్సిల్, జమ్ముకాశ్మీర్‌లోని రాజౌరి, రాజస్థాన్‌లోని లాంగేవాలా, కాశ్మీర్ సరిహద్దుల్లోనినౌషేరా, కార్గిల్, గత ఏడాది హిమాచల్‌లోని లెప్చా ప్రాంతాల్లో సైనికులతో కలిసి ఆయన దీపావళి సంబరాల్లో పాల్గొన్నారు. 2014లో తన మొట్టమొదటి పర్యటనలో సియాచిన్‌వద్ద మాట్లాడుతూ 125కోట్లమంది భారత పౌరులు ఈరోజు దీపావళి స్వేచ్ఛగా జరుపుకుంటున్నారంటే అది మన సైనికులు అంకితభావంతో చేస్తున్న విధినిర్వహణ అని పేర్కొన్నారు. వారి కుటుంబీకుల ప్రతినిధిగా తాను ఈ స్థావరాలకు వచ్చానని ఆనాడు వ్యాఖ్యానించారు. అంతకుముందు దేశప్రజలకు దీపావళి శుభాకాంక్షలు తెలిపారు. దేశప్రజలందరికీ ఈ దీపావళితో ఆరోగ్యం, సంతోషం, ప్రకాశవంతమైన జీవితాలు అందించాలని ఆకాంక్షిస్తున్నట్లు ఆయన తన సందేశంలో వివరించారు. అంతకుముందు ప్రధాని మోడీ గుజరాత్‌లో సమైక్యతావిగ్రహం వద్ద జాతీయ సమైక్యతా దినోత్సవ వేడుకల్లో పాల్గొన్నారు. గుజరాత్‌లోని ఏక్తానగర్‌వద్ద ఈ కార్యక్రమాలు జరిగాయి. సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ విగ్రహం వద్ద పూలమాలలు వేసి నివాళులర్పించారు.



## ఐదు రాష్ట్రాల ఆవిర్భావ దినోత్సవం

### ప్రధాని మోడీ శుభాకాంక్షలు

**న్యూఢిల్లీ, నవంబరు 1:** ఐదురాష్ట్రాలప్రజలకు ప్రధానిమోడీ శుభాకాంక్షలు తెలిపారు. నవంబరు ఒకటవ తేదీ వాస్తవానికి దేశంలోని మధ్యప్రదేశ్, కర్ణాటక, కేరళ,హర్యానా, ఛత్తీస్‌ఘర్ వంటి రాష్ట్రాలతోపాటు ఉమ్మడి తెలుగు రాష్ట్రం కూడా ఆవిర్భవించింది ఆరోజే. తన సోషల్ మీడియా హ్యాండిల్‌పై ప్రధాని మోడీ ఈ రాష్ట్రాలప్రజలకు రాష్ట్ర ఆవిర్భావదినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. కన్నడ రాజ్యోత్సవ అనేది ఒక ప్రత్యేక సందర్భమని, అపారమైన సంస్కృతి, కన్నడ సాంప్రదాయాలకు నిలువెత్తునిదర్శనంగా ఈరోజు నిలుస్తుందని చెప్పారు. ఈరాష్ట్రంలో అత్యంత నిపుణులైన ప్రముఖులతో భాసిల్లుతోందని, విభిన్నరంగాల్లో అత్యున్నతస్థాయి అభివృద్ధిని సాధించిందని, కర్ణాటక ప్రజలు నిరంతరం సుఖసంతోషాలతో ఉండాలని అభిలషిస్తున్నట్లు మోడీ తన పోస్టులో వివరించారు. అలాగే మధ్యప్రదేశ్ ప్రజలకు సైతం మోడీ శుభాకాంక్షలు తెలిపారు. ప్రకృతి సహజసిద్ధమైన వనరులతో అలరారే మధ్యప్రదేశ్‌లో సాంస్కృతిక వారసత్వం కూడా అపారమని పేర్కొన్న మోడీ ఛత్తీస్‌ఘర్ ప్రజలకు సైతం శుభాకాంక్షలు తెలిపారు. విభిన్నరకాల గిరిజన సంస్కృతులు, గిరిజన సాంప్రదాయాలతో అలరారే రాష్ట్రం మరింత అభివృద్ధి చెందాలనే కోరుకుంటున్నట్లు తెలిపారు. తీరప్రాతం రాష్ట్రం అయిన కేరళలో ప్రాచీన సాంప్రదాలకు అత్యంత విలువలనిస్తారని, కష్టపడిపనిచేసే ప్రజలే ఎక్కువన్నారు. ప్రపంచ వ్యాప్తంగా అనేకమంది కేరళనుంచి వెళ్లినవారే ఉన్నారన్నారు. రానున్న రోజుల్లో కూడా కేరళ ప్రజలు దేశ,రాష్ట్ర అభివృద్ధికి ఇతోధికంగా కృషి చేస్తారని చెప్పారు. ఇక హర్యానా పరంగా చూస్తే సుసంపన్నమైన చారిత్రక వారసత్వం ఉందని, దేశ అభివృద్ధికి కీలక భూమిక పోషిస్తున్నదని ప్రధాని మోడీ శుభాకాంక్షలు తెలిపారు.

# ఏకాభిప్రాయంలేకుండా వన్‌నేషన్ వన్ ఎలక్షన్ అసాధ్యం

### ఎఐసిసి అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే



**బెంగళూరు, నవంబరు 1:** ఏకాభిప్రాయ సాధన లేకుండా దేశంలో వన్‌నేషన్ వన్ ఎలక్షన్ నిర్వహించడం అనేది అసాధ్యమని ఎఐసిసి అధ్యక్షుడు మల్లిఖార్జున్ ఖర్గే అన్నారు. పార్లమెంటులో ఈ అంశానికి సంబంధించి ఏకాభిప్రాయ సాధన అవసరమని ఆయన అన్నారు. ఈ బిల్లు పార్లమెంటుకు వచ్చిన తర్వాత ప్రతి ఒక్కరి అభిప్రాయాన్ని పరిగణనలోనికి తీసుకోవాలని, అప్పుడే ఈ బిల్లు ఆమోదం పొందుతుందని అంతేకాకుండా వన్‌నేషన్ వన్ ఎలక్షన్ విధానం అప్పటివరకూ ఆచరణ సాధ్యం కాదని అన్నారు. బిజెపి ఆధ్వర్యంలోని కేంద్రం వన్‌నేషన్ వన్ ఎలక్షన్‌ను ఆమోదించుకునేందుకు శతవిధాలా ప్రయత్నాలుచేస్తోందని ఈ బిల్లుతోపాటే ఉమ్మడి శిక్షాస్మృతిఅమలుకు కూడా ప్రయత్నాలు చేస్తోందని దుయ్యబట్టారు. గుజరాత్‌లోని ఏక్తానగర్‌లో జరిగిన జాతీయ వేడుకల్లో మోడీ మాట్లాడుతూదేశవ్యాప్తంగా వన్‌నేషన్ గుర్తింపును సాధించామని, ఇపుడు ఆధార్ గురించి ప్రపంచం మొత్తం చర్చించుకుంటున్నదన్నారు. అలాగే విభిన్న పన్ను వ్యవస్థలన్నింటినీ మిళితంచేసి వన్‌నేషన్ వన్ ట్యాక్స్ సిస్టమ్‌గా జిఎస్టీని తెచ్చామన్నారు. అలాగే దేశంలోని విద్యుత్ రంగాన్ని ఏకీకృతంచేసి వన్‌నేషన్ వన్‌పవర్‌గ్రిడ్‌ను అమలుకు తెచ్చామన్నారు. అలాగే వన్ నేషన్ వన్‌రేషన్‌కార్డు, వన్‌నేషన్ వన్ హెల్త్ ఇన్సూరెన్స్ తెచ్చామని, ఆయుష్మాన్‌భారత్ అదేకోవలోకి వస్తుందని మోడీ చెప్పిన సంగతితెలిసిందే. ఈ ఏడాది సెప్టెంబరు నెలలో పార్లమెంటులో బిల్లును ఆమోదించారు. లోక్‌సభ, అసెంబ్లీలకు ఏకకాలంలోను, పట్టణ, పంచాయతీ సంస్థల ఎన్నికలు ఆతర్వాత వందరోజుల్లోపు నిర్వహించాలని నిర్ణయించారు. వీటన్నింటి సంగతి ఎలా ఉన్నా ఏకాభిప్రాయ సాధన లేకుండా పార్లమెంటులో చర్చలు జరగకుండా వన్‌నేషన్ వన్ ఎలక్షన్ అమలు సాధ్యం కాదని కాంగ్రెస్ పార్టీ ఇందుకు పూర్తిగా వ్యతిరేకమని ఖర్గే ధ్వజమెత్తారు.



# భారత్‌చైనా సరిహద్దుల్లో పెట్రోలింగ్ షురూ

**న్యూఢిల్లీ, నవంబరు 1:** భారత్‌చైనా సరిహద్దుల్లో ఇరుపక్షాల దళాల ఉపసంహారణ తర్వాత ఇపుడు ఎవరికి వారు గస్తీని ప్రారంభించారు. భారత్ వైపు సరిహద్దుల్లో మన భద్రతా బలగాలు పెట్రోలింగ్‌న ంప్రారంభించాయి. తూర్పు లడక్ ప్రాంతంలోని డెమ్‌చోక్ వద్ద గస్తీకేంద్రం ఏర్పాటుచేయడంతోపాటు సరిహద్దుపొడవునా పెట్రోలింగ్ డ్యూటీలు ప్రారంభం అయ్యాయి. దేశ్‌పాంగ్‌ప్రాంతంలో కూడా పెట్రోలింగ్‌ను ప్రారంభించనున్నట్లు కమాండింగ్ అధికారులు తెలిపారు. అలాగే వాస్తవాధీన రేఖ వెంబడి అనేక ప్రాంతాల్లో దీపావళి సందర్భంగా రెండువైపులా పరస్పరం అభినందించుకుని మిఠాయిలు పంపిణీచేసారు. సైనిక దళాల ఉపసంహరణతో ఇపుడు పెట్రోలింగ్‌కూడా ప్రారంభం కావడంతో 2020 ఏప్రిల్ ముందునాటికి ఉన్న వాతావరణం నెలకొంటుందని అంచనా. ఇక పెట్రోలింగ్ కూడళ్లు, ప్రాంతాలు, నిర్వహించుకోవాల్సిన సరిహద్దు వంటి వాటిపై క్షేత్రస్థాయి కమాండర్లు ఇప్పటికే ప్రత్యేక ప్రణాళికను రూపొందించారు. అయితే ఇరువైపులా క్షేత్రస్థాయి కమాండర్లు మాత్రం పరస్పరం చర్చలు జరుపుకుంటుంటారు. విదేశాంగ కార్యదర్శి విక్రమ్ మిశ్రీ గతనెలలోనే దళాల ఉపసంహారణకు సంబంధించిన ఒప్పందం పూర్తి అయిందని 2020లో చెలరేగిన అంశాలకు సంబంధించి ఇప్పటికీ పరిష్కార మార్గాలు గుర్తించామని చెప్పారు.

2020 నాటి పరిస్థితులతో రెండుదేశాల మధ్య సంబంధాలకు కొంత బ్రేక్‌పడిన సంగతి కూడా తెలిసిందే. గాల్వాన్ లోయలో జరిగిన ఘర్షణలతో భారత్‌వైపునుంచి సుమారు 20 మందికిపైగా సైనికులు తీవ్రగా యాలతో చనిపోవడం జరిగింది. మారణాయుధాలు వినియోగించకూడదన్న ఒప్పందానికి ప్రత్యామ్నాయంగా కర్రలు, వైర్లు చుట్టిన కర్రలతో చైనా సైనికులు దాడులకు దిగడంతో భారత సైనికులు అనుకోకుండా గాయాల పాల య్యారు. అయినా కూడా ధీరోదాత్తంగా పోరాడి చైనా సైనికులను వెనక్కి తరిమేసారు.

# ప్రముఖ ఆర్థికవేత్త వివేక్ దేబ్రాయ్ కన్నుమూత



**న్యూఢిల్లీ, నవంబరు 1:** ప్రముఖ ఆర్థికవేత్త, ప్రధాని ఆర్థిక సలహామండలి ఛైర్మన్‌గా వ్యవహరించిన వివేక్ దేబ్రాయ్ 69వ ఏట కన్నుమూసారు. అఖిలభారత వైద్యవిజ్ఞాన సంస్థలో చేరిన ఆయన చికిత్సచేస్తున్న వైద్యులు శుక్రవారం ఉదయం ఏడు గంటలకు తుదిశ్వాస విడిచారని ప్రకటించారు. ఆయనకు పేగు సంబంధిత అవరోధాలు పెరిగాయని వీటికితోడు అధిక రక్తపోటు, చక్కెర స్థాయిలు కూడా అధికం అయినట్లు ఎయిమ్స్‌అ ధికారులు వెల్లడించారు. 2015లోనే బిబేక్ దేబ్రాయ్‌కు పద్మశ్రీ అవార్డునిచ్చి కేంద్రం సత్కరించింది. ఆర్థికవేత్తల్లో అత్యున్నత శిఖరం దేబ్రాయ్ అని ప్రధాని నరేంద్ర మోడీ తన సంతాపం ప్రకటించారు. ఆర్థికరంగం, చరిత్ర, సంస్కృతి, రాజకీయాలు, ఆధ్యాత్మికరంగాల్లో కూడా అపారమైన విజ్ఞానసంపద ఉన్న ప్రముఖవ్యక్తి అని ఆయన కొనియాడారు. పబ్లిక్ పాలసీపరంగా ఆయన చూపించిన మార్గం ఇప్పటికి శిరోధార్యమన్నారు. దేబ్రాయ్‌తో ఉన్న తన చిత్రాన్ని సోషల్‌మీడియా హ్యాండిల్‌లో పోస్టుచేసి ఆయన పట్ల మోడీ తన అభిమానాన్ని చాటుకున్నారు. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము మాట్లాడుతూ ఒక ప్రముఖ ఆర్థికవేత్త, మేధావిని మనం కోల్పోయామని పేర్కొంటూఆయన కుటుంబసభ్యులకు తన ప్రగాఢ సంతాపం ప్రకటించారు. కోల్‌కత్తాలోని రామకృష్ణ మిషన్ స్కూలు, ప్రెసిడెన్సీ కళాశాలల తర్వాత ఢిల్లీలోని స్కూల్ ఆఫ్ ఎకనమిక్స్, కేంబ్రిడ్జిలోని ట్రినిటి కళాశాలలో చదువుకున్నారు. తాను చదువుకున్న ప్రెసిడెన్సి కళాశాలలోనే పనిచేసారు. గోఖలే ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పాలిటిక్స్ అండ్ ఎకనమిక్స్, ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫారిన్‌ట్రేడ్‌లలో కూడా ఉన్నతపదవుల్లో కొనసాగారు. ఆర్థిక శాఖలో యుఎన్‌డిపి ప్రాజెక్టులో న్యాయసంస్కరణల విభాగానికి డైరెక్టర్‌గా కూడా కొనసాగారు. 2019 జూన్ ఐదువరకూ ఆయన నీతి ఆయోగ్‌సభ్యునిగా వ్యవహరించారు. ప్రాచీన సంస్కృత భాషల్లో ఉన్న మహాభారత, భగవద్గీతలను ఆయన అనువదించారు. అనేక పుస్తకాలు, పరిశోధన పత్రాలు, ప్రముఖ వ్యాసాలను కూడా ఆయన తర్జుమాచేసారు. అనేక దినపత్రికలకు కన్సల్టింగ్; కంట్రిబ్యూటింగ్ ఎడిటర్‌గా కూడా పనిచేసారు. ఆర్థికవ్యవస్థపై అపారమైన అనుభవం ఉన్న మెరిట్ కలిగిన ప్రతిభావంతులయిన జనరల్ కేటగిరీ విద్యార్థులకు విద్యారుణాలు లభించడంలో ఎదురవుతున్న ఇబ్బందులపై సోదాహ రణంగా వ్యాసాలు రాసారు. అలాగే అమెరికా, యూరోప్; కెనడా, ఆస్ట్రేలియా, న్యూజిలాం డ్‌లలో చదువుకునే వారికి విద్యారుణాలు లభించడంలో ఎదురయ్యే సమస్యలనుకూడా ఆయన ప్రస్తావించారు. అయితే విద్యాపరమైన రుణాల్లో బకాయిలు దేశవ్యాప్తంగాచూస్తే 1,23,066 కోట్లవరకూ ఉన్నాయని ప్రకటించింది. సుమారు 13 లక్షల మంది విద్యార్థులు విదేశాల్లో చదువుకుంటున్నారని బిబేక్ స్వయంగా వెల్లడించారు.

## మహారాష్ట్రలో శతాధిక వృద్ధ ఓటర్లు 47,392

### ఈనెల 20వ తేదీ పోలింగ్‌కు సర్వం సిద్ధం



**ముంబయి, నవంబరు 1:** మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలకు అర్హులైన 9.7 కోట్లమంది ఓటర్లలో 47,392 మంది శతాధిక వృద్ధులైన ఓటర్లు కూడా ఉన్నట్లు ఎన్నికల సంఘం ప్రకటించింది. ఈనెల 20వ తేదీ మహారాష్ట్ర ఎన్నికలు జరగనున్న సంగతి తెలిసిందే. రాష్ట్ర ముఖ్య ఎన్నికల ధికారి వివరాలప్రకారం మొత్తం 22,22,704 మది ఓటర్లు 18నుంచి 19 ఏళ్లమధ్యలో ఉన్నారని, శతాధికవృద్ధుల పరంగా చూస్తే వందేళ్లు ఆపైబడి 109 ఏళ్లవరకూ ఉన్నవారు 47,392 మందివరకూ ఉన్నట్లు తెలిపారు. రాష్ట్రంలో మొత్తం 9,70,25,119 మంది ఓటర్లు ఉంటే వారిలో 5,00,22,739 మందివరకూ పురుషులు,469,96,279 మంది మహిళలు ఉఏంటే 6,101 మందిథర్డ్ జెండర్ ఓటర్లు ఉన్నారు. మొత్తం 288 నియోజకవర్గాలకు ఈనెల 20వ తేదీ పోలింగ్ జరుగుతుంది. ఓట్లలెక్కింపు ఈనెల 23వ తేదీనే పూర్తవుతుందని ముఖ్యఎన్నికలఅధికారి ప్రకటించారు.



## జమ్మూకాశ్మీర్‌లోని చీనాబ్ వంతెన వివరాలు తెలుసు కుంటున్న పాకిస్థాన్

### వెల్లడించిన ఇంటెలిజెన్స్ వర్గాలు

**శ్రీనగర్, నవంబరు 1:** జమ్మూకశ్మీర్‌లోని చినాబ్ నదిపై నిర్మించిన ప్రపంచంలోనే అత్యంత ఎత్తయిన రైల్వే వంతెనపై పొరుగుదేశం పాకిస్థాన్ కన్నేసినట్లుగా ఇంటలిజెన్స్ వర్గాలు పేర్కొన్నట్లు పలు మీడియా సంస్థలు వెల్లడిస్తున్నాయి. జమ్మూకశ్మీర్‌లోని రైసీ, రామబాణ్ జిల్లాల మధ్య నిర్మిస్తున్న ఈ వంతెనకు సంబంధించిన వివరాలు సేకరించమని చైనా పాకిస్తాన్‌ను కోరడంతో ఆ దేశ ఇంటెలిజెన్స్ వర్గాలు ఈ బ్రిడ్జి గురించిన కీలకమైన విషయాలు తెలుసుకుంటున్నట్లు వార్తలు వస్తున్నాయి. అయితే ఆ వివరాలు ఎందుకు తెలుసుకుంటున్నారనే విషయంపై స్పష్టత లేదు. ప్రపంచంలోనే అత్యంత ఎత్తయిన చినాబ్ రైల్వే వంతెన నిర్మాణం దాదాపు పూర్తయిన విషయం తెలిసిందే. దీని నిర్మాణం పూర్తి చేయడానికి ప్రభుత్వానికి 20 ఏళ్ల పట్టింది. ఇటీవల ఈ వంతెనపై తొలి రైలు ట్రయల్‌రన్‌ను విజయవంతంగా నిర్వహించారు. కశ్మీర్‌ను భారత్‌లోని మిగతా ప్రాంతాలలో అనుసంధానించేందుకు చేపట్టిన ఈ నిర్మాణాన్ని ఉధంపూర్, శ్రీనగర్, బారాముల్లా రైల్వే లింగ్ ప్రాజెక్టులో భాగంగా నిర్మించారు. ఇప్పటివరకు చైనాలోని బెయిపాన్ నదిపై నిర్మించిన 275 మీటర్ల పొడవైన షుబాయ్ రైల్వే వంతెన పేరుతో ఉన్న ప్రపంచ రికార్డును ఇది అధిగమించింది. పారిస్‌లోని ప్రఖ్యాత ఈఫిల్ టవర్‌తో పోలిస్తే దీని ఎత్తు 30 మీటర్లు ఎక్కువగా ఉండటం విశేషం. నదీగర్భం నుంచి 359 మీటర్ల ఎత్తున ఉన్న ఈ రైల్వే వంతెన పొడవు 1,315 మీటర్లు.

# 'మహా'ఎన్నికల బరిలో 7995 మంది అభ్యర్థులు



**ముంబయి, నవంబరు 1:** మహారాష్ట్రలో నవంబరు 20వ తేదీ జరిగే అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించి మొత్తం 7995 మంది అభ్యర్థులు పోటీలో నిలిచారు. నామినేషన్లకు చివరి రోజయిన గతనెల 29న దాదాపు 4996 మంది నామినేషన్లు దాఖలుచేసారని ఎన్నికల సిఇఒ తెలిపారు. మొత్తం 288 స్థానాలకు ఒకేరోజు పోలింగ్ జరుగుతోంది. మహాయుతితోపాటు, మహావికాస్ అగాఢిలపై పలువురు నాయకులు తిరుగుబాటుచేసి స్వతంత్ర అభ్యర్థులుగా నామినేషన్లు దాఖలు చేసారు. తిరుగుబాటు చేసిన అభ్యర్థుల్లో బోరివాలి నుంచి గోపాల్‌శెట్టి, ఉమరేడ్‌నుంచి రాజు పారవే, తూర్పు అంధేరినుంచి స్వీకృతిశర్మ, చించ్‌వాడ్‌నుంచి నానాకాటే తదితరులున్నారు. నామినేషన్ల ఉపసంహారణకు నవంబరు నాలుగోతేదీవరకూ గడువు ఉండటంతో రెబెల్స్‌ను బుజ్జగించేందుకు పార్టీలుప్రయత్నిస్తున్నాయి. ప్రధాన కూటములయిన బిజెపి షిండే శివసేన అజిత్ ఎన్సీపీల కలయికతో వచ్చిన మహాయుతి, కాంగ్రెస్ శివసేనథాకరే, శరద్ పవార్‌ఎన్సీపీల కలయికతో వచ్చిన మహావికాస్ అగాఢి కూటముల అభ్యర్థులు, ఇతర పార్టీలు స్వతంత్ర అభ్యర్థులు మొత్తం నామినేషన్లు దాఖలు చేసారు. వీరిలో అత్యధికంగా బిజెపి తరపున 148 మంది కాంగ్రెస్ తరపున 103 మంది అభ్యర్థులు నామినేషన్లు దాఖలుచేసారు. 2019 ఎన్నికల్లో బిజెపి 164 స్థానాలు, కాంగ్రెస్ 147 స్థానాల్లో పోటీచేసాయి. కానీ ఈసారి రాజకీయ సమీకరణాలు మారడంతో ప్రధానకూటముల్లో సీట్ల పంపకాలు ఆలశ్యం అయ్యాయి. ఇక మిగిలిన పార్టీలు శివసేన యుబిటి 89, శివసేన షిండే 80, ఎన్సీపీ ఎస్పీ 87, ఎన్సీపీ ఎపి 53 స్థానాల్లో పోటీచేస్తున్నట్లు ప్రకటించాయి. అయితే అభ్యర్థులకు రెబెల్స్ బెడద ఎక్కువగానే ఉంది. అటు మహాయుతి, ఇటు మహావికాస్ అగాఢిలో కూడా ఇదే సమస్య అభ్యర్థులను భయపెడుతోంది.

### కెనడాలో భారీస్థాయిలో డ్రగ్స్‌ను స్వాధీనం చేసుకున్న పోలీసులు

# భాతరత సంతతి వ్యక్తి అరెస్టు




**ఒట్టావా, నవంబరు 1 :** కెనడాలో భారీగా డ్రగ్స్ గుట్టు రట్టయింది. వాంకోవర్ పరిధిలో అక్రమంగా నడుపుతున్న ల్యాబ్‌ను పోలీసులు గుర్తించారు. ఈ క్రమంలో జరిపిన దాడుల్లో మాదక ద్రవ్యాలతో పాటు పలు రకాల రసాయనాలు, ఆయుధాలను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. భారత సంతతికి చెందిన గగన్ ప్రీత్ సింగ్ రంధవాను అరెస్టు చేశారు. ఈ సోదాల్లో భాగంగా కెనడా పోలీసులు కేజీల కొద్ది ఫెంటానిల్, మెథాం ఫెటమైన్, కొకైక్, ఎండిఎంఎ వంటి డ్రగ్స్‌ను స్వాధీనం చేసుకున్నారు. వాటిలో ప్రాణాంతక రసాయనాలున్నాయని తెలిపారు. వాటితో పాటు తుపాకులు, పేలుడు పదార్థాలు, ఇంకా పలు ఆయుధాలు, 5 లక్షల డాలర్ల నగదును గుర్తించారు. అక్రమంగా ఆయుధాలను కలిగి ఉండటం, డ్రగ్స్‌కు సంబంధించి రంధవా పలు ఆరోపణలు ఎదుర్కొంటున్నాడని తెలిపారు. ఈ కేసులో మరికొంత మందిని అరెస్టు చేయనున్నట్లు తెలుస్తోంది. అక్రమంగా డ్రగ్స్ ఉత్పత్తి, సరఫరా చేస్తోన్న గ్రూప్‌ను కొన్ని నెలలపాటు దర్యాప్తు అనంతరం చేయగలిగామని వెల్లడించారు. వీరికి అంతర్జాతీయంగా సంబంధాలు ఉన్నాయన్నారు.

### హెజ్‌బొల్లా ఆయుధశక్తిపై ఇజ్రాయెల్ పైచేయి

# 70 శాతం డ్రోన్లు ధ్వంసం

**టెల్అవీవ్, నవంబరు 1:** లెబనాన్‌లోని హెజ్‌బొల్లా గ్రూప్‌నకు చెందిన 70శాతం డ్రోన్లను ధ్వంసం చేశామని ఇజ్రాయెల్ ప్రకటించింది. సెప్టెంబరు మధ్య నుంచి దాడులను తీవ్రతరం చేసి దాని 'యూనిట్ 127'నుభారీగా దెబ్బతీసినట్లు పేర్కొంది. ఆ డ్రోన్ యూనిట్ కమాండర్, 10 శాతం మంది ఆపరేటర్లను మట్టుబెట్టినట్లు తెలిపింది. ఉత్తర లిటానీ ప్రాంతంలో జరిగిన ఆపరేషన్‌లో 54పొజిషన్లను కూడా దెబ్బ తీశామని చెప్పింది. దాదాపు ఆ యూనిట్ ఆపరేషన్లు నిర్వహిస్తున్న 24 ప్రదేశాలు, 8 అసెంబ్లింగ్ సెంటర్లు, ఆరు అండర్ గ్రౌండ్ బేస్‌లు, 7 డ్రోన్ గోదాములను పేల్చేసినట్లు ఐడిఎఫ్ వెల్లడించింది. వాస్తవానికి హెజ్‌బొల్లా డ్రోన్లతో ఇజ్రాయెల్ ఎయిర్ డిఫెన్స్ వ్యవస్థలు కూడా ఇబ్బంది పడుతున్నాయి. రాకెట్లతో పోలిస్తే వీటిని కూల్చివేసిన సందర్భాలు చాలా తక్కువగా ఉన్నాయి. ఫలితంగా ఇజ్రాయెల్ ఆస్తి, ప్రాణ నష్టాలకు డ్రోన్లే ప్రధాన కారణంగా నిలిచాయి. మొత్తం 1,300 ప్రయోగించగా వాటిల్లో 231ని మాత్రమే కూల్చేశాయి. 90 శాతం రాకెట్లను కూల్చేసిన ఎయిర్ డిఫెన్స్ వ్యవస్థలు కేవలం 80 శాతం మాత్రమే యుఎవిలను అడ్డుకున్నాయి. దారుణంగా దెబ్బతిన్న హెజ్‌బొల్లా రాకెట్ శక్తి.. హెజ్‌బొల్లా అంటేనే ఓ రాకెట్ శక్తి. ఇజ్రాయెల్‌తో యుద్ధంలో అది తీవ్రంగా దెబ్బతిన్నది. దీని వద్ద యుద్ధానికి ముందు దాదాపు 1.5 లక్షల ప్రొజెక్టయిల్స్ ఉండేవి. దాని అమ్ముల పొదిలోని దాదాపు 80 శాతం రాకెట్లు, క్షిపణులను ఇజ్రాయెల్ ధ్వంసం చేసింది. ఈ విషయాన్ని ఆ దేశ రక్షణ మంత్రి గాల్లంట్ పేర్కొన్నారు. రెండ్రోజుల క్రితం ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం హెజ్‌బొల్లా మిగిలిన 20 శాతం శక్తితోనే పోరాడుతోందని చెప్పారు. మరోవైపు హెజ్‌బొల్లాకు అండగా నిలిచిన ఇరాన్‌లోని క్షిపణి ఇంధన మిక్సర్లను ఇజ్రాయెల్ ధ్వంసం చేసింది. దీంతో హెజ్‌బొల్లా కూడా తిరిగి క్షిపణులను వెంటనే తయారు చేసుకోలేని పరిస్థితి తలెత్తింది.

### దేవీరమ్మ జాతరలో తొక్కిసలాట

### 12 మందికి తీవ్రగాయాలు

**బెంగళూరు, నవంబరు 1:** కర్ణాటకలోని చిక్కమగుళూరులోని దేవీరమ్మ కొండపై జరిగే జాతరకు వెళ్లేందుకు భక్తులు పోటెత్తడంతో తొక్కిసలాట జరిగింది. వేలాది సంఖ్యలోభక్తులు ఒక్కసారిగా రావడంతో కొండలపై జారిపడి పలువురికి గాయాలయ్యాయి. మల్లెనహళ్లిలోని దేవీరమ్మ కొండపై ఉన్న గుడివద్ద గురువారం ఉదయం ఈ ఘటనజరిగింది. గత రెండురోజులుగా జిల్లాలో కురుస్తున్న భారీ వర్షాలు కూడా ఇందుకు కారణమని అధికారులు వెల్లడించారు. సందర్శకుల భద్రతకోసం జిల్లా యంత్రాంగం పోలీసులు ముందస్తు చర్యలుచేపట్టినప్పటికీ భారీ వర్షాల కారణంగా కొండలు తడిగా మారాయని వెల్లడించారు. ఆలయం నుంచి తిరిగి వస్తుండగా పడిపోవడంతో సుమారు 12 మంది భక్తులు గాయపడ్డారని ప్రస్తుతం వారి ఆరోగ్యపరిస్థితి నిలకడగానే ఉందని అధికారులు తెలిపారు. చిక్‌మగళూరు ప్రాంతంలోని చంద్రద్రోణ కొండపై ఈ దేవాలయం ఉంది. ఈ మందిరానికి ఒక ప్రత్యేకత ఉంటుంది. కేవలం దీపావళి సందర్భంగా మాత్రమే ఆలయాన్ని తెరుస్తారు.

# స్వతంత్రతను పక్కన బెట్టిన ఇసి

### ఘాటుగా లేఖ రాసిన కాంగ్రెస్ పార్టీ

**న్యూఢిల్లీ, నవంబరు 1:** కేంద్ర ఎన్నికల సంఘం(సిఇసి)పై కాంగ్రెస్ తీవ్రస్థాయిలో విమర్శలు చేసింది. తన స్వతంత్రను పూర్తిగా పక్కన పెట్టడమే లక్ష్యమైతే ఆ విషయంలో ఎన్నికల సంఘం అద్భుతమైన పనితీరు చూపుతోందని మండిపడింది. ఈ మేరకు లేఖ రాసింది. ఇటీవల జరిగిన హర్యానా అసెంబ్లీ ఎన్నికల్లో ఎగ్జిట్ పోల్స్ అంచనాలు తలకిందులు చేస్తూ ఫలితాలు వెలువడ్డాయి. బిజెపి అనూహ్య విజయాన్ని సొంతంచేసుకుంది. ఎన్నికల్లో అవకతవకలు చోటుచేసుకున్నాయని ఆరోపిస్తూ కాంగ్రెస్ ఫిర్యాదు చేయగా ఇసి తోసిపుచ్చింది. 'తమకు అనుకూల ఫలితాలు రానప్పుడు కాంగ్రెస్ నిరాధార ఆరోపణలు చేస్తుంటుంది' అని విమర్శించింది. ఆ ఆరోపణలు బాధ్యతా రాహిత్యమైనవని తోసిపుచ్చింది. ఎన్నికల సంఘం తనకు తాను క్లీన్‌చిట్ ఇచ్చుకోవడం ఆశ్చర్యపర్చలేదని కాంగ్రెస్ వ్యాఖ్యానించింది. అయితే సమాధానం ఇచ్చిన తీరు, వాడిన భాష, పార్టీపై చేసిన ఆరోపణలు తాము తిరిగి లేఖ రాసేందుకు కారణమయ్యాయని వ్యాఖ్యానించింది.



మాజీ ప్రధాని ఇందిరాగాంధీ, సర్దార్ వల్లభ్‌భాయి పటేల్ వర్ధంతి సందర్భంగా వారి చిత్రపటాల వద్ద నివాళుర్పిస్తున్న టిపిసిసి చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్, రాజ్యసభ సభ్యుడు అనిల్‌కుమార్‌యాదవ్, మాజీ ఎంపి వి.హనుమంతరావు తదితరులు

# సిఎం ఏడుసార్లు వెళ్లినా దక్కని రాహుల్ అపాయింట్‌మెంట్

## 2025 డిసెంబరు నాటికి కొత్త సిఎం రావొచ్చు
### మీడియాతో బిజెఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి



శుక్రవారం తన నివాసంలో మీడియాతో మాట్లాడుతున్న బిజెఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి

**హైదరాబాద్, నవంబరు 1, ప్రభాతవార్త:** ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి కౌంట్‌డౌన్ మొదలు అయిందని, త్వరలోనే సిఎం సీటు ఎసరు పడబోతుందని బిజెఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన నివాసంలో మీడియాతో చిట్‌చాట్ చేశారు. సిఎం రేవంత్‌రెడ్డి ఢిల్లీకి ఏడుసార్లు వెళ్లినా రాహుల్‌గాంధీ అపాయింట్‌మెంట్ ఇవ్వడం లేదన్నారు. 2025 జూన్ నుంచి డిసెంబరు వరకు తెలంగాణకు కొత్త సిఎం వచ్చే అవకాశం ఉందన్నారు. కొత్త సిఎం ఎంపికకు పార్టీ ముమ్మరంగా కసరత్తు చేస్తుందని, ఆశావాహులు సిఎం పోస్టు కోసం పోటీ పడుతున్నారంటూ ఘాటు వ్యాఖ్యలు చేశారు. కనీసం ప్రియంకాగాంధీని కలవాలని కేరళలోని వనాడ్‌కు వెళ్లినా దర్శనభాగ్యం కలగలేదన్నారు. రూ.50లక్షల మూసి ప్రాజెక్టు వ్యయాన్ని సిఎం లక్షన్నర కోట్లకు పెంచుతూ మాట్లాడాని, ఇందులో భారీ స్కాం జరగబోతుందని కాంగ్రెస్ అధిష్టానం భావిస్తోందన్నారు. అందుకే కాంగ్రెస్ రేవంత్‌రెడ్డిని దూరం పెడుతుందన్నారు. సిఎం ఏకపక్ష ధోరణిని వ్యతిరేకిస్తూ ఢిల్లీకి పెద్ద ఎత్తున ఫిర్యాదులు చేస్తున్నారని ఆరోపించారు. సిఎం భారీగా వసూళ్లకు పాల్పడుతున్నారని, సహచర మంత్రులు, ఎమ్మెల్యేలు భావిస్తున్నారని, దీన్ని అధిష్ఠానం కూడా నమ్ముతుందన్నారు. సిఎం రేవంత్‌రెడ్డి హైడ్రా, మూసి, ల్యాండ్ సెటిల్‌మెంట్‌లపై హైకమాండ్ వద్ద తేల్చుకునేందుకు సీనియర్ మంత్రులు నివేదికలు పంపారని వారంతా ఎప్పటికప్పుడు నివేదికలు పంపిస్తూనే ఉన్నారన్నారు.

కాగా సిఎం సెల్ఫ్ ఏజెండాపై సీనియర్ నేత పల్లంరాజు మూసి అంశంపై సోనియాగాంధీకి ఫిర్యాదు చేశారని, రంగంలోకి దిగిన ఆమె డికె శివకుమార్‌కు చెప్పి ఫోన్ చేసి కనుక్కొమని చెప్తే ఫోన్ కూడా లిఫ్ట్ చేయాలన్నారు. రేవంత్‌రెడ్డి వ్యక్తిగత లాభం కోసం పార్టీని ఇరికిస్తున్నాడని పార్టీ భయపడుతుందన్నారు. కెవిపి రాంచంద్రరావు ఇళ్లు కూల్చివేత అంశంపై రేవంత్ చిన్న పిల్లాడిలా మాట్లాడారన్నారు. దీనిపై హైకమాండ్ సిరియస్‌గా ఉందని, దీనిపై కెవిపి ఇప్పటికే బహిరంగ లేఖ రాశారన్నారు. సిఎం రేసులులో ముగ్గురు ఉన్నారన్నారు. ఈ విషయం గ్రహించిన రాజగోపాల్‌రెడ్డి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సిఎం అవుతారని, తన నాలుకపై మచ్చలున్నాయని చెప్పారన్నారు. ఇదంతా తెలుసుకున్న రేవంత్‌రెడ్డి దీపం ఉన్నప్పుడే ఇళ్లు చక్క దిద్దుకోవాలని భావిస్తున్నారన్నారు. అందుకే కేబినెట్ విస్తరణ కూడా చేయడం లేదన్నారు. మూసి, హైడ్రా విషయంలో మంత్రులు, ఎమ్మెల్యేలు పైకి ఒకే అని నటిస్తున్నారన్నారు. ఉత్తమ్, కోమటిరెడ్డి, భట్టి పేర్లు సిఎంలుగా పేర్లు వినిపిస్తున్నాయన్నారు.

# విద్యార్థులకు మంచి భవిష్యత్తు కోసమే శ్రమిస్తోన్న సిఎం రేవంత్‌రెడ్డి
### మంత్రి సీతక్క

**హైదరాబాద్, నవంబరు 1, ప్రభాతవార్త:** విద్యార్థులకు మంచి భవిష్యత్తు ఉండాలనే లక్ష్యంగా సిఎం రేవంత్‌రెడ్డి పనిచేస్తున్నారని మంత్రి సీతక్క అన్నారు. చరిత్రలో ఎన్నడూ లేని విధంగా హాస్టల్, గురుకుల విద్యార్థులకు డైట్ కాస్మోటిక్ చార్జీలను 40శాతం పెంచారన్నారు. చరిత్ర ఎన్నడూ లేని విధంగా విద్యార్థులకు 40శాతం చార్జీలను పెంచిన సిఎంకు దన్యవాదాలు తెలిపారు. ఏడు సంవత్సరాలు క్రితం డైట్ చార్జీలు కొంచెం పెంచి టిఆర్ఎస్ ప్రభుత్వం ప్రచారం చేసుకుందన్నారు. ఏడు సంవత్సరాలుగా ధరలు విపరీతంగా పెరిగిన అనుగుణంగా డైట్, కాస్మోటిక్ చార్జీలు పెంచలేదని, విద్యార్థులు ఆర్థాకలితో ఇబ్బందుల పడ్డారన్నారు. విద్యార్థులకు బిఆర్ఎస్ చేసింది శూన్యం అని మంత్రి సీతక్క అన్నారు. పెంచిన చార్జీలు అందుకోబోతున్న విద్యార్థులకు శుభాకాంక్షలు అన్నారు. ఇదే విద్యార్థులకు అసలైన దీపావళి అన్నారు.

# హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ మెరిట్ అభ్యర్థులకు సర్టిఫికెట్ వెరిఫికేషన్

## 14 నుంచి 30 వరకు కొనసాగింపు.. తెలుగు వర్సిటీలో నిర్వహణ
### షెడ్యూల్ ప్రకటించిన టిజిపిఎస్సీ

**హైదరాబాద్, నవంబరు 1, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని వివిధ సంక్షేమ శాఖల్లోని హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్(హెచ్‌డబ్ల్యూవో) నియామకాల కోసం తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్(టీజీపీఎస్సీ) నిర్వహించి పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించిన వారిలో 1:2 మరియు 1:5 మెరిట్ జాబితాలోని పిడబ్ల్యూడీ అభ్యర్థులకి సర్టిఫికెట్ వెరిఫికేషన్‌ను నిర్వహించనున్నారు. మెరిట్ జాబితాలో ఉన్న పిడబ్ల్యూడీ అభ్యర్థులకి ఈ నెల 14 నుంచి 30 వరకు సర్టిఫికెట్ వెరిఫికేషన్‌ను నిర్వహించనున్నారు.

సురవరం తెలుగు విశ్వవిద్యాలయంలో సర్టిఫికెట్ వెరిఫికేషన్‌ను నిర్వహించనున్నట్లు టీజీపీఎస్సీ సెక్రటరీ నవీన్ నికోలస్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు నిర్వహించనున్నారు.

ఈ నెల 14 నుంచి 30 వరకు సర్టిఫికెట్ వెరిఫికేషన్‌కి హాజరు కాని వారి కోసం డిసెంబర్ 2 నుంచి 4 వరకు సర్టిఫికెట్ వెరిఫికేషన్‌ను నిర్వహించనున్నారు.

వివిధ సంక్షేమ శాఖల్లోని హెచ్‌డబ్ల్యూవో పోస్టుల భర్తీ కోసం టీజీపీఎస్సీ డిసెంబర్ 23, 2022న నోటిఫికేషన్ నంబర్ 25/2022ను జారీ చేసిన విషయం తెలిసిందే.

# అమీన్‌పూర్‌లో ప్లాట్లు కొని మోసపోయాం

## మోసగించినవారి నుంచి నష్టపరిహారం ఇప్పించండి
### హైడ్రా కమిషనర్ రంగనాథ్ వద్దకు బాధితులు క్యూ

**హైదరాబాద్, నవంబర్ 1, ప్రభాతవార్త:** అమీన్‌పూర్‌లో ప్లాట్ కొని మోసపోయామంటూ హైడ్రా కమిషనర్ రంగనాథ్ వద్దకు బాధితులు క్యూకట్టారు. మాధవరెడ్డి, చంద్రశేఖర్, కోటీశ్వరరావు అనే వ్యక్తుల దగ్గర ప్లాట్లు కొని మోసపోయామంటూ హైడ్రా కమిషనర్ రంగనాథ్‌కు శుక్రవారం బాధితులు ఫిర్యాదు చేశారు. సర్వేనంబర్ అనుమతులు చూపించి సర్వేనంబర్ 12కు చెందిన ప్రభుత్వ భూమిని ప్లాట్లుగా అమ్మారని ఆవేదన వ్యక్తం చేశారు. తమను మోసం చేసి అమ్మిన వ్యక్తి నుంచి నష్టపరిహారం ఇప్పించాలంటూ హైడ్రా కమిషనర్‌ను బాధితులు కోరారు. రద్దయిన అనుమతుల విషయాన్ని బయటకు చెప్పకుండా తమను మోసం చేసిప్లాట్లు అమ్మేసారంటూ బాధితులు ఆవేదనకు గురయ్యారు.

దీంతో పూర్తిసర్వే చేయించి భాదితులకు న్యాయం జరిగేలా చూస్తామని హైడ్రా కమిషనర్ రంగనాథ్ భరోసా ఇచ్చారు. అలాగే మీనపూర్ మండలంలోని పెద్దచెరువు అలుగులు మూసేసి ..ఎగువవైపు తమస్థలాల్లోకి చెరువు నీరువచ్చేలా చేశారంటూ మరికొంతమంది హైడ్రా కమిషనర్‌కి కంప్లైట్ చేశారు. పెద్దచెరువు నీటికింద ఉన్న బండికుంట చెరువుకు వెళ్లేలా కాకుండా అటువైపు అలుగులు మూసేయడంతో ఎగువవైపు నీరు పారుతుండటంతో తమ ఇళ్ల స్థలాలు కోల్పోయామంటూ బాధితులు ఫిర్యాదు చేశారు.

హుడా అనుమతి పొందిన లేఔట్‌లో ఉన్న పార్కు స్థలాన్ని పక్కనే వెంచర్ వేస్తున్న వారు కబ్జా చేశారంటూ మీనపూర్ మండలంలోని వెంకటరమణా కాలనీ వాసులు కంప్లైట్ చేశారు. దీంతో పూర్తిసర్వే చేయించి బాధితులకు న్యాయం జరిగేలా చూస్తామని కమిషనర్ రంగనాథ్ అన్నారు.



# డా. బేతవోలుకు 'విద్వన్మణి' పురస్కారం

## ఘనంగా జరిగిన చినజీయర్‌స్వామి తిరునక్షత్ర మహోత్సవం

**శంషాబాద్, నవంబరు 1, ప్రభాతవార్త:** త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ చినజీయర్‌స్వామి తిరునక్షత్ర మహోత్సవం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఉదయం ఎనిమిది గంటలకు దివ్య సాకేత క్షేత్రంలో తీర్థగోష్టి, ఆరాధన జరిగాయి. తర్వాత ప్రధాన వేదిక వద్ద 10 గంటలకు అవార్డు కార్యక్రమం నిర్వహించారు. 31వ జీయర్ పురస్కారం శ్రీమాన్ ఖగేంద్రాచార్య సువేదీ శుక్లయజుర్వేద సలక్షణ ఘనపాటికి లభించింది. అలాగే ప్రముఖ సాహితీవేత్త డా. బేతవోలు రామబ్రహ్మంను 'విద్వన్మణి' పురస్కారంతో ఘనంగా సన్మానించారు. ఆయన రచించిన విష్ణుపురాణ వ్యాఖ్య గ్రంథాన్ని చినజీయర్‌స్వామి ఈ సందర్భంగా ఆవిష్కరించారు. మరికొన్ని ఆధ్యాత్మిక గ్రంథాలను కూడా ఈ సందర్భంగా స్వామి ఆవిష్కరించారు. విష్ణుపురాణ వ్యాఖ్య రచనను చినజీయర్‌స్వామి తనకు అప్పగించడం తన పూర్వజన్మ సుకృతమని రామబ్రహ్మం ఈ సందర్భంగా పేర్కొన్నారు. తిరునక్షత్రం సందర్భంగా 69 కిలోల లడ్డూను జీయర్‌స్వామి స్పర్శించి మంగళాశాసనాలు తెలియజేశారు. ఈ కార్యక్రమానికి అహోబిలం జీయర్‌స్వామి, దేవనాద్ జీయర్‌స్వామి, మై హోమ్స్ గ్రూప్ చైర్మన్ జూపల్లి రామేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# భాగ్యలక్ష్మి మందిరంలో గవర్నర్ విష్ణుదేవ్‌వర్మ పూజలు

## భక్తులకు అమ్మవారి ఖజానా పంపిణీ
### పాతబస్తీలో పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు



చార్మినార్ భాగ్యలక్ష్మి మందిరంలో అమ్మవారికి పూజలు నిర్వహిస్తున్న గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ

**హైదరాబాద్ (చార్మినార్), నవంబరు 1, ప్రభాతవార్త :** దీపావళి సందర్భంగా హైదరాబాద్ పాతబస్తీ చార్మినార్ శ్రీ భాగ్యలక్ష్మి మందిరంలో వేలాది మంది భక్తులు అమ్మవారి దర్శనం కోసం తరలి రావటంతో చార్మినార్ పరిసర ప్రాంతాలు కిక్కిరిసి పోయాయి. అక్టోబరు నెల 29వ తేదీన భాగ్యలక్ష్మి మందిరంలో ప్రారంభమైన దీపావళీ మహోత్సవాలు శుక్రవారంతో ముగిసాయి. దీపావళీ సందర్భంగా చార్మినార్ శ్రీ భాగ్యలక్ష్మి మందిరాన్ని ఎంతో అందంగా అలంకరించారు. జంట నగరాలతోపాటు పలు ప్రాంతాలకు చెందిన వేలాది మంది భక్తులు గురు, శుక్రవారాలు శ్రీ భాగ్యలక్ష్మి అమ్మ వారికి ప్రత్యేక పూజలు జరిపారు. భాగ్యలక్ష్మి మందిరం నుంచిగుల్జారాహౌస్‌లోని జైన్ మందిరం రహదారి వరకు భక్తులు అమ్మ వారి దర్శనం కోసం క్యూలో నిలబడ్డారు. రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ, నగర మేయర్ గద్వాల విజయలక్ష్మి, జాతీయ బిజెపి నాయకులు రాజ్యసభ సభ్యుడు డాక్టర్ కె.లక్ష్మణ్, గోషామహల్ నియోజకవర్గం బిజెపి శాసన సభ్యులు టి.రాజా సింగ్, ఎమ్మెల్సీ మధుసూదనాచారి, మాజీ మేయర్ తీగల కృష్ణారెడ్డి, మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి, మాజీ ఎమ్మెల్సీ రామచంద్రా రావు, సీనియర్ బిజెపి నాయకులు డాక్టర్ భగవంత్‌రావుతో పాటు పలువురు ప్రముఖులు దీపావళీ సందర్భంగా చార్మినార్ శ్రీ భాగ్యలక్ష్మి మందిరంలో అమ్మ వారికి పూజలు జరిపారు.

భక్తులకు అమ్మవారి ఖజానా పంపిణీ చేశారు. మందిరం కమిటి ప్రతినిధులు శశికళ ఆధ్వర్యంలో భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండ అన్ని ఏర్పాట్లు చేశారు. చార్మినార్ శ్రీ భాగ్యలక్ష్మి మందిరంలో నాలుగు రోజులు పాటు జరిగిన దీపావళీ మహోత్సవాలు సందర్భంగా దక్షిణ మండలం పోలీసులు గట్టి బందోబస్తును ఏర్పాటు చేశారు.

# చందానగర్‌లో డ్రగ్స్ పట్టివేత

### పక్కా సమాచారంతో దాడులు జరిపిన పోలీసులు

**హైదరాబాద్ (శేరిలింగంపల్లి), నవంబరు 1, ప్రభాతవార్త:** నగర శివార్లలో డ్రగ్స్ మాఫియా రెచ్చిపోతోంది. ఇతర రాష్ట్రాల నుంచి డ్రగ్స్ తెచ్చి నగరంలో విక్రయిస్తున్న వారిపై పోలీసులు వ్యూహాత్మకంగా వ్యవహరించి చాకచక్యంగా పట్టుకున్నారు. ఫ్రెండ్స్ పార్టీ కోసం వెళ్లిన ఓ వైద్యుడు తన ఇంట్లో స్నేహితులు తెచ్చిన డ్రగ్స్ చూసి షాక్‌కు గురైన సంఘటన సంచలనంగా మారింది. వైద్యుడి స్నేహితుడు కృష్ణరాం అనే వ్యక్తి నగరంలో హార్డ్‌వేర్ షాప్ ఓనర్. దీపావళి పర్వదినం సందర్భంగా కృష్ణరాం పార్టీ ఏర్పాటు చేశాడు. కృష్ణరాం, తన స్నేహితులు, వైద్యుడు సహా మరో నలుగురు పార్టీకి వచ్చారు. గుల్‌మోహార్‌పార్క్ కాలనీలోని ఇంటినంబరు 56లో పార్టీ ఏర్పాటు చేశాడు. కృష్ణరాం ఇంటికి డాక్టర్‌సహా అందరూ చేరుకున్నారు. కృష్ణరాం బాత్‌రూంకి వెళ్లిన సమయంలో డాక్టర్ తన బ్యాగ్‌లో డ్రగ్స్ చూసి షాక్ తిన్నాడు. వెంటనే తెలంగాణ నార్కొటిక్ డ్రగ్స్ బ్యూరో అధికారులకు సమాచారం అందించాడు. ఆరుగురు కలిసి ఎండీఎంఏ డ్రగ్‌తో పార్టీ జరుగు తున్నట్లు సమాచారం రావడంతో నార్కొటిక్ అధికారులు దాడిచేశారు. కృష్ణరాం అదుపులోకి తీసుకుని చందానగర్ పోలీసులకు అప్పగించారు. రాజస్థాన్‌లోని జలోరి జిల్లాకు చెందిన నిందితుడు కృష్ణరాం రాజస్థాన్ నుంచి డ్రగ్ తెచ్చి నగరంలో విక్రయిస్తున్నట్లు పోలీసులు వెల్లడించారు. సంఘటనాస్థలంలో దాదాపు 18లక్షల విలువజేసే 150 గ్రాముల ఎండీయంఏ డ్రగ్స్‌ను సీజ్ చేశారు. కేసు నమోదు చేసుకున్న చందానగర్ పోలీసులు అన్ని కోణాల నుంచికేసును దర్యాప్తు చేస్తున్నారు. మరో ఐదుగురి కోసం పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు.

# 100శాతం కచ్చితత్వంతో సమగ్ర సర్వేను పక్కాగా చేపట్టాలి

## పురపాలక శాఖ ముఖ్యకార్యదర్శి దానకిషోర్



**హైదరాబాద్, నవంబరు 1, ప్రభాతవార్త:** సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల సర్వే వందశాతం ఖచ్చితత్వంతో చేపట్టాలని పురపాలక శాఖ ముఖ్యకార్యదర్శి దానకిషోర్ సూచించారు. ఖైరతాబాద్ జోన్‌లో చేపట్టనున్న సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేపై శుక్రవారం సూపర్‌వైజర్లు, ఎన్యుమరేటర్లకు బంజారాహిల్స్‌లోని గౌరిశంకర్ కమ్యునిటీ హాల్‌లో శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ శిక్షణా కార్యక్రమానికి పురపాలక శాఖ ముఖ్యకార్యదర్శి ముఖ్యఅతిథిగా హాజరు అయ్యారు. ఈ సందర్భంగా దానకిషోర్ మాట్లాడుతూ నవంబరు 6వ తేది నుంచి ప్రారంభమయ్యే సర్వేలో వివిధ వర్గాల ప్రజల సామాజిక, ఆర్థిక పరిస్థితులను ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా జాగ్రత్తగా నమోదు చేయాన్నారు.

గ్రేటర్ పరిధిలో సర్వేను చేపట్టేందుకు 21వేల మంది ఎన్యుమరేటర్లను వినియోగించుకుంటున్నామని అన్నారు. ఆర్పీలను కూడా సర్వేలో భాగం చేశామన్నారు. సర్వేలో పకడ్బందీగా చేపట్టేందుకు 10మంది ఎన్యు మరేటర్లకు ఒక సూపర్‌వైజర్‌ను నియ మించాలన్నారు. ఏమైనా సందేహాలు ఉంటే సూపర్‌వైజర్‌లను సంప్రదించి నివృత్తి చేసుకోవాలని సూచించారు. సమగ్ర సర్వే ద్వారా ప్రభుత్వ పథకాలు చిట్టచివరి పేదవారికి చేరేందుకు దోహదపడతాయని పేర్కొన్నారు. సర్వే వివరాలు నిక్కచ్చిగా నమోదు చేసేందుకు వీలుగా క్షేత్రస్థాయిలో సర్వేచేపట్టే ముందు ప్రతి ఎన్యుమరేటర్ జిరాక్సు పత్రాలతో ప్రాక్టీసు చేసేలా చూడాలన్నారు.

అప్పుడే వారికి పూర్తి అవగాహన వస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్ శివకుమార్‌నాయుడు, జోనల్ కమిషనర్ అనురాగ్ జయంతిలు పాల్గొన్నారు.





# దీపావళి వేడుకల్లో అపశ్రుతి

## సరోజినిదేవి కంటి ఆస్పత్రికి 50మందికిపైగా బాధితులు
### వారిలో 35 మంది చిన్నారులు

**హైదరాబాద్, నవంబరు 1,ప్రభాతవార్త:** రాష్ట్రవ్యాప్తంగా దీపావళి సంబురాలు అంబరాన్నంటాయి. యువతీయువకులతోపాటు చిన్నపిల్లలు పటాకులు కాల్చుతూ ఆనందంగా గడిపారు అయితే బాంబులు కాల్చే సమయంలో తగిన జాగ్రత్తలు తీసుకోకపోవడంతో ప్రమాదాలు చోటు చేసుకున్నాయి. పలుచోట్ల కంటికి గాయాలైన ఘటనలు కూడా ఉన్నాయి. దీంతో బాధితులు హైదరాబాద్ మెహిదీపట్నంలోని సరోజినీదేవి కంటి దవాఖాన వద్ద బారులు తీరారు.

ఇప్పటివరకు 50మంది గాయాలతో ఆసుపత్రికి వచ్చారు. వారంలో 34మందికి స్వల్పంగా గాయాలవగా ,మరో 9మందికి సీరియస్‌గా ఉందని వారిని అబ్జర్వేషన్‌లో పెట్టామన్నారు. గురువారం సాయంత్రం నుంచి శుక్రవారం సాయంత్రం వరకు 50మంది చికిత్స కోసం రాగా అందులో 35మంది చిన్నారులు ఉన్నట్లు డాక్టర్ సౌమ్య తెలిపారు. గతేడాదితో పోలిస్తే ఈసారి క్షతగాత్రుల సంఖ్య తగ్గిందన్నారు.

# కులగణనపై పెద్దఎత్తున ప్రచారం నిర్వహించాలి

## టిపిసిసి అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్

**హైదరాబాద్, నవంబరు 1, ప్రభాతవార్త:** దేశంలోనే అత్యంత ప్రతిష్టాత్మకంగా మన ప్రభుత్వం కులగణన చేపట్టిందని టిపిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్‌గౌడ్ అన్నారు. బుధవారం గాంధీభవన్‌లో టిపిసిసి అధ్యక్షులు మహేష్‌కుమార్‌గౌడ్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో కులగణనపై సిఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్కలు పార్టీ శ్రేణులకు కులగణనపై దిశానిర్దేశనం చేశారు.

నవంబరు 6వ తేది నుంచి గ్రామాలలో కులగణన కార్యక్రమం ప్రారంభం కానుందదన్నారు. ఏఐసిసి అగ్రనేత రాహుల్ గాంధీ ఆలోచన, ఏఐసిసి అధ్యక్షులు మల్లికార్జునఖర్గే ఆదేశాల మేరకు కులగణనపై కాంగ్రెస్ పార్టీ పెద్దఎత్తుననప్రచారం నిర్వహించాల్సి ఉందన్నారు. పార్టీ తరుపున కులగణన సమాచారం పంపడం జరుగుతుందన్నారు.

నవంబరు 2వ తేదిన జిల్లా కాంగ్రెస్ నేతల సమావేశం ఏర్పాటుచ ఏసి పార్టీ పరంగా ఈ సమాచారాన్ని ప్రజల్లోకి తీసుకుని వెళ్లాలన్నారు. ఈ సమావేశంలో మంత్రులు, ఎంపిలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, పోటీ చేసిన అభ్యర్థులు సీనియర్ నేతలు ప్రజల్లోకి తీసుకుని వెళ్లాలని, ఈ అంశాన్ని అత్యంత ప్రాధాన్యతగా భావించి పెద్దఎత్తున విజయవంతం చేయాలన్నారు.



ప్రజావాణిలో దరఖాస్తులు స్వీకరిస్తున్న రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ ఛైర్మన్ డా.జి.చిన్నారెడ్డి.

# ప్రజావాణికి అందిన దరఖాస్తులు 384

**హైదరాబాద్ (బేగంపేట), నవంబరు 1, ప్రభాతవార్త:** మహాత్మా జ్యోతిబా పూలే ప్రజాభవన్‌లో శుక్రవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో మొత్తం 384 దరఖాస్తులు అందాయి. వీటిలో మైనార్టీ వెల్ఫేర్ శాఖకు సంబంధించి 255, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖకు సంబంధించి 60, విద్యుత్‌శాఖకు సంబంధించి 24, రెవెన్యూ పరమైన సమస్యలకు సంబంధించి 15, ఇతర శాఖలకు సంబంధించి 31 దరఖాస్తులు అందినట్లు అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్‌ఛైర్మన్ డా.జి.చిన్నారెడ్డి, ప్రజాపాలన ప్రత్యేక అధికారి దివ్య పాల్గొని ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించడంతో పాటు వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు.

# రేవంత్‌రెడ్డి నాయకత్వానికి ధోకా లేదు

### ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్

**హైదరాబాద్, నవంబరు 1, ప్రభాతవార్త:** ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వానికి ఎలాంటి ధోకాలేదని ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ అన్నారు. కాంగ్రెస్ పార్టీ మొత్తం తన చేతిలో ఉన్నట్లు బిజెఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి మాట్లాడుతున్నారన్నారు. ముఖ్యమంత్రిని మారుస్తారని, రాహుల్ గాంధీ అపాయింట్‌మెంట్ తిరస్కరించినట్లు మాట్లాడుతున్న ఆయనను చూస్తే జాలి వేస్తుందన్నారు. మీడియాలో పాపులారిటీ పెరగడం కోసమే మాట్లాడుతున్నారన్నారు. ఆకాశంపైన ఉమ్మేసినట్లు తీరు ఉందన్నారు. కేవలం తొమ్మిది నెలల పాలనలో కుంభకోణాలు జరిగినట్లు మహేశ్వర్‌రెడ్డి మాట్లాడుతున్నారన్నారు. ఆరోపణలు కాదు, దమ్ముంటే కేంద్ర విచారణ సంస్థలతో దర్యాప్తు జరిపించాలని డిమాండ్ చేశారు. రేవంత్‌రెడ్డి నాయకత్వానికి ఎలాంటి ధోకాలేదని, మంత్రులు, ఎమ్మెల్యేలు అంతా సిఎం రేవంతరెడ్డి వెంట ఉన్నానన్నారు. ప్రభుత్వాలను కూల్చేబుద్ధి బిజెపిది అన్నారు.

# హాస్టల్ విద్యార్థుల మెస్‌ఛార్జీల పెంపు హర్షణీయం

## ఇకకైనా నాణ్యమైన భోజనం అందించాలి
### బిసి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య



సమావేశంలో మాట్లాడతున్న ఆర్.కృష్ణయ్య, గుజ్జ కృష్ణ, నీల వెంకటేష్ తదితరులు

**హైదరాబాద్, నవంబరు 1, ప్రభాతవార్త:** రాష్ట్రంలో హాస్టళ్లు, గురుకుల పాఠశాల విద్యార్థుల మెస్‌ఛార్జీలు పెంచడం హర్షణీయమని అందుకు సిఎం రేవంత్‌రెడ్డి, ఉపముఖ్యమంత్రి భట్టి విక్ర మార్కకు కృతజ్ఞలు తెలుపుతున్నామని బిసి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు మాజీ ఎంపి ఆర్.కృష్ణయ్య అన్నారు. ఈమేరకు శుక్రవారం విద్యానగర్‌లోని బిసి భవన్‌లో జాతీయ కన్వీనర్ గుజ్జకృష్ణ ఆధ్వర్యంలో జరిగిన సమావేశానికి కృష్ణయ్య ముఖ్యఅతిధిగా హాజరై మాట్లాడారు. మెస్‌ఛార్జీలు పెంచడం వల్ల రాష్ట్రంలోని 8లక్షల 50వేలమంది విద్యార్థులకు ప్రయోజనం చేకూరుతుందన్నారు. కాలేజీ హాస్టళ్లకు 1500నుంచి 2100, గురుకుల హాస్టళ్లలో 3వతరగతి నుంచి 7వతరగతి వరకు 950 నుంచి 1330, 8వ తరగతి నుంచి 10వ తరగతి వరకు 1100నుంచి 1540కి పెంచడంతోపాటు కాస్మోటిక్ ఛార్జీలు పెంచారన్నారు.

అయితే పెంచిన ధరల ప్రకారం విద్యార్థులకు మంచి పౌష్టిక ఆహారం అందించాలన్నారు. అలాగే రాష్ట్రంలోని 295 బిసి కాలేజీ హాస్టళ్లు, 321 బిసి గురుకుల పాఠశాలలకు సొంత భవనాలు నిర్మించాలని, కాలేజీ విద్యార్థులకు నెలకు 500 చొప్పున పాకెట్ మనీ ఇవ్వాలని కృష్ణయ్య డిమాండ్ చేశారు. డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు గొరిగె మల్లేష్‌యాదవ్, సుధాకర్, నీల వెంకటేష్, నందగోపాల్, అనంతయ్య, ఉదయ్‌నేత, రవియాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# బాలికపై అయిదుగురు మైనర్ల అత్యాచారం

**దోమ, నవంబరు 1, ప్రభాతవార్త:** మైనర్ బాలికపై అయిదుగురు మైనర్ విద్యార్థులు అత్యాచారానికి పాల్పడిన సంఘటన వికారాబాద్ జిల్లా దోమ పోలీస్‌స్టేషన్‌లో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. బాలిక (13) 8 వతరగతి చదువుతోంది. అయిదుగురు మైనర్ విద్యార్థులు బాలికకు మాయ మాటలు చెప్పి అత్యాచారానికి ఒడిగట్టారు. జరిగిన సంఘటనను ఎవరికి చెప్పలేక బాదిత బాలిక, ఆమె తల్లిదండ్రులు మిన్నకుండి ఉండిపోయారు. చివరకు న్యాయం కోసం దోమ పోలీసులను ఆశ్రయించారు. బాధిత బాలిక తల్లిదండ్రుల ద్వారా ఫిర్యాదు స్వీకరించిన పోలీసులు రంగంలోకి దిగి అత్యాచారానికి ఒడిగట్టిన అయిదుగురు విద్యార్థులను అదుపులోకి తీసుకున్నారు. జరిగిన సంఘటనపై పూర్తివివరాలు సేకరించి అయిదుగురు విద్యార్థులపై కేసు నమోదుచేసి రిమాండ్‌కు తరలించారు. వైద్యపరీక్షల నిమిత్తం బాధిత బాలికను ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వైద్యపరీక్షల అనంతరం పూర్తి వివరాలు తెలుస్తాయని దోమ ఎస్ఐ ఆనంద్ తెలిపారు.

# బూటకపు హామీలు, అమలుకాని వాగ్దానాలు

## కాంగ్రెస్‌పై వరుస ట్వీట్లతో విరుచుకుపడిన మోడీ



**న్యూఢిల్లీ, నవంబరు 1:** మహారాష్ట్ర, జార్ఖండ్ అసెంబ్లీ ఎన్నికల సమయంలో ప్రధానిమోడీ కాంగ్రెస్‌పై వరుస ట్వీట్లతో విరుచుకుపడుతున్నారు. ఆర్థికంగా చేయగలిగే హామీలు మాత్రమే ఇవ్వాలని తమ పార్టీశాఖలకు కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లిఖార్జున్‌ఖర్గేసూచించిననేపథ్యంలో ప్రధాని తనదైన శైలిలో విమర్శించారు. భూటకపు వాగ్దానాలుచేయడం సులువే. కానీ వాటిని అమలుచేయడం కష్టం లేదా అసాధ్యమని ఇపుడిపుడే కాంగ్రెస్ పార్టీ గ్రహిస్తోందని ఎక్స్‌లో వరుస పోస్టులుపెట్టారు. ఆచరణకు సాధ్యంకాని హామీలని తెలిసినా ప్రచారంలో ఊదరగొట్టారని ఇపుడేమో ప్రజలముందు ఘోరంగా నిలబడ్డారని పేర్కొంటూ బోగస్ కాంగ్రే వాగ్దానాలు అంటూ హ్యాష్‌ట్యాగ్‌ను జతచేసారు. కాంగ్రెస్ అధికారంలో ఉన్న ఏరాష్ట్రంచూసినా హిమాచల్, కర్ణాటక, తెలంగాణల్లో అభివృద్ధిలేదని, ఆర్థికపరిస్థితి దిగజారిందనిప్రధాని గుర్తుచేసారు. ప్రజలకు ఇచ్చిన హామీలను అమలుచేయకపోవడమంటే వారిని మోసగించడమేనని అన్నారు. ఇలాంటి రాజకీయాలతోపేదలు, యువత, రైతులు, మహిళలకిచ్చిన వాగ్దానాలను నిరాకరించడమేకాదుప్రస్తుతం అమలవుతున్న పథకాలనుసైతం నీరుగార్చేలా వ్యవహరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తంచేసారు. కాంగ్రెస్ భూటకపు హామీల సంస్కృతిపై దేశప్రజలు అప్రమత్తంగా ఉండాలని పిలుపునిచ్చారు. హరియానా ప్రజలు కాంగ్రెస్ నేతల హామీలను ఎలాతిరస్కరించారో మనం చూసామని అన్నారు. అక్కడిప్రజలు కేవలం సుస్థిరత అభివృద్ధికే ఓటువేసారని దేశప్రజలు అభివృద్ధి ప్రగతిని కోరుకుంటున్నారన్నారు. కర్ణాటకలో కాంగ్రెస్ పార్టీ అంతర్గత రాజకీయాలు దోపిడీలో బిజీగా ఉందని ప్రధాని ఎద్దేవాచేసారు. ఇప్పటికే అక్కడ పథకాలను ఉపసంహరిస్తున్నారని ఆరోపించారు. హిమాచల్‌లో ప్రభుత్వ ఉద్యోగులకు సకాలంలో జీతాలు చెల్లించడంలేదని తెలంగాణలో కాంగ్రెస్ ఇచ్చిన రుణమాఫీ హామీ అమలుకోసం రైతులు ఎదురుచూస్తున్నారన్నారు. గతంలో ఛత్తీస్‌గఢ్ రాజస్థాన్‌లలో కొన్ని భత్యాలు ఇసానతమని ప్రకటించి ఐదేళ్లపాటు కూడా అమలుచేయలేదని గుర్తుచేసారు. అయితే మోడీ ట్వీట్ విమర్శలను కాంగ్రెస్ కొట్టిపారేస్తోంది. ప్రధాని ట్వీట్లపై ప్రధాన కార్యదర్శి కెసివేణుగోపాల్ స్పందించారు. కర్ణాటకలోప్రతిదీ బాగా అమలుచేస్తున్నామని, ఎవరైనా చెక్‌చేసుకోవచ్చని, మేం ఇచ్చిన హామీలను అమలుచేస్తున్నామని, కాంగ్రెస్‌మోడల్‌లోభాగంగా ఏయే హామీలు ఇచ్చామో అన్నీ అమలవుతున్నాయని పేర్కొన్నారు. ప్రధాని చెప్పేవన్నీ అబద్దాలేనని వాస్తవానికి కేంద్రప్రభుత్వమే ఇచ్చిన హామీలను అమలుచేయడంలేదని పైగామేం ఇవ్వడంలేదని నిందిస్తున్నారన్నారు.

## నేటి నుంచి ఆస్ట్రేలియాలో పర్యటించనున్న స్పీకర్, మండలి చైర్మన్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, నవంబరు 1:** ఈనెల 2 నుంచి అధికారిక విదేశీ పర్యటనకు రాష్ట్ర శాసనసభ, శాసనమండలి బృందం వెళ్తుంది. ఆస్ట్రేలియాలోని సిడ్నీలో జరిగే 67వ కామన్వెల్త్ పార్లమెంటన కాన్ఫరెన్స్‌లో పాల్గొననుంది. శనివారం రాత్రి శంషాబాద్ విమానాశ్రయం నుంచి సిడ్నీకి బృందం వెళ్లనుంది. కాన్ఫరెన్స్ అనంతరం స్టడీ టూర్‌లో భాగంగా న్యూజీలాండ్, జపాన్, దక్షిణకొరియా దేశాలలో పర్యటిస్తారు. అనంతరం ఈనెల 16న ముగించుకుని హైదరాబాద్‌కు తిరిగి వస్తారు. బృందంలో అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాష్ ముదిరాజ్, అసెంబ్లీ కార్యదర్శి డాక్టర్ వి.నరసింహాచార్యులు ఉన్నారు.



## హాస్టల్ విద్యార్థులకు డైట్, కాస్మోటిక్ చార్జీలు పెంపుపై మంత్రులు, ఎంపిలు హార్షం

### సిఎం రేవంత్‌ను కలిసి ధన్యవాదాలు తెలిపిన మంత్రి సీతక్క, ఎంపిలు మల్లు రవి, చామల

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, నవంబరు 1:** ప్రభుత్వ వసతి గృహాల విద్యార్థులకు డైట్, కాస్మోటిక్ చార్జీలను పెంచిన నేపథ్యంలో మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు సిఎం రేవంత్‌రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. శుక్రవరం జూబ్లీహిల్స్ నివాసంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని మంత్రి సీతక్క, ఎంపీలు మల్లు రవి, చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యేలు వంశీ కృష్ణ, సంజయ్ ఇతర నేతలు కలిశారు. గతంలో ఎన్నడూలేని విధంగా డైట్, కాస్మోటిక్ చార్జీలు 40శాతం పెంచడంపై కాంగ్రెస్ నేతలు హార్షం వ్యక్తం చేశారు.

## 25 నుండి ఉచిత పశువైద్య శిబిరాలు

### పశు సంవర్ధక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సవ్యసాచి ఘోష్

**హైదరాబాద్, నవంబరు 1, ప్రభాతవార్త:** రాష్ట్రీయ గోకుల్ మిషన్ సహకారంతో రాష్ట్ర వ్యాప్తంగా ఈ నెల 25 నుండి 28 వరకూ ఉచిత పశు వైద్య శిబిరాలను నిర్వహిస్తున్నట్లు ఆ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సవ్యసాచి ఘోష్ వెల్లడించారు. సచివాలయంలో శుక్రవారం దీనికి సంబంధించిన బ్రోచర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తెలంగాణలోని అన్ని గ్రామల్లో 2,210 ఉచిత పశు వైద్య గర్భకోశ శిబిరాలను నిర్వహిస్తున్నామన్నారు. రాష్ట్రంలో పాడి రైతులు పాల ఉత్పత్తిలో గణనీయమైన ప్రగతిని సాధించారని చెప్పారు. పాడి రైతులకు ప్రభుత్వం అన్ని విధాలుగాను సహాయ, సహకారాలను అందిస్తుందన్నారు. ప్రస్తుత అంచనా బడ్జెట్‌లో పశు సంవర్ధక శాఖకు 1,980 కోట్ల రూపాయలను సీఎం రేవంతరెడ్డి కేటాయించారని వివరించారు. ఈ వైద్య శిబిరాల్లో దీర్ఘకాలికంగా ఎదకు రాకుండా గర్భం దాల్చని పశువులను గుర్తించి, వాటికి తగు చికిత్స చేయడం జరుగుతుందన్నారు.

## ఇజ్రాయెల్ విధ్వంసానికి సౌదీ షాక్

### పాలస్తీనా రాజ్యస్థాపనకు సౌదీ చొరవ



**దుబాయి, నవంబరు 1:** హమాస్, హెజ్‌బొల్లా ఉగ్రవాదసంస్థల నిర్మూ లనే లక్ష్యంగా ఇజ్రాయిల్ దాడులు కొనసాగు తున్నవేళ సౌదీ అరేబియా షాకిచ్చింది. గాజా లెబనాన్‌లతో ఇజ్రాయెల్ వివాదాన్ని పరిష్కరించేందుకు సౌదీ అరేబియా అరబ్ ఇస్లామిక్ శిఖరాగ్ర సమావేశం నిర్వహించనున్నట్లు ప్రకటించింది. ఈనెల 11వ తేదీ జరిగే ఈ సదస్సు పాలస్థీనా రాజ్య స్థాపనపైనే దృష్టి పెడుతోంది. రియా ద్‌లో రెండురోజుల పాటు చర్చలు జరుగుతాయి. 2023లోజరిగినఅ రబ్ ఇస్లామిక్ విశేష సదస్సుకు కొనసాగింపుగా నిర్వహిస్తున్నారు. సౌదీ అరేబియా రాజు సల్మాన్, ప్రిన్స్ మహ్మద్ బిన్ సల్మాన్ ఆల్‌సౌద్ ఆధ్వర్యంలో ఈసదస్సు జరుగుతోంది. పాలస్తీనాకు రాజ్యాధికారం కల్పించాలంటే ఇజ్రాయెల్‌పై ఎలా ఒత్తిడి తీసుకురావాలన్న అంశంపై ఇస్లామిక్ దేశాలు చర్చిస్తాయి. ఇజ్రాయెల్ ఇరాన్‌లమధ్య పెరుగుతున్న ఉద్రిక్తతలు, మధ్యప్రాచ్యంలోనెలకొన్న అస్థిరత, యుద్ధాన్ని ముగింపునకు తీసుకోవాల్సి న చర్యలు వంటిప్రధాన సమస్యలపైఈ దేశాలు చర్చింస్తాయి. ఇజ్రాయెల్ దాడులను సౌదీ అరేబియా ఖండిస్తున్న అంశం తెలిసిందే. అలాగే లెబనాన్ సమగ్రతను దెబ్బతీసే చర్యలను తీవ్రంగా వ్యతిరేకిస్తోంది.

## గవర్నర్ ప్రతిభా పురస్కారాలు

### నేటి నుంచి దరఖాస్తుల స్వీకరణ

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, నవంబరు 1:** గణతంత్ర దినోత్సవం సందర్భంగా నాలుగు రంగాలకు చెందిన వారికి ఏటా పురస్కారాలు ఇవ్వాలని తెలంగాణ గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ నిర్ణయించారు. పర్యావరణ, పరిరక్షణ, దివ్యాంగుల సంక్షేమం, క్రీడలు, సాంస్కృతిక విభాగాల్లో గత ఐదేళ్లుగా ఉత్తమ సేవలు అందిస్తున్న వారికి గవర్నర్ ప్రతిభా పురస్కారాలు ఇవ్వనున్నట్లు గవర్నర్ ముఖ్యకార్యదర్శి బుర్రా వెంకటేశం తెలిపారు. సంస్థలు, వ్యక్తులకు వేర్వేరు కేటగిరీల్లో అవార్డులు ఉంటాయన్నారు. శనివారం నుంచి ఈనెల 23వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు ఆన్‌లైన్‌లో ద్వారా రాజ్ భవన్ చిరునామాకు ఆఫ్‌లైన్‌లో దరఖాస్తులు సమర్పించాలని బుర్రా వెంకటేశం తెలిపారు. అవార్డు కింద రూ.2లక్షలు జ్ఞాపిక ఇవ్వనున్నట్లు చెప్పారు. విశ్రాంత ఐఏఎస్ అధికారి పద్మనాభయ్య నేతృత్వంలోని న్యాయ నిర్ణేతల కమిటీ ఈ దరఖాస్తులను పరిశీలించి అవార్డులకు ఎంపిక చేస్తుందని తెలిపారు.

## సహకార బ్యాంకులు, మార్కెటింగ్ సొసైటీల అక్రమాలపై చర్యలు

### ప్రతి జిల్లాలో ఒక మోడల్ మార్కెట్

### వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు



**హైదరాబాద్, నవంబరు 1, ప్రభాతవార్త:** జిల్లా సహకార కేంద్ర బ్యాంకులు (డిసిసిబి), జిల్లా సహకార మార్కెటింగ్ సొసైటీ (డిసిఎంఎస్)ల్లో జరిగిన అవకతవకలపై చర్యలు తప్పవని వ్యవసాయ, సహకార శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరావు హెచ్చరించారు. అక్రమాలు జరిగిన అన్నింటిపై శాఖాపరమైన విచారణను త్వరిగతగతిన పూర్తి చేసి, బాధ్యులపై కఠిన చర్యలు, సర్ ఛార్జీలు వసూలు చేయాలని ఆదేశించారు. సచివాలయంలో శుక్రవారం జరిగిన సమావేశంలో మాట్లాడుతూ ప్రాథమిక వ్యవసయ సహకార సంఘాల్లో రైతులకు మరింత సులభతరం, సమర్ధవంతమైన సేవలు అందేలా రీ ఆర్గనైజేషన్ చేసి కొత్త శాఖల ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. అలాగే అవసరాలను దృష్టిలో ఉంచుకుని ప్రయోగాత్మకంగా ప్రతి జిల్లాకు ఒక మోడల్ మార్కెట్‌కు ప్రతిపాదనలు రూపొందించాలని చెప్పారు. కాగా రాష్ట్రంలో పత్తి కొనుగోళ్ల విషంలో అవకతవకలు జరిగితే సహించేది లేదని సంబంధించి రైతులను ఇబ్బందులకు గురిచేయవద్దని స్పష్టం చేశారు. పత్తి కొనుగోళ్లపై వ్యవసాయ మార్కెట్ యార్డులు, జిన్నింగ్ మిల్లుకు రైతులు తీసుకొస్తున్న పత్తిని వెంటనే కొనుగోలు చేసేలా ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. అదేవిధంగా పత్తి కొనుగోళ్ల విషయంలో రైతులు వాట్సాప్ సేవలను వినియోగించుకోవలన్నారు. పత్తి రైతుల సౌకర్యార్థం వాట్సాప్ నెంబరు 8897281111 ద్వారా వెయిటింగ్ సమయం, అమ్మకానికి సంబంధించిన సొమ్ము పరిస్థితి, కంప్లయింట్ ఫోరం, ఇతర సేవలను అందుబాటులోకి తేవడం జరిగిందని, దీన్ని రైతులు ఉపయోగించడంతో పత్తి విక్రయించడం సులభతరం అవుతుందని చెప్పారు. పత్తి కొనుగోళ్లలో జిల్లా అధికారులు, సెక్రటరీలు రైతులకు అందుబాటులో ఉండాలని తెలిపారు. ఇదే సమయంలో రాష్ట్రంలో అకాల వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున వ్యవసాయ, మార్కెటింగ్ అధికారులు అప్రమత్తంగా ఉండి రైతులకు అందుబాటులో ఉండాలని పేర్కొన్నారు. రైతులు తీసుకొచ్చిన వ్యవసాయ పంటల ఉత్పత్తులు తడిసిపోకుండా అవసరమైన చర్యలు తక్షణం తీసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో మార్కెటింగ్ శాఖ డైరక్టరు ఉదయ్‌కుమార్, సహకార శాఖ రిజిస్ట్రార్ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

## అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో 6 కోట్ల మంది ముందస్తు ఓటింగ్ !

**వాషింగ్టన్, నవంబరు 1:** అమెరికాలో మరికొన్ని రోజుల్లో అధ్యక్ష ఎన్నికలు జరగనున్నాయి. ఇందుకోసం ఏర్పాటుచేసిన ముందస్తు ఓటింగ్‌ను ఉపయోగించుకుని ఇప్పటికే దాదాపు 6.1 కోట్ల మంది ప్రజలు తమ ఓటు హక్కును వినియోగించుకున్నట్లు తెలుస్తోంది. ఈ మేరకు అక్కడి మీడియా కథనాలు వెల్లడిస్తున్నాయి. ఈ ఎన్నికల్లో డెమొక్రటిక్ పార్టీ అభ్యర్థిగా కమలాహారిస్, రిపబ్లికన్ అభ్యర్థిగా డొనాల్డ్ ట్రంప్‌లు బరిలో ఉన్న విషయం తెలిసిందే. ఈ ముందస్తు ఓటింగ్ ప్రక్రియలో అనేకమంది పోలింగ్ కేంద్రాలకు వెళ్లగా మరికొంతమంది మెయిల్ బ్యాలెట్ ద్వారా ఓటేసినట్లు తెలుస్తోంది. అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ కూడా ఇటీవల తన ఓటు హక్కును వినియోగించుకున్న సంగతి తెలిసిందే. డెలావేర్‌లోని విల్మింగ్టన్‌లో తన ఇంటి సమీపంలోని పోలింగ్ కేంద్రంలో దాదాపు 40 నిమిషాలపాటు క్యూలో నిలుచుని మరీ ఆయన ఓటు వేశారు. అగ్రరాజ్యంలో నవంబరు 5న అధ్యక్ష ఎన్నికలు జరగనున్నాయి. ఈ నేపథ్యంలో ఇప్పటివరకు నిర్వహించిన పలు సర్వేల్లో రిపబ్లికన్ పార్టీ అభ్యర్థి డొనాల్డ్ ట్రంప్ కంటే డెమొక్రటిక్ అభ్యర్థి కమలాహారిస్ కాస్త ముందంజలో ఉన్నట్లు తెలుస్తోంది.

మరోవైపు జార్జియా, నార్త్ కరోలినా ప్రాంతాల్లో హారిస్, ట్రంప్‌ల మధ్య గట్టి పోటీ ఉన్నట్లు తాజాసర్వేలు వెల్లడిస్తున్నాయి. జార్జియాలో ట్రంప్‌కు 48 శాతం, హారిస్‌కు 47 శాతం మద్దతుగా ఉన్నారు. ఇక, నార్త్ కరోలినాలో హారిస్‌కు 48 శాతం, ట్రంప్‌కు 47 శాతం మద్దతుగా ఉన్నట్లు సర్వేలో వెల్లడయింది. 2008లో ఎన్నికల్లో డెమొక్రటిక్ నుంచి అధ్యక్ష రేసులో ఉన్న ఒబామాకు నార్త్ కరోలినా మద్దతిచ్చింది. అయితే తరువాత ఎన్నికల నుంచి రిపబ్లికన్ అభ్యర్థులకు మద్దతుగా నిలవడం గమనార్హం. జార్జియాలోనూ గత ఎన్నికల్లో అభ్యర్థుల మధ్య గట్టిపోటీ నడిచింది. చివరకు 1 శాతం మెజారిటీతో 2020 ఎన్నికల్లో బైడెన్ అక్కడ గట్టెక్కారు.

## కంచె మేసిన చేను!

>> లకు సంబంధించిన 63 బంగారం నగల ప్యాకెట్‌లు కనిపించ లేదు. వీటి మొత్తం బరువు సుమారు 2944.226 గ్రాములు ఉంటుందని, సుమారు వాటి విలువ 2,10,80,290 రూపాయలు ఉంటుందని బ్యాంకు వారు అంచనా వేశారు. వికారాబాద్ బ్రాంచ్ మేనేజర్ విశాల్ మణప్పురం కంపెనీకి నమ్మకద్రోహం చేసి, మోసపూరితంగా బంగారు నగలతో ఉడాయించారని నిర్ధారణకు వచ్చి వికారాబాద్ పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. వికారాబాద్ డిఎస్పీ శ్రీనివాస్‌రెడ్డి, సిసిఎస్ ఇన్‌స్పెక్టర్ బలవంతయ్య ఆధ్వర్యంలో బృందాలను ఏర్పాటు చేసి దర్యాప్తు చేయడంతో నింధితుడు విశాల్‌ను పట్టుకోగలిగామని ఎస్పీ తెలిపారు. పోలీసుల విచారణలో ఆశ్చర్యపోయే విషయం బయటపడింది. ఖాతాదారులకు సంబంధించి ఎలాంటి బంగారు ఆభరణాలు లేవని, కేవలం నింధితుడైన బ్యాంకు మేనేజర్ విశాల్ ఫేక్ డాక్యుమెంట్లతో బంగారు ఆభరణాలపై రుణాలు తీసుకున్నట్లు చూపి డబ్బులు స్వాహా చేశారని తెలిసిందని ఎస్పీ తెలిపారు. నింధితుడు విశాల్ కర్ణాటక రాష్ట్రం, ఔరద్ తాలూకా లోని నారాయణపూర్ గ్రామం. విశాల్ జులై 2023 నుండి వికారాబాద్ మణప్పురం బ్రాంచ్ నందు మేనేజర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. విశాల్ బ్యాంకు మేనేజర్‌గా అందరి మన్ననలు పొందాడు. లోలోపల మాత్రం కంపెనీ డబ్బును స్వాహా చేశాడు. ఫేక్ ఖాతాదారుల ఐడీ ప్రూఫ్‌లతో బంగారు ఆభరణాలు తాకట్టు పెట్టినట్లు చేసి, బ్యాంకు డబ్బులు స్వాహా చేసి క్రికెట్ బెట్టింగ్, ఇతర జల్సాలకు వినియెగించేవాడు. మణప్పురం గోల్డ్ లోన్ కంపెనీ నిబంధనల ప్రకారం గోల్డ్ లోన్ తీసుకోవాలంటే ఆధార్ కార్డ్, పాన్ కార్డ్, మొబైల్ నెంబర్, బంగారం తీసుకొని బ్రాంచ్‌కి వెళ్లాలి. ఆన్ లైన్‌లో కస్టమర్ వివరాలు నమోదు చేసి, కస్టమర్ ఐడీ క్రియేట్ చేశాక బంగారం నాణ్యతాను పరిశీలించి ఒక గ్రామ్ ప్లేడ్జ్ విలువ 5,000 రూపాయలు వరకు లోన్ ఇవ్వడం జరుగుతుంది. ఒక సారి ఒక కస్టమర్ ఐడి నమోదు చేసుకున్న తర్వాత, ఆ కస్టమర్ మళ్లీ గోల్డ్ లోన్ తీసుకోవాలంటే బంగారం తప్ప ఎలాంటి డాక్యుమెంట్స్ అవసరం ఉండదు.

ఇదే అవకాశంగా భావించిన బ్యాంకు మేనేజర్ విశాల్, నకిలీ డాక్యుమెంట్లతో ఖాతాదారులకు తెలియకుండానే లోన్ తీసుకుని సొంతానికి కంపెనీ డబ్బులు వినియోగించుకునే వాడు. క్రింది స్థాయి సిబ్బందికి నిజాయితీ పరుడిగా నమ్మించి మొత్తం 20 మంది ఫేక్ కస్టమర్ల పైన 63 నకిలీ ఇన్ వెంటరీ ఐడిలు నమోదు చేసి, మొత్తం రూ.1.24 కోట్లు రూపాయలు బ్యాంకు నుంచి లోన్ రూపేణా కాజేశాడు.

వాటితో పాటు నిజమైన 5 మంది ఖాతాదారులకు సంబంధించి కుదువ పెట్టిన 5 బంగారం ప్యాకెట్లను సైతం దొంగతనంగా తీసుకుని పరారయ్యాడు. నమ్మదగిన సమాచారం మేరకు నింధితుడిని పట్టుకుని, అతని వద్ద నుంచి 5 మంది ఖాతాదారులకు సంబంధించిన 83 గ్రాముల బంగారం, రూ.10 లక్షలు నగదు స్వాధీనం చేసుకున్నట్లు జిల్లా ఎస్పీ నారాయణరెడ్డి తెలిపారు. నింధితుడిపై పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్పీ తెలిపారు. నింధితుడికి సహకరించిన వారిపై, ఆడిట్ నిర్వహించిన వారిపై, విజిలెన్స్ టీమ్, క్రికెట్ బెట్టింగ్ నిర్వాహకులపై దర్యాప్తు కొనసాగుతుందని ఎస్పీ పేర్కొన్నారు. మణపురం బ్యాంకులో గల ఖాతాదారుల యొక్క బంగారు ఎక్కడికి పోలేదని, ఖాతాదారులు ఎలాంటి ఆందోళన చెందనవసరం లేదని ఆయన స్పష్టం చేశారు. ఈ కేసు ఛేదించిన వికారాబాద్ డిఎస్‌పి శ్రీనివాస్ రెడ్డి, సిసిఎస్ ఇన్స్పెక్టర్ బలవంతయ్య, వికారాబాద్ పట్టణ సీఐ భీమ్‌కుమార్, ధారూరు సీఐ రఘురాములు, సిబ్బందిని ఎస్పీ అభినంధించారు.

## ట్రాన్స్‌కోకు సబ్సిడీగా రూ.4,791 కోట్లు మంజూరు

**హైదరాబాద్, నవంబరు 1, ప్రభాతవార్త:** ట్రాన్స్‌మిషన్ కార్పొరేషన్ ఆఫ్ తెలంగాణ లిమిటెడ్ (ట్రాన్స్‌కో)కు రాష్ట్ర ప్రభుత్వం శుభవార్త చెప్పింది. విద్యుత్ సబ్సిడీ కింద శుక్రవారం ప్రభుత్వం నిధులను మంజూరు చేస్తూ నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు దీనికి సంబంధించి 4,791 కోట్ల రూపాయల మేర సబ్సిడీ నిధులను మంజూరుకు ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నెల నుండి 2025 మార్చి నెల వరకూ ఈ సబ్సిడీ నిధులు విడుదల చేస్తున్నట్లు ఆ ఉత్తర్వులు పేర్కొంది. కాగా రాష్ట్రంలో వివిధ వర్గాల వారికి ఉచిత విద్యుత్ అందిస్తున్న నేపథ్యంలో అందుకు గాను రాష్ట్రంలోని విద్యుత్ పంపిణీ సంస్థలకు సబ్సిడీ కింద మొత్తం 11,499 కోట్ల రూపాయలను ప్రభుత్వం చెల్లించనుంది. ఈ మేరకు ప్రస్తుత 2024-25 ఆర్థిక సంవత్సరంలో ఈ సబ్సిడీ మొత్తాన్ని దశల వారీగా ప్రభుత్వం విడుదల చేసేందుకు చర్యలు తీసుకోఓనుంది. దీనికి సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణ విద్యుత్ రెగ్యులేటరీ కమిషన్‌కు ఇటీవలే ప్రతిపాదనలు సమర్పించింది. ఈ మొత్తంలో గృహ జ్యోతి పథకంలో భాగంగా నెలకు 200 యనిట్ల ఉచిత విద్యుత్ నిమిత్తం సబ్సిడీ కింద 1,699.45 కోట్ల రూపాయలు, వ్యవసాయం, ఇతర వర్గాల వారికి ఇచ్చే ఉచిత విద్యుత్‌కు 9,800.07 కోట్ల రూపాయలు భరించనున్నట్లు నివేదికలో పేర్కొంది.



## రష్యాకు మద్దతిస్తున్న సంస్థలపై అమెరికా వేటు

### 15 భారత సంస్థలపై యుఎస్ ఆంక్షలు

**వాషింగ్టన్, నవంబరు 1:** రష్యా మిలిటరీ, పారిశ్రామిక స్థావరాలకు మద్దతు ఇస్తున్నందుకుగాను అమెరికా 275 మంది వ్యక్తులు, సంస్థలపై ఆంక్షలు విధించింది. వాటిలో 15 వరకూ భారత్‌కు చెందినవి ఉన్నాయి. అమెరికా ట్రెజరీ విభాగం విడుదలచేసిన జాబితాను పరిశీలిస్తే భారత్ కేంద్రంగా ఉన్న కంపెనీలు అభార్‌టెక్నాలజీస్ అండ్ సర్వీసెస్, డెన్వాస్ సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్, ఎంసీస్‌టెక్, గెలాక్సీ బేరింగ్స్ లిమిటెడ్, ఆర్బిట్ ఫిన్‌ట్రేడ్ ఎల్లెల్పీ, ఇన్నోవియో వెంచర్స్, కెడిజి ఇంజనీరింగ్, ఖుష్బు హోనింగ్‌ప్రైవేట్ లమిటెడ్ సంస్థలున్నాయి. వీటితోపాటు భారత కంపెనీలు లోకేష్ మెషిన్స్. పాయింటర్ ఎలక్ట్రానిక్స్, ఆరార్జి ఇంజనీరింగ్ టెక్నాలజీస్, షార్ప్‌లైన్ ఆటోమేషన్ ప్రైవేట్ లిమిటెడ్; శౌర్య ఏరోనాటిక్స్, శ్రీజీ ఇంపెక్స్, శ్రేయ లైఫ్ సైన్సెస్ సంస్థలునానయి. ఇక చైనా, స్విట్జర్లాండ్, థాయిలాండ్, తుర్కియేలకు చెందిన కంపెనీలపైనా అమెరికా ఆంక్షలు ప్రకటించింది. రష్యాకు అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం, సామగ్రి సరఫరాచేయడాన్ని అమెరికా తీవ్రంగా వ్యతిరేకించింది. ఈ సరఫరాలన్నీ కూడా రష్యా యుద్ధ సామగ్రికి అనువుగా ఉంటాయని అమెరికా ట్రెజరీ విభాగంవెల్లడించింది. అలాగే దేశీయంగా రష్యా దిగుమతిదారులు, ఉత్పత్తిదారులపైనా దృష్టిపెట్టింది. రష్యా మిలిటరీ, పారిశ్రామిక బేస్‌కు కొనసాగిస్తున్న సరఫరాల పైనే దృష్టిపెట్టింది. అమెరికా మిత్రదేశాలు ఇలాంటి ఆంక్షలకు మద్దతి స్తున్నాయి. రష్యాకు సంక్లిష్టమైన టెక్నాలజీ, ఇతర సాంకేతిక టూల్స్‌ను సరఫరాచేయకుండా బ్రేకులు వేయడమే లక్ష్యంగా ఉంది. ఉక్రెయిన్‌పై అక్రమ యుద్ధం ప్రకటించడాన్ని తాము ఎంతమాత్రం అంగీకరించబోమని అమెరికా ఆర్థికశాఖ డిప్యూటి కార్యదర్శి వాల్లీ అడేయేమో పేర్కొన్నారు.



## బుద్గాంలో ఉగ్ర కాల్పులు

### ఇద్దరు వలస కార్మికులకు తీవ్ర గాయాలు

**న్యూఢిల్లీ, నవంబరు 1:** జమ్ముకాశ్మీర్‌లోని బుద్గాంలో ఉగ్రమూకల దాడిలో ఉత్తరప్రదేశ్‌కు చెందిన ఇద్దరు వలసకార్మికులకు తీవ్ర గాయాలయ్యాయి. వెనువెంటనే సమీపంలోని ఆసుపత్రికి తరలించడంతో వైద్యులు ప్రాణాపాయంలేదని ధృవీకరించారు. వలసకార్మికులపై కాశ్మీర్‌లోయలో ఉగ్రమూకలు చేస్తున్న దాడుల్లో వరుసగా ఇది నాల్గవదని అధికారులు వెల్లడించారు. శుక్రవారం నాటి దాడిలో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. వారు ఉస్మాన్ మాలిక్, సోఫియాన్ అని అధికారులు తెలిపారు. గతనెల 20వ తేదీ అయితే గండేర్‌బాల్‌జిల్లాలో ఒక టన్నెల్ నిర్మాణంలో పనులుచేస్తున్న ఏడుగురు వలస కార్మికులు ఒక వైద్యుడిని ఉగ్రమూకలు కాల్చివేసిన సంగతి తెలిసిందే. ఈసంఘటనలో ఇద్దరు ఉగ్రవాదులున్నారని, ఒకరు స్థానికుడేనని ధృవీకరించారు. దక్షిణ కాశ్మీర్‌లోని కుల్గాంకు చెందినవాడని, 2023లోనే ఉగ్రగ్రూపల్లో చేరి కార్యకలాపాలు సాగిస్తున్నట్లు తెలిపారు. అదేవిధంగా గుల్మార్గ్‌ప్రాంతంలోని బోటా పత్రివద్ద కూడా గత ఆగస్టులో ఉగ్రవాదులు కాల్పులుజరిపారు. అఫ్రావత్ వంటి ఎగువప్రాంతాల్లో నక్కి ఉండి వారు కాల్పులుజరుపుతున్నట్లు తేలింది. ఈ కాల్పుల్లో ఇద్దరు సైనికులు చనిపోయారు. ఇద్దరు కార్మికులు కూడా చనిపోయారు.

## ఆరునెలల గరిష్టానికి జీఎస్టీ వసూళ్లు

### అక్టోబరులో రూ.1.87 లక్షలకోట్ల రాబడి




**న్యూఢిల్లీ, నవంబరు 1:** వస్తుసేవలపన్నుద్వారా అక్టోబరునెలలో రికార్డుస్థాయి ఆదాయవనరులు సమకూరాయి. ఆరునెల గరిష్టస్థాయికి వసూళ్లు పెరిగినట్లు జీఎస్టీ బోర్డుప్రకటించింది అక్టోబరు మాసానికిగాను జీఎస్టీ రాబడులు 1.87 లక్షలకోట్లుగా ఉన్నాయి. వరుసగా ఎనిమిదోనెలలో కూడా 1.7 లక్షలకోట్లను దాటి పన్నువసూళ్లు నమోదుచేసింది. గతనెలతోపోలిస్తే 8.1శాతం పెరిగాయి, వార్షికపద్దతిలోచూస్తే 1.72 లక్షలకోట్లనుంచి 8.9శాతంపెరిగి 1.87 లక్షలకోట్లు నమోదుచేసినట్లు ఆర్థిక శాఖ వెల్లడించింది. ఏప్రిల్‌నుంచి అక్టోబరు నెలవరకూ జీఎస్టీ స్థూల వసూళ్లు 12.74 లక్షలకోట్లుగా ఉన్నాయి. 9.4శాతం పెరిగినట్లు తేలింది. అంతకుముందు ఏడాది చూస్తే ఈ కాలంలో 11.64 లక్షలకోట్లు వసూలు అయ్యాయి. నికరంగా జీఎస్టీ రాబడులు రీఫండ్ల తర్వాతచూస్తే అక్టోబరునెలలో 1.68 లక్షలకోట్లుగా ఉన్నాయి. అంతకుముందు ఏడాది అక్టోబరులో వసూలుచేసిన 1.55 లక్షలకోట్లతోపోలిస్తే 7.9శాతంపెరిగింది. పన్నువసూళ్లలోపెరుగుదలనుచూస్తే ఆర్థికపనితీరు పటిష్టంగా ఉన్నట్లుకనిపిస్తోంది. అయితే సెప్టెంబరులో జీఎస్టీ రాబడుల వృద్ధిమాత్రం 6.5శాతంగానే ఉంది. కొవిడ్ కాలం తర్వాత వచ్చిన వసూళ్లలో ఇదే అత్యల్ప వృద్ధిగా జీఎస్టీ అధికారులు చెపుతున్నారు. సగటున నెలసరిచూస్తే జెస్టీ వసూళ్లు 1.77 లక్షలకోట్లు రెండోత్రైమాసికంలో వసూలుచేసాయి. అదే మొదటి త్రైమాసికంలో అయితే సగటున 1.86 లక్షలకోట్లుగా ఉన్నట్లు ఆర్థికశాఖ ప్రకటించింది. లడక్‌లో అత్యధికంగా వృద్ధినమోదుచేసింది. ఈ రాష్ట్రంలో 30శాతం వృద్ధిరేటు ఉంటే కేరళ 20శాతం, హర్యానా 15శాతంతో వరుసగా మూడుస్థానాల్లో ఉన్నాయి. అరుణాచల్‌ప్రదేశ్ ఇతర ప్రాదేశిక కేటగిరీ ప్రాంతాల్లో 33శాతం, 37శాతం క్షీణతను నమోదుచేసాయి. ఇక 2024 ఆగస్టులో జీఎస్టీ 1.75 లక్షలకోట్లుగా ఉంది. స్థూల దేశీయరాబడులు 5.9శాతంపెరిగి సుమారుగా 1.27 లక్షలకోట్లుగా ఉన్నాయి. ఉత్పత్తుల దిగుమతులద్వారా వచ్చిన సుంకాల రాబడి 8శాతంపెరిగి 45,390 కోట్లుగా ఉన్నాయి. ఆగస్టునెలలో రీఫండ్లు 20,458 కోట్లుగా ఉన్నాయి. అంతకుముందు ఏడాదితోపోలిస్తే 31శాతం పెరిగినట్లు ఆర్థికశాఖ అంచనావేసింది.

# తొలి రోజు న్యూజిలాండ్ 235కు ఆలౌట్

## 149 పరుగుల వెనుకంజలో టీమిండియా



**న్యూఢిల్లీ:** భారత్-న్యూజిలాండ్ మధ్య మూడో టెస్టులో తొలి రోజు మ్యాచ్ ముగిసింది. ప్రపంచ టెస్టు చాంపియన్‌షిప్ 2023-25లో భాగంగా భారత్ జట్టు స్వదేశంలో న్యూజిలాండ్‌తో మూడు మ్యాచ్‌ల సిరీస్ ఆడుతోంది. ఇందులో భాగంగా మూడో టెస్టు తొలి ఇన్నింగ్స్‌లో భాగంగా ముంబై వాంఖడే స్టేడియంలో శుక్రవారం నాడు ఆట ముగిసేసరికి టీమిండియా 149 పరుగుల వెనుకంజలో ఉంది. ప్రస్తుతం భారత్ స్కోరు 4 వికెట్ల నష్టానికి 86 పరుగులతో ఉంది. క్రీజులో రిషబ్ పంత్ 1 పరుగుతోను, శుభ్‌మన్‌గిల్ 31 పరుగులతో ఉన్నారు. న్యూజిలాండ్ బౌలర్లలో అజాజ్ పటేల్ 2 వికెట్లు, మ్యాట్ హెన్రీ 1 వికెట్ దక్కించుకున్నారు. భారత్ తొలి ఇన్నింగ్స్ మొదలుపెట్టిన కాసేపటికే కెప్టెన్ రోహిత్ శర్మ 18 బంతుల్లో 18 పరుగులు చేసి పెవిలియన్ చేరాడు. ఆది నుండి దూకుడు కనపరచిన అతడు న్యూజిలాండ్ ఫీల్డర్ల తప్పిదాల వల్ల రెండు సార్లు అవుటయ్యే ప్రమాదం నుండి తప్పించుకున్నాడు. అయినప్పటికీ అగ్రెసివ్‌గా ఆడి పేసర్ మ్యాట్ హెన్రీ బౌలింగ్‌లో టామ్ లాథమ్‌కు క్యాచ్ ఇచ్చి వెనుదిరిగాడు. ఇక వన్‌డౌన్ బ్యాటర్ శుభమన్ గిల్‌తో కలిసి మరో ఓపెనర్ యశస్వి జైస్వాల్ భాగస్వామ్యంనెలకొల్పే ప్రయత్నం చేశాడు. కానీ కివీస్ స్పిన్నర్ అజాజ్ పటేల్ జైస్వాల్ 30 పరుగులు చేసేటప్పటికీ అతడిని బౌల్డ్ చేసి ఈ జోడీని విడదీశాడు. జైస్వాల్ స్థానంలో సిరాజ్ క్రీజులోకి వచ్చీ రాగానే అజాజ్ పటేల్ అతడిని వికెట్ల ముందు దొరకబుచ్చుకున్నాడు. దీంతో తొలి బంతికే సిరాజ్ డకౌట్‌గా వెనుదిరిగాడు. ఆ తర్వాత విరాట్ కోహ్లీ 4 పరుగులతో రనౌట్ అయి మరో సారి పేలవ ప్రదర్శన చేసి వికెట్ సమర్పించుకున్నాడు. ఫలితంగా 86 పరుగులకే 4 వికెట్లు కోల్పోయి టీమిండియా పీకల్లోతు కష్టాల్లో పడింది. అంతకు ముందు బ్యాటింగ్ చేసిన న్యూజిలాండ్ తొలి ఇన్నింగ్స్‌లో 235 పరుగులకు ఆలౌట్ అంది. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న న్యూజిలాండ్ శుభారంభాన్ని అందుకుంది. అయితే జట్టు స్కోరు 15 వద్ద ఉండగా ఓపెనర్ డెవాన్ కాన్వేను ఆకాష్ ఎల్బీడబ్ల్యూ చేశాడు. అనంతరం కెప్టెన్ టామ్ లాథమ్, విల్ యంగ్ 44 పరుగుల భాగస్వామ్యాన్ని నెలకొల్పారు.

ఈ సమయంలో వాషింగ్టన్ సుందర్ కెప్టెన్ లాథమ్‌ను ఔట్ చేయడం ద్వారా ఈ భాగస్వామ్యాన్ని బ్రేక్ చేశాడు. దీని తర్వాత ఇన్ ఫామ్ బ్యాటర్ రచిన్ రవీంద్ర ఎక్కువ సేపు మైదానంలో నిలవకుండా సుందర్ వేసిన బంతికి క్లీన్ బౌల్డ్ అయ్యాడు. రచిన్ ఔటైన తర్వాత డారిల్ మిచల్ అత్యధికంగా 82 పరుగులు చేశాడు. అతనితో పాటు, విల్ యంగ్‌కూడా 71 పరుగులు చేయగలిగాడు. రవీంద్ర జడేజా ఈ భాగస్వామ్యాన్ని విడతీశాడు. తొలుత యంగ్ వికెట్‌తీసిన అతడు తర్వాత టామ్ బ్లండెల్‌ను క్లీన్ బౌల్డ్ చేశాడు. తర్వాత గ్లెన్ ఫిలిప్స్‌ను కూడా జడేజా క్లీన్ బౌల్ చేశాడు. కివీస్ ఇన్నింగ్స్‌లో 61వ ఓవర్లలో జడేజా తొలుత ఇష్ సోధి వికెట్‌ను పడగొట్టి అదే ఓవర్లో మ్యాట్ హెన్రీని పెవిలియన్‌కుపంపాడు. సోధీ 7పరుగులు చేయగా, హెన్రీ ఖాతా తెరవలేకపో యాడు. చివరకు సుందర్ డారిల్ మిచెల్, అజాజ్ పటేల్ 7 పరుగులతో వాషింగ్టన్ ఔట్ చేయడంతో న్యూజిలాండ్ ఇన్నింగ్స్ 235 పరుగులకు ముగిసింది.




# స్టార్ ఆటగాళ్లు ఔట్

## రిటెన్షన్స్‌పై వీడిన సందిగ్ధత

### హైయస్ట్ హెన్రీచ్ క్లాసెస్ రూ.23 కోట్లున

### ఐపిఎల్ ప్లేయర్లను రిలీజ్ చేసిన ఫ్రాంచైజీలు

**న్యూఢిల్లీ:** ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపిఎల్)-2025 మెగా వేలానికి సమయం దగ్గరపడుతున్న నేపథ్యంలో రిటెన్షన్స్‌పై సస్పెన్స్ వీడింది. అన్ని ఫ్రాంచైజీలు తాము అట్టిపెట్టుకునే ప్లేయర్ల జాబితాలను విడుదల చేశాయి. స్టార్ ప్లేయర్ రోహిత్ శర్మను ముంబయి అట్టిపెట్టుకుంటుందా, ధోనీ మరో సీజన్ ఆడతాడా లాంటి అనేక సందేహాలపై క్లారిటీ వచ్చింది. ఇదే సమయంలో రిటెన్షన్‌లో అత్యధిక ధర పలికిన ప్లేయర్‌గా హెన్రీచ్ క్లాసెన్ అగ్రస్థానంలో ఉన్నాడు. ఇతనిని 23 కోట్ల రూపాయలకు సన్ రైజర్స్ హైదరాబాద్ ఫ్రాంచైజీ దక్కించుకుంది. రోహిత్ ముంబయితోనే కొనసాగనుండగా, ధోనీని అన్‌క్యాప్డ్ ప్లేయర్‌గా చెన్నై అట్టిపెట్టుకుంది. అయితే రిటెన్షన్స్‌ను పక్కనపెటితే పలు నిబంధనల కారణంగా అన్ని ఫ్రాంచైజీలు తమ తమ స్టార్ ప్లేయర్లను వదులుకుంది. అలా ఫ్రాంచైజీల నుండి దూరమై, మెగా వేలంలోకి రానున్న కీలక ఆటగాళ్లు ఎవరనేది వెల్లడైంది. ఇక పలువురు స్టార్‌లు, డైనమెట్లను వదులుకున్న నేపథ్యంలో వీరందరూ మెగా వేలంలోకి రానున్న దృష్ట్యా వారిని దక్కించుకునేందుకు పలు ఫ్రాంచైజీలు ప్లాన్ చేసుకుంటున్నాయి.

మెగా వేలంలో కేఎల్ రాహుల్ లేదా రిషబ్ పంత్‌ను దక్కించుకునేందుకు రాయల్ ఛాలెంజర్స్ బెంగుళూరు వ్యూహాలు రచిస్తోంది. ఈ ఇద్దరిలో ఎవరిని దక్కించుకున్నా వికెట్ కీపింగ్, కెప్టెన్సీతో జట్టుకు ఉపయోగపడతారు. ఒక వేళ విరాట్ కోహ్లీ జట్టు కెప్టెన్సీ బాధ్యతలు తీసుకునేందుకు ఆసక్తి కనపర్చుకుంటే ఈ ఇద్దరిలో ఒకరి కోసం బెంగుళూరు వేలంలో పోటీ పడే అవకాశాలు ఉన్నాయి. అలాగే రైట్ టు మ్యాచ్ కార్డ్ ఆప్షన్ కింద పాత ప్లేయర్లు డూప్లేసిస్, గ్లెన్ మ్యాక్స్‌వెల్, మహ్మద్ సిరాజ్, కామరూన్ గ్రీన్‌ను తిరిగి జట్టులోకి తెచ్చుకునే వీలు కూడా ఉంది. ఇక రిటెన్షన్‌లో అత్యధిక ధరల పలికిన ప్లేయర్లలో 23 కోట్ల రూపాయలతో హెన్రీచ్ క్లాసెన్‌ను సన్‌రైజర్స్ అత్యధిక ధరకు కొనుగోలు చేయగా, 21 కోట్ల రూపాయలకు నికోలస్ పూరన్‌ను లక్నో సూపర్ జెయింట్స్, 21 కోట్ల రూపాయలకు విరాట్ కోహ్లీని రాయల్ ఛాలెంజర్స్ బెంగుళూరు కొనుగోలు చేసింది.

కాగా ఫ్రాంచైజీలు వదులుకున్న స్టార్లు, కీలక ప్లేయర్లలో ముంబాయి ఇండియన్స్ ఇషాన్ కిషన్, టిమ్ డేవిడ్, డివాల్డ్ బ్రేవిస్, గెరాల్డ్ కాట్జీ ఉండగా, రాయల్ ఛాలెంజర్స్ బెంగుళూరు నుండి ఫాఫ్ డూప్లేసిస్, మహ్మద్ సిరాజ్, గ్లెన్ మ్యాక్స్‌వెల్, విల్ జాక్స్, చెన్నై సూపర్ కింగ్స్ డేవన్ కాన్వే, మిచెల్ శాంట్నర్, దీపక్ చాహర్, రచిన్ రవీంద్ర, దిల్లీ క్యాపిటల్స్ నుండి రిషబ్ పంత్, డేవిడ్ వార్నర్, జేక్ ఫ్రేజర్, కోల్‌కతా నైట్ రైడర్స్ నుండి శ్రేయస్ అయ్యర్, మిచెల్‌స్టార్క్, వెంకటేశ్ అయ్యర్, లక్నో సూపర్ జెయింట్స్ కెఎల్ రాహుల్, క్వింటన్ డికాక్, దేవదత్ పడిక్కల్, మార్కస్ స్టొయినిస్, సన్ రైజర్స్ హైదరాబాద్ నుండి భువనేశ్వర్ కుమార్, ఎయిడెన్ మర్‌క్రమ్, వాషింగ్టన్ సుందర్, గుజరాత్ టైటాన్స్ నుండి డేవిడ్ మిల్లర్, మహ్మద్ షమీ, పంజాబ్ కింగ్స్ శిఖర్ ధావన్, కగిసొ రబాడా, అర్షదీప్ సింగ్, రాజస్థాన్ రాయల్స్ ఫ్రాంచైజీ నుండి జాన్ బట్లర్, యుజ్వేంద్ర చాహల్, ట్రెంట్ బోల్ట్ ఔటయ్యారు.

## టీమిండియాతో టి20కి దక్షిణాఫ్రికా జట్టు ఫైనల్

**న్యూఢిల్లీ:** టీమిండియాతో త్వరలో జరగబోయే నాలుగు మ్యాచ్‌ల టి20 సిరీస్ కోసం దక్షిణాఫ్రికా జట్టును ప్రకటించారు. ఈ జట్టుకు సారథిగా ఎయిడెన్ మార్క్రమ్ ఎంపికయ్యాడు. గత కొంత కాలంగా అంతర్జాతీయ క్రికెట్‌కు దూరంగా ఉన్న మార్కో జన్సెన్, గెరాల్డ్ కొయెట్జీ ఈ సిరీస్‌తో రీ ఎంట్రీ ఇవ్వనున్నారు. అయితే లుంగి ఎంగిడిని పరిగణలోకి తీసుకోలేదు. ఇక దక్షిణాఫ్రికా అరబిక్ ఎమిరేట్స్‌లో ఆడిన వైట్‌బాల్ సిరీస్‌లకు దూరంగా ఉన్న హెన్రిచ్ క్లాసెస్, డేవిడ్‌మిల్లర్, కేశవ్ మహారాజ్ 16 మంది సభ్యులతో కూడిన ఈ జట్టుకు ఎంపికయ్యారు. ఈసిరీస్‌లో కగిసో రబాడ ఆడటం లేదు. సెలక్టర్లు అతడికి విశ్రాంతినిచ్చారు. ఆలౌరౌండర్ మిహ్లాలీ మ్పోంగ్వానా తొలిసారి జాతీయ జట్టుకు ఎంపిక కాగా, అన్‌క్యాప్డ్ ఆలౌ రౌండర్ల అండిల్ సైమ్‌లేన్‌కూడా జట్టులో చోటు దక్కించుకున్నాడు. దక్షిణాఫ్రికాజట్టులో ఎయిడెన్ మార్క్రమ్ (కెప్టెన్), ఒట్నీల్ బార్ట్‌మన్, గెరాల్డ్ కొయెటనఈజ, డోనోవన్ ఫెరీరా, రీజా హెండ్రిక్స్, మార్కో జన్సెన్, హెన్రిచ్ క్లాసెన్, పాట్రిక్ క్రూగర్, కేశవ్ మహారాజ్, డేవిడ్ మిల్లర్, మిహ్లాలీ మ్పోంగ్వానా, నకాబా పీటర్, ర్యాన్ రికెల్టన్, అండీల్ సైమ్‌లేన్, లూథో సిపామ్లా, రిస్టన్ స్టబ్స్ ఉన్నారు.

# టెస్ట్ సిరీస్ దక్షిణాఫ్రికా కైవసం

## బంగ్లాదేశ్‌పై 273 పరుగుల తేడాతో అతిపెద్ద విజయం

**న్యూఢిల్లీ:** బంగ్లాదేశ్‌తో జరిగిన రెండో టెస్టులో దక్షిణాఫ్రికా భారీ విజయం సాధించి సిరీస్‌ను కైవసం చేసుకుంది. పసికూన బంగ్లాదేశ్‌ను చిత్తుచిత్తుగా ఓడించి 2-0 తేడాతో టెస్ట్ సిరీస్‌లో ఆధిక్యం సంపాదించింది. చటోగ్రామ్ వేదికగా బహుర్ అహ్మద్ స్టేడియంలో ముగిసిన ఈ మ్యాచ్ ఇన్నింగ్స్‌లో 273 పరుగుల తేడాతో తమ క్రికెట్ చరిత్రలోనే అతి పెద్ద విజయాన్ని నమోదు చేసుకుంది. ఇదే సమయంలో బాంగ్లాదేశ్ టెస్టు క్రికెట్ చరిత్రలో రెండో అతి పెద్ద పరాజయాన్ని మూటగట్టుకుంది. తొలి ఇన్నింగ్స్‌లో 159 పరుగులకే బాంగ్లాదేశ్ జట్టు ఆలౌట్ అయింది. దానికి ఫాలో ఆన్ ఆడుతూ బంగ్లాదేశ్ 143 పరులకు ఆలౌట్ అయింది. రెండో ఇన్నింగ్స్‌లో స్పిన్నర్లు ముత్తుస్వామి, కేశవ్ మహారాజ్ విజృంభించడంతో బంగ్లాదేశ్ జట్టు దగ్గర సమాధానమే లేకుండా పోయింది. కేశవ్ మహారాజ్ 5 వికెట్లు పడగొడితే, ముత్తుస్వామి 4 వికెట్లు దక్కించుకున్నాడు. ఇక 4 వికెట్లుకు 38 పరుగుల వద్ద మూడో రోజు తొలి ఇన్నింగ్స్ ప్రారంభించిన బంగ్లాదేశ్ రబడా 5 వికెట్లు తీయడంతో 159 పరుగులకు ఆలౌట్ అయింది. బంగ్లాదేశ్ జట్టులో కెప్టెన్ శాంటో 82 పరుగులతో టాప్ స్కోరర్‌గా నిలిచాడు. అంతకు ముందు మొదట బ్యాటింగ్ చేసిన దక్షిణాఫ్రికా టోనీ డి జోర్జి 177 పరుగులతో భారీ సెంచరీ చేసి విధ్వంసం సృష్టించాడు. దీనికి తోడు స్టబ్స్ 106 పరుగులు, మల్డర్ 105 పరుగులతో సెంచరీలు బాది బంగ్లా బౌలర్లను ముప్పుతిప్పలు పెట్టారు. దీంతో తొలి ఇన్నింగ్స్‌లో దక్షిణాఫ్రికా 6 వికెట్ల నష్టానికి 575 పరులుగుల వద్ద ఇన్నింగ్స్ డిక్లేర్ చేసింది. తైజుల్ ఇస్లాం 5 వికెట్లు పడగొట్టాడు. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్‌గా టోనీ డి జోర్జి ఎంపికయ్యాడు. కగిసో రబడాకు ప్లేయర్ ఆఫ్ ది సిరీస్ అవార్డు దక్కింది.



# ఈ నెలలో కీలక మార్పులు ఇవిగో!

**ముంబై, నవంబరు 1:** ప్రతి నెల ప్రారంభంలో గ్యాస్ సిలిండర్ నుంచి ఆధార్ కార్డు, క్రెడిట్ కార్డు, టెలికం వరకు వివిధ మార్పులు అవుతుంటాయి. దీని ప్రకారం, అక్టోబరు ప్రారంభంలో కూడా అనేక మార్పులు జరిగాయి. అదేవిధంగా నవంబరులో జరగబోయే మార్పులు చూద్దాం. ప్రతి నెల ప్రారంభంలో చమురు కంపెనీలు ఎల్‌పిజి గ్యాస్ సిలిండర్ల ధరలను సవరిస్తాయి. దీని ప్రకారం నవంబర్ 1 నుంచి గ్యాస్ సిలిండర్ ధరలో మార్పు ఉండబోతున్నట్లు తెలిసింది. గృహావసరాల గ్యాస్ సిలిండర్ల ధరలు గత కొన్నినెలలుగా యధాతథంగా ఉండడం విశేషం. ఎల్‌పిజి గ్యాస్ సిలిండర్ ధరలను మాత్రమే కాకుండా సిఎన్‌జి, పిఎన్‌జి ధరలను కూడా చమురు కంపెనీలు మార్చబోతున్నట్లు తెలిసింది. గత కొన్ని నెలలుగా సిఎన్‌జి సహా ఏటిఎఫ్ ధరలు తగ్గించాయి. దీనికి ప్రధాన కారణంగా పండుగ సీజన్‌గా భావించారు. ఈ పరిస్థితిలో నవంబర్ 1 నుంచి వీటి ధరల్లో మార్పు రావచ్చని భావిస్తున్నారు. ఎస్‌బిఐ బ్యాంకు క్రెడిట్ కార్డు నిబంధనలలో నవంబర్ నుంచి కొత్త మార్పులను తీసుకురావాలని యోచిస్తోంది. దీని ప్రకారం నవంబర్ 1 నుంచి అసురక్షిత క్రెడిట్ కార్డులకు నెలవారీ ఫైనాన్స్ చార్జీ 3.75శాతం వసూలు చేస్తుంది. అంతేకాకుండా ఎస్‌బిఐ క్రెడిట్ కార్డుని ఉపయోగించి విద్యుత్, గ్యాస్ వంటి యుటిలిటీల కోసం మీరురూ.50 వేల కంటే ఎక్కువ చెల్లిస్తే ఒక శాతం రుసుము వసూలు చేయనున్నట్లు తెలుస్తోంది. అదేవిధంగా మ్యూచువల్ ఫండ్స్ కోసం సెబి కఠినమైన ట్రేడింగ్‌నిబంధనలను ప్రవేశపెట్టబోతున్నట్లు తెలిసింది. దీని ప్రకారం నవంబర్ 1 నుంచి ఎఎంసిలు నామినీలు లేదా బంధువులకు సంబంధించి రూ.15 లక్షల కంటే ఎక్కువ లావాదేవీలు నిర్వహిస్తే అధికారులకు రిపోర్టుచేయాల్సి ఉంటుందని చెబుతున్నారు. స్పామ్‌లను నివారించడానికి మెసేజ్ ట్రేసబిలిటీని అమలు చేయాలని జియో, ఎయిర్‌టెల్‌తో సహా టెలికం కంపెనీలకు ప్రభుత్వం ఆదేశించింది. దీని కారణంగా టెలికం కంపెనీలు ఏవైనా కొత్త నిబంధనలను అమలు చేసే అవకాశం ఉందని భావిస్తున్నారు. పైన పేర్కొన్న మార్పులన్నీ నవంబర్ 1 నుంచి అమల్లోకి రానున్నాయి.




## ఫేక్, స్పామ్ కాల్స్‌పై ట్రాయ్ కొత్త ఆంక్షలు

**న్యూఢిల్లీ, నవంబరు 1:** ఇటీవల టెలికం నిబంధనలను మార్చింది. ఫేక్, స్పామ్ కాల్స్ నిరోధించడానికి ట్రాయ్ ప్రధానంగా నిబంధనలను తీసుకు వచ్చింది. ట్రాయ్ చేసిన కొత్త మార్పులు నవంబరు 1 నుంచి దేశవ్యాప్తంగా అమల్లోకి వచ్చాయి. అందుకే మీరు జియో, ఎయిర్‌టెల్, వొడాఫోన్ ఐడియా, బిఎస్ఎన్ఎల్ వంటి ఏదైనా ఆపరేటర్‌కు కస్టమర్ అయితే అది మీకు చాలా ప్రయోజకరంగా ఉంటుంది. మెసేజ్ ట్రాకింగ్‌ను అమలు చేయాలని ఇటీవల ట్రాయ్ టెలికం కంపెనీలను ఆదేశించింది. ఇందు కోసం టెలికం రెగ్యులేటరీ అథారిటీ ఆఫ్ ఇండియా నవంబర్ 1వ తేదీని నిర్ణయించింది. కొత్త టెలికం నిబంధనలు అమల్లోకి వచ్చాయి. మెసేజ్ డిటెక్షన్ అంటే మొబైల్ ఫోన్‌ల నుంచి వచ్చే అన్ని ఫేక్ కాల్స్, మెసేజ్‌లను ఆపడానికి పనిచేసే సిస్టమ్ ఇది. నవంబరు 1 నుంచి మీ ఫోన్‌కి నకిలీ, స్పామ్ కాల్‌ల పర్యవేక్షణ పెరుగుతుంది. ఈ కొత్త ట్రాయ్ నియమం నకిలీ కాల్‌లను గుర్తించడం, ట్రాక్ చేయడం సులభం చేస్తుంది. ఆగస్టు నెలలో అన్ని టెలికం ఆపరేటర్లకు ట్రాయ్ నోటీసులు జారీచేసింది. టెలి మార్కెటింగ్, ఏదైనా ప్రమోషన్‌కు సంబంధించిన బ్యాంకులు, ఇ-కామర్స్, ఆర్థిక సంస్థల నుంచి వచ్చే అన్ని సందేశాలను బ్లాక్ చేయాలని ట్రాయ్ తెలిపింది. టెలిమార్కెటింగ్ సందేశాలు, కాల్‌లను నిరోధించాలని ట్రాయ్ తన మార్గదర్శకాల్లో పేర్కొంది. ఈ సిస్టమ్ ద్వారా వినియోగదారులకు ఇబ్బందులు తొలగనున్నాయి. అయితే కొత్త నిబంధన అమలులోకి వచ్చిన తర్వాత ఇది కొందరికి సమస్యగా మారుతుంది. సమస్య ఏమిటంటే అవసరమైన బ్యాంకింగ్ సందేశాలు, ఒటిపిలను స్వీకరించడంలో ఇది ఆలస్యం కావచ్చు. భారతదేశంలో ప్రతి రోజూ దాదాపు 1.5నుంచి 1.7 బిలియన్ల వాణిజ్య సందేశాలు వస్తున్నాయి.




## ఇక జియో నుంచి డిజిటల్ చెల్లింపులు

**న్యూఢిల్లీ, నవంబరు 1:** దేశంలో డిజిటల్ చెల్లింపుల వ్యవస్థ మరింతగా విస్తరిస్తోంది. ఇప్పటి వరకు పేటిఎం, ఫోన్‌పే, గూగుల్‌పే లాంటి యాప్స్ ద్వారా డిజిటల్ చెల్లింపులు చేస్తుండగా, ఇప్పుడు ఆ జాబితాలో జియో చేరనుంది. ఇక నుంచి ఫోన్‌పే, పేటిఎం లాగే జియో నుంచి కూడా చెల్లింపులు చేయవచ్చు. ముఖేష్ అంబానీకి చెందిన జియో భారీ విజయాన్ని సాధించింది. ఇప్పుడు జియో పేమెంట్ సొల్యూషన్స్ రిజర్వ్ బ్యాంకు ఆఫ్ ఇండియా నుంచఇ ఆమోదం పొందింది. జియో పేమెంట్ సొల్యూషన్స్ అనేది జియో ఫైనాన్షియల్ సర్వీసెస్ అనుబంధ సంస్థ. ఆర్‌బిఐ నుంచి ఆమోదం పొందిన తర్వాత, జియో పేమెంట్ ఇప్పుడు ఆన్‌లైన్ చెల్లింపు అగ్రిగేటర్‌గా కార్యకలాపాలను ప్రారంభించనుంది. జియో పేమెంట్ ఇప్పుడు వ్యాపారులు, వినియోగదారులకు డిజిటల్ లావాదేవీ సౌకర్యాలను అందించనుంది. ఇది పేటిఎం లాంటి సర్వీస్‌ను అందిస్తుంది. దిగ్గజం ఫిన్‌టెక్ సంస్థ పేటిఎం బ్యాంకు ఆర్‌బిఐ నియంత్రణ చర్యను ఎదుర్కోవాల్సిన సమయంలో జియో ఈ ఆమోదం పొందింది. మార్కెట్లో మంచి యూజర్‌బేస్‌ను సృష్టించగలిగినప్పుడు జియో పేమెంట్‌కు గొప్ప అవకాశం ఉంది. జియో పేమెంట్స్ బ్యాంకు అనేక రకాల సేవలను అందిస్తోంది. ఇది బయోమెట్రిక్ ప్రమాణీకరణ, ఫిజికల్ డెబిట్ కార్డుతో డిజిటల్ సేవింగ్స్ ఖాతాను అందిస్తుంది.



# వాణిజ్యం

## ఐపిఓల ద్వారా రియల్ ఎస్టేట్ రూ.13,500 కోట్లు సమీకరణ

**ముంబై, నవంబరు 1:** భారతదేశంలోని రియల్ ఎస్టేట్ రంగం ఈ యేడాది ఇప్పటి వరకు మార్కెట్ల నుంచి ప్రారంభ పబ్లిక్ ఆఫర్‌ల ద్వారా దాదాపు రూ.13,500కోట్లను సమీకరించింది. 2023లో సేకరించిన మొత్తం కంటే దాదాపు రెండింతలు. నివేదిక ప్రకారం, అనేక రంగాలలో 123 తాజా ఇష్యూలు, 2023లో చూసిన మొత్తం ఐపిఒల సంఖ్యను 2024 ఇప్పటికే అధిగమించిందని కొలియర్స్ ఇండియా నివేదిక తెలిపింది. 2017-2020 మధ్యకాలంలో గత నాలుగు సంవత్సరాలలో 11 లిస్టింగ్‌ల కంటే, 21 రియల్‌ఎస్టేట్ ఐపిఒలు ఎక్కువగా ఉన్నాయి. కరోనా మహమ్మారి అనంతరం 21 రియల్ ఎస్టేట్ కంపెనీలు ఐపిఒల ద్వారా రూ.31,900 కోట్లను సమీకరించాయి. అంతకుముందు నాలుగేళ్ల కాలంలో సేకరించిన నిధుల కంటే రెండింతలు ఎక్కువ. రియల్‌ఎస్టేట్ ఐపిఒలలో ట్రాక్షన్ ఎక్కువగా హౌసింగ్ ఫైనాన్స్ సంస్థలచే లీడర్‌షిప్ వహిస్తుంది. ఇది 2021-2024 మధ్యకాలంలో సేకరించిన మూలధనంతో 46శాతం, రియల్ ఎస్టేట్ ఇన్వెస్ట్‌మెంట్ ట్రస్ట్‌లు 22శాతం వాటాతో ఆకర్షించాయి. రెసిడెన్షియల్, కమర్షియల్, రిటైల్ రంగాలలో బలమైన డిమాండ్ కొనసాగుతుందని, ఇది డెవలపర్‌లు, హెచ్‌ఎఫ్‌సిలు, ఆర్‌ఇఐటిల ఐపిఒల పట్ల ఉత్సాహాన్ని కొనసాగించవచ్చని కొలియర్స్ తెలిపారు. ముఖ్యంగా గ్రేడ్ ఎ కార్యాలయాలు, మాల్స్ ఉన్న వారు భవిష్యత్తులో వడ్డీ రేట్ల తగ్గింపు రియల్ ఎస్టేట్ కార్యకలాపాలను మరింత పెంచవచ్చు. నివాస ఆస్తులపై ప్రాథమిక దృష్టిసారించిన ప్రముఖ రియల్ ఎస్టేట్ డెవలపర్లు కూడా రూ.5,600 కోట్ల వద్ద గణనీయమైన నిధులను సమీకరించారని, గత నాలుగేళ్ల కాలంతో పోలిస్తే 10 రెట్లు ఎక్కువ అని నివేదికలో పేర్కొంది. రుణరేట్లలో తగ్గింపు అంచనాలు, రియల్ ఎస్టేట్ కార్యకలాపాలను మరింత పెంచగలవని నివేదిక పేర్కొంది. ఇటీవలి సంవత్సరాలలో, స్టాక్ ఎక్స్ఛేంజీలలో రియల్ ఎస్టేట్ ఐపిఒలు వాల్యూమ్‌లో పెరగడమే కాకుండా కొత్త కేటగిరీలుగా కూడా మారాయి.




## ఎలక్ట్రిక్ టూవీలర్ కంపెనీలపై సిసిపిఎ నజర్

**ముంబయి, నవంబరు 1:** కేంద్ర వినియోగరంగ పరిరక్షణ సంస్థకు ఎలక్ట్రిక్ స్కూటర్ల సేల్స్ సర్వీసులపై 12వేలకుపైగా ఫిర్యాదులు రావడంతో ఇపుడు సిసిపిఎ వాటిపై దృష్టిపెట్టింది. ముఖ్యంగా బజాజ్ ఆటో, టివిఎస్ మోటా, ఏథర్ ఎనర్జీ సంస్థలపైనే ఈ ఫిర్యాదులు ఎకునకవగా ఉన్నాయి. కేంద్ర వినియోగరంగ వ్యవహారాల మంత్రిత్వశాఖ వీటిపై ముందు దర్యాప్తు చేయాలని ఆదేశాలు జారీ చేసింది. ఓలా ఎలక్ట్రిక్ ఇటీవలే తమకు అందిన అన్ని ఫిర్యాదులను పరిష్కరించామని సిఎఫ్ఒ హరిష్ అభిచందాని వెల్లడించడంతో ఇతర ఫిర్యాదులపై ఫోకస్ పెంచారు. కంపెనీ 99.1శాతం ఫిర్యాదులు పరిష్కరించా మని, 10,644 ఫిర్యాదుల్లో దాదాపుగా అన్నింటినీ పరిష్కరించామని చెపుతున్నారు. ఎలక్ట్రిక్ టూవీలర్ల విక్రయానంతర సేవలపై కస్టమర్లలో తీవ్ర స్థాయిలో అసంతృప్తి నెలకొంది. అందువల్లనే వీటి సేల్స్, మార్కెట్ టర్నోవర్‌కూడా తగ్గుతున్నట్లు వెల్లడి అవుతున్నది. అందువల్లనే రీఫండ్ పాలసీని అమలు చేయాలని సిసిపిఎ చీఫ్ కమిషనర్ నిధి ఖేర్ ఆదేశాలు జారీ చేసారు. ఓలా ఎలక్ట్రిక్ సంస్థకు ఇటీవల ఆటోమోటివ్ రీసెర్చ్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా (అరాయ్)కు కూడా ఎక్కువ ఫిర్యాదులు వెళ్లాయి. ప్రభుత్వ సబ్సిడీలకు అనుగుణంగా వారంటీ, ధరల పరంగా కూడా కంపెనీపై ఫిర్యాదులు వెల్లువెత్తాయి. ఈ మూడు కంపెనీలపై వచ్చిన ఫిర్యాదులతో ఎలక్ట్రిక్ స్కూటర్ మార్కెట్‌లో టర్నోవర్ పూర్తిగా తగ్గిందనే చెప్పాలి.



## 2.2 లక్షలకు పెరిగిన ట్యాక్స్ పేయర్స్

**న్యూఢిల్లీ, నవంబరు 1:** ఆదాయపు పన్ను చెల్లింపుదారుల సంఖ్య భారీగాపెరుగుతోంది. 2013 ఆర్థిక సంవత్సరంలో మిలియనీర్ పన్ను చెల్లింపుదారుల సంఖ్య 44వేలు మాత్రమే కాగా, 2024 ఆర్థిక సంవత్సరంలో ఈ సంఖ్య 2.2 లక్షలకు చేరుకుంది. కేవలం 10 యేళ్లలో భారత ఆర్థిక వ్యవస్థ ధనికులపై సంపదను కురిపించింది. ఒక నివేదికలో అసెస్‌మెంట్ సంవత్సరంలో రూ.కోటి కంటే ఎక్కువ ఆస్తులను ప్రకటించిన వ్యక్తులందరూ ఉన్నారు. పన్ను వ్యవస్థలో నిరంతర మెరుగుదల కారణంగా ప్రత్యక్ష పన్ను వాటా మొత్తం పన్ను ఆదాయంలో 56.7 శాతానికి పెరిగింది. 2023 ఆర్థిక సంవత్సరంలో ఈ సంఖ్య 54.6 శాతంగా ఉంది. అలాగే ఈ సంఖ్య 14 యేళ్లలో అత్యధికం. వ్యక్తిగత ఆదాయపు పన్ను వసూళ్లు కార్పొరేట్ పన్నువసూళ్లను అధిగమించాయి. అంతేకాకుండా ఒకదశాబ్దంలో మొత్తం పన్ను చెల్లింపుదారుల సంఖ్య కూడా 2.3 రెట్లు పెరిగింది. 2024 అసెస్‌మెంట్ మదింపు సంవత్సరంలో మొత్తం పన్ను చెల్లింపుదారుల సంఖ్య 8.62 కోట్లకు పెరిగింది. రూ.10 లక్షల కంటే ఎక్కువ ఆదాయం ఉన్న వారికే అత్యధికంగా పెంపుదల ఉంది. దేశంలో మధ్యతరగతి విభాగం వేగంగా వృద్ధి చెందుతోందని నివేదికలో పేర్కొంది. 2014 అసెస్‌మెంట్ సంవత్సరంలో రూ.1.5నుంచి 5లక్షల ఆదాయం ఉన్న వారు 2024 సంవత్సరంలో రూ.2.5నుంచి రూ.10 లక్షల ఆదాయ సమూహంలోకి వచ్చారు. అంతేకాకుండా మొత్తం పన్ను చెల్లింపుదారులలో మహిళా పన్ను చెల్లింపుదారుల సంఖ్య 15 శాతానికి పెరిగింది. ఐటిఆర్ ఫైలింగ్‌ల సంఖ్య యేటా పెరుగుతోందని కూడా ఆ నివేదిక వెల్లడించింది.




Printed and Published by Girish Sangi, CMD And Manging Editor On Behalf Of Aga AGA Publications LTD, MGM Hospital road Warangal , TELANGANA-506002 RIN No ; 64849/96 Editor * Damerla Saibaba, * Responsible for Selection Of News Under the PRB Act. Regd : No.H/SD/337/12-14 postal line liance-L/R NP WGL-8/12-14